అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

శనివారం 24-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 57 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

## ఆధార్ చేర్చకుంటే.. బినామీ ఆస్తులే

**అసైన్డ్ భూములకూ పాస్ పుస్తకాలు**

- యాజమాన్యంపై స్పష్టత వచ్చాకే పంపిణీ
- తొందరపాటు వద్దు.. క్షుణ్ణంగా పరిశీలించండి: కొత్త పాస్‌పుస్తకాల పంపిణీపై సీఎం సమీక్ష



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భూ రికార్డుల్లో ఆధార్ కార్డు నెంబర్‌ను నమోదు చేయించుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. లేనట్టయితే ఆ భూములను బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుందని అన్నారు. భూ రికార్డులకు ఆధార్ కార్డు లింక్ చేయడానికి వెనుకాడుతున్న వారు ఇప్పటికైనా ముందుకు రావాలన్నారు. పట్టాదారులతో పాటుగానే అసైన్డ్ భూములు కలిగిన వారికి కూడా కచ్చితంగా కొత్త పట్టాదారు 9లో



# తప్పుల తడక

## ప్రహసనంలా టీఆర్టీ హాల్‌టికెట్ల పంపిణీ

తెలంగాణలో తొలిసారి జరుగుతున్న ఉపాధ్యాయ నియామకపరీక్ష(టీఆర్టీ) సజావుగా జరుగుతుందా..! అన్న ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నది. హాల్‌టికెట్ల పంపిణీ మొదలుకుని..వచ్చిన వాటిలోనూ తప్పులు దొర్లాయి. ఫొటోలు తారుమారయ్యాయి. సెంటర్లూ తారుమారయ్యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫిర్యాదు కేంద్రం ఉన్నా నిరుపయోగమే.హెల్ప్‌డెస్క్ ఫోనునెంబర్లు పనిచేయటంలేదు.ఇలాంటి పరిస్థితిలో తమకు న్యాయం చేయాలంటూ టీఎస్పీఎస్సీ వద్ద అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనికి అధికారులెవరూ సమాధానం చెప్పటానికి అస్సలు ఇష్టపడటంలేదు. లక్షలాది మంది జీవితాలతో తెలంగాణ సర్కారు చెలగాటమాడుతున్న తీరుపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 9లో

- టీఎస్‌పీఎస్సీ వద్ద అభ్యర్థుల ఆందోళన
- పోలీసు లాఠీలతోనే సమాధానం
- దరఖాస్తు చేసినా రాని హాల్‌టికెట్లు
- హెల్ప్‌డెస్క్ ఉన్నా ప్రయోజనం సున్నా
- పర్సెంటేజీల పేరుతో మాకు అన్యాయం : అభ్యర్థులు
- నేటినుంచి రాతపరీక్షలు





హైదరాబాద్‌లో టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద..

## నిధులు గోల్‌మాల్

- వికారాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రైతుల రుణాలు స్వాహా
- ఇన్‌చార్జి మేనేజర్ సస్పెండ్
- ఆడిటర్ల విచారణ



నవతెలంగాణ-వికారాబాద్ రూరల్

వికారాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అధికారుల చేతివాటంతో భారీ ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగింది. రైతులకు తక్కువ రుణం ఇచ్చి ఎక్కువ ఇచ్చినట్టు రికార్డుల్లో సృష్టించి ఆ నిధులను పక్కదోవ పట్టించారు. వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామ రైతులు ఫిర్యాదు 9లో



# రైతు ముట్టడి ఉద్రిక్తం



జగిత్యాలలో రైతుల ర్యాలీ..

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కోసం ఉత్తర తెలంగాణలో అన్నదాతల పోరు తీవ్రరూపం దాల్చుతున్నది. దళారుల మోసాలను అరికట్టాలని...మద్దతు ధర ఇవ్వాలని కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులుగానీ, ప్రభుత్వంగానీ పట్టించుకోకపోవటంతో శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ గేట్‌కు ఓ అన్నదాత ఉరేసుకున్నాడు. రెప్పపాటులో తోటి రైతులు, పోలీసులు గ్రహించి ఆ అన్నదాత మెడకు తాడు బిగుసుకోకుండా కాళ్లపైకెత్తి కాపాడారు. ఆ తర్వాత కలెక్టరేట్ గేట్లను తోసుకుని రైతులు లోనికెళ్లేందుకు యత్నించగా కొద్దిసేపు రైతులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. వేలాది మందితో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఈ ఘటనతో ఉద్రిక్తంగా మారింది.



**జగిత్యాల కలెక్టరేట్ గేటుకు అన్నదాత ఉరి**

- కాళ్లు పైకెత్తి..తాడు పట్టుకుని కాపాడిన తోటి రైతులు, పోలీసులు
- మద్దతు ధర కోసం వేలాది మంది ఆందోళన
- పట్టించుకోని అధికారులు

వివరాలు 9లో

# కాళేశ్వరంపై పిటిషన్ కొట్టివేత

**హైకోర్టు తీర్పుపై స్టేకు సుప్రీం నిరాకరణ**

- ద్విసభ్య ధర్మాసనం నిర్ణయం
- కేసుల వెనకున్న కాంగ్రెస్ నేతల పేర్లు బయటపెడతా : హరీశ్‌రావు



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు వెలువరించిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సర్వోన్నత న్యాయస్థానం... తొమ్మిది సంవత్సరాలుగా ఏం చేస్తున్నారని పిటిషనర్ హయాతుద్దీన్‌ను ప్రశ్నించింది. ఆలస్యంగా కోర్టుకు వచ్చారంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. పైగా కేసు విచారణ కోసం పిటిషనర్ 'ఫోరం హంటింగ్' చేస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. కాగా పిటిషనర్‌కు జరిమానా విధించాలన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని న్యాయస్థానం 9లో

## కృష్ణా ట్రిబ్యునల్ విచారణ మార్చికి వాయిదా 9

## రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

**16 రాష్ట్రాలు..58 సీట్లకు..**

- షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- తెలంగాణలో.. మూడు స్థానాలకు ఎన్నికలు



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లోని 58 రాజ్యసభ స్థానాలకు ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుండగా.. 23వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు ఈసీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ 58 సీట్లలో తెలంగాణలో మూడు, ఏపీలో మూడు స్థానాలున్నాయి. అత్యధికంగా 9లో

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఓటుకు నోటు కేసులో అప్రూవర్‌గా మారుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఏ 4 జెరూసలేం మత్తయ్య లేఖ రాశారు. అప్రూవర్ గా మారుతున్నట్టు సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు నోటు కేసులో తనకు అసలు సంబంధం లేదని, తనను అటు టీడీపీ, ఇటు టీఆర్‌ఎస్ ప్రభుత్వాలు వాడుకోవాలని చూశాయన్నారు. తాను స్టీఫెన్సన్ ని కలిసింది క్రిస్టియన్ సమస్యల మీదనేనని అన్నారు. అతనితో ఏ ఇతర అంశాలు చర్చించలేదని పేర్కొ న్నారు. నన్ను ఉపయోగించి చంద్రబాబును ఇరికించాలని చూసారని అన్నారు. నాకు కేటి ఆర్, కేటీఆర్ గన్ మెన్ ఫోన్ చేయడంతో ఆయన్ను ఇరికించేందుకు ఏపీ ప్రభుత్వం వాడుకోవాలని చూసిందన్నారు. హైకోర్టులో కేసు ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం తనకు సహకరించిందన్నారు. సుప్రీంకోర్టు కేసు విషయంలో నాకు ఎవరూ సమాచారం ఇవ్వడం లేదన్నారు. తనకు తెలిసిన విషయం మొత్తం కోర్టుకు చెబుతానని పేర్కొన్నారు.




వచ్చే ఏడు.. మనతో కూడా సెల్ఫీలు దిగేస్తాడులే...!!




## సర్కార్‌కు పట్టదు.. కమిషన్‌కు వినపడదు..

- రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం నిర్వీర్యం
- హైకోర్టును ఆశ్రయిస్తున్న కార్యకర్తలు


వివరాలు 3లో

# భయం గుప్పెట్లో భారత్

**ఇండియాలో జర్నలిస్టులు, దళితులు, మైనారిటీల హక్కులకు హామీ లేదు**

- ఏటేటా పెరుగుతున్న దాడులు
- మానవ హక్కుల కార్యకర్తల పట్ల పాలకుల్లో వ్యతిరేకత : ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** మానవ హక్కుల కార్యకర్తలు,జర్నలిస్టులు,దళితులు, మైనారిటీల పట్ల భారత్‌లోని పాలకవర్గాలు వ్యతిరేకతతో, అసహనంతో వ్యవహరిస్తున్నాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. దీంతో, ఈ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, పలువురు హత్యగావించబడ్డారని తెలిపింది. దాడులకు పాల్పడుతున్నవారిని అడ్డుకోవడం, శిక్షించడం పట్ల ప్రభుత్వాలు ఆసక్తి చూపడంలేదని నివేదిక పేర్కొన్నది. ప్రపంచంలో మానవ హక్కుల నివేదిక-2017ను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విడుదల చేసింది. దక్షిణాసియాలో మానవ హక్కుల పరిస్థితి విషాదకరంగా ఉన్నదని ఈ నివేదికలో వ్యాఖ్యానించారు. భారత్ గురించిన నివేదికలో ఈ ఏడాదిలో గోరక్షకుల పేరుతో బీఫ్ తిన్నారని ఆరోపిస్తూ దాడులు జరిగాయని తెలిపింది. ఈ దాడుల్లో కనీసం 10మంది ముస్లింలు చనిపోగా, చాలామంది గాయపడ్డారని పేర్కొన్నది. గోరక్షణ సంస్థలను నడిపేవారికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతల అండదండలున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. జర్నలిస్టులపై బెదిరింపులను గురించి చెబుతూ గతేడాది 9లో






## రెండు నుంచి థియేటర్ల బంద్!



బెంగళూరు : దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళలో మార్చి రెండో తేదీ నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిచిపోనుంది. పంపిణీ దారులు- నిర్మాతలు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చెన్నై, హైదరాబాద్‌లలో రెండేసి దఫాలు చర్చలు జరిపిన నాలుగు రాష్ట్రాల నిర్మాత మండళ్లు, క్యూబ్ యుఎఫ్ఓ సర్వీస్ ప్రొవైడర్లు శుక్రవారం బెంగళూరులో మరోసారి సమావేశమయ్యారు. అయినా ఇవి ఓ కొలిక్కి రాలేదు.

దీంతో థియేటర్లకు సినిమాలు ఇవ్వకూడదన్న నిర్ణయానికి నిర్మాతలు వచ్చారు. మార్చి రెండో తేదీ నుంచి కొత్త సినిమాలు విడుదల చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు.

## ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు

- మోడీ, ట్రూడో చర్చల్లో ప్రధానాంశాలు

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో శుక్రవారం నాడు ఇక్కడ ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయి ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి వాటి నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, వాణిజ్య సంబంధాల మెరుగుదల వంటి అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఇరుదేశాల మధ్య ఇంధన సహకారంతో సహా వివిధ రంగాలకు సంబంధించి ఆరు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. దాదాపు రెండు గంటలసేపు భేటీ అయిన ఇరువురు నేతలు అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే అంశంపై తాము చర్చించినట్టు చెప్పారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు ప్రాధాన్యతను తాము గుర్తించామని, ఈ పోరులో రాజకీయ లక్ష్యాల కోసం మతాన్ని దుర్వినియోగం చేసే వారికి స్థానం లేదని మోడీ చెప్పారు. భారత సార్వభౌమత్వాన్ని, ఐక్యతను సవాలు చేసేవారిని తాము ఎంతమాత్రమూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

ఖలిస్తాన్ విషయంలో ట్రూడో సర్కారు మెతక వైఖరి అనుసరిస్తోందన్న విమర్శలు వెలువడతున్న నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం.

**కెనడా ప్రధాని ట్రూడోకు మోడీ ఆలింగానాహ్వానం**

ఎట్టకేలకు కెనడా ప్రధాని ట్రూడోకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం తనదైన శైలిలో ఆలింగనంతో ఘనంగా ఆహ్వానించారు.

## ఆక్రమిత స్థలాల్లో ప్రార్థనామందిరాలను తొలగించండి

### అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

**అలహాబాద్ :** ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన ప్రార్థనమందిరాలపై అలహాబాద్ హై కోర్టు సంచలనతీర్పు నిచ్చింది. ఆక్రమించిన స్థలాల్లో మందిరాలు,మసీదులు,ఇతర ధార్మిక ప్రాంతాలు నిర్మించిఉంటే..వాటిని తొలగించాలని హైకోర్టు ఆదేశించింది.2011 జనవరి తర్వాత రోడ్లు,వీధుల్లో ఆక్రమిత స్థలాల్లో ధార్మికప్రాంతాలుగా ఉన్న వాటిపై వచ్చిన పిటిషన్‌పై హైకోర్టు పై విధంగా స్పందించింది. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని యూపీ ప్రభుత్వకార్యదర్శికి ఆదేశించింది.ఫతేపూర్‌కి చెంది మహమ్మద్ హుస్సేన్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు జస్టిస్ సుధీర్ అగర్వాల్,జస్టిస్ అజిత్ కుమార్‌లు మాట్లాడుతూ..ఏడు నెలల్లోగా చర్యలు తీసుకున్న రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు.

**సిలబస్‌లో గాయత్రి మంత్రం**

హర్యానాలో బీజేపీ ప్రభుత్వం ఒకసారి ఆవు,ఇంకో సారి గీతా గురించి ప్రస్తావించటం చర్చనీయంశమవుతున్నది.తాజాగా మార్చి ఐదునుంచి షురూ కానున్న హర్యానా అసెంబ్లీలో మరో కొత్త ప్రతిపాదనను తీసుకోరాబోతున్నది. దీని ప్రకారం హర్యానాలోని అన్ని స్కూళ్లలో గాయత్రి మంత్రం సిలబస్,ప్రార్థన అనివార్యం చేయబోతున్నది. దీనికన్నా ముందుగా భగవద్గీతలోని శ్లోకాలను పాఠ్యాంశంగా పెట్టింది.,ఆ తర్వాత యోగాను అనివార్యం చేసింది.ఇపుడు గాయత్రి మంత్రాన్ని ప్రవేశపెట్టబోతుండటంతో..విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

## సాధ్యాసాధ్యాలు పరిశీలించండి

- సునంద కేసులో సిట్ ధర్యాప్తుపై సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ భార్య సునందపుష్కర్ అనుమానాస్పద మృతి కేసులో.. సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా, ఏ.ఎం. ఖన్విల్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఈ నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి సుబ్రహ్మణ్యస్వామి దాఖలుచేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గతేడాది అక్టోబర్ 26న కొట్టివేసింది. సునంద పుష్కర్ 2014, జనవరి 17న ఢిల్లీలోని ఫైవ్‌స్టార్ హోటల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే.

## మార్చి 1న లోక్‌పాల్ ఎంపిక కమిటీ భేటీ

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ:**లోక్‌పాల్ సభ్యుల నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. మార్చి 1న ఎంపిక కమిటీ భేటీ కానున్నట్టు కేంద్రం తరపున అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. లోక్‌పాల్ ఎంపిక కమిటీలో ప్రధానితోపాటు భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభలో ఎక్కువమంది సభ్యులున్న ప్రతిపక్ష పార్టీ నేత సభ్యులుగా ఉంటారు. ఈ అంశంపై స్వచ్ఛంద సంస్థ కామన్‌కాజ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ రంజన్‌గొగోయ్, జస్టిస్ ఆర్ భానుమతితో కూడిన సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. తదుపరి విచారణను మార్చి 6కు ధర్మాసనం వాయిదా వేసింది.


మార్చి 5 వరకల్లా నియామక ప్రక్రియ పురోగతికి సంబంధించిన నివేదికను అందించాల్సిందిగా సిబ్బంది శిక్షణ విభాగం(డీవోపీటీ)ని ధర్మాసనం ఆదేశించింది. ప్రధానిసహా ఉన్నతస్థాయి వ్యక్తుల అవినీతిపై విచారణ జరిపేందుకు 2013లో లోక్‌పాల్ చట్టానికి పార్లమెంట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

## భద్రతా ప్రమాణాలు లేని బైక్‌లకు సుప్రీం నో!

**న్యూఢిల్లీ:** చోదకులతో పాటు పిలియన్ రైడర్లకు (వెనక కూర్చున్న వారికి) కూడా పూర్తి భద్రత కల్పించే విధంగా ఏర్పాట్లున్న మోటార్ బైక్‌లకు మాత్రమే రోడ్లపై అనుమతి నివ్వాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిన రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా పిలియన్ రైడర్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించటం గమనార్హం. పిలియన్ రైడర్లకు భద్రతా ఏర్పాట్లు లేని బైక్‌లకు అనుమతి ఇవ్వొద్దంటూ 2008 నవంబర్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ భారత ఆటోమొబైల్ తయారీ దార్ల సంస్థ (సియామ్) దాఖలు చేసిన అప్పీల్‌ను డిస్మిస్ చేసిన న్యాయమూర్తి ఎకె గోయెల్‌తో కూడిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది.

పిటిషనర్లు జ్ఞాన్ ప్రకాశ్, సియామ్ ప్రతినిధులతో పాటు మరికొందరి వాదనలను సమగ్రంగా విన్న సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. బైక్‌ల వెనుక చక్రాలకు సగం మేర మాత్రమే భద్రతా వలయం వుండటంతో వెనుక కూర్చున్న మహిళల దుపట్టా, చీరల వంటివి వెనుక చక్రాల్లో చిక్కుకుని ప్రమాదాల బారిన పడుతున్న విషయం తెలిసిందే. వీరికి పూర్తి స్థాయి భద్రతా సౌకర్యాలున్న మోటార్ సైకిళ్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సుప్రీంకోర్టు తన ఆదేశాలలో స్పష్టం చేసింది. తయారీ సంస్థలు కూడా మోటార్‌బైక్‌ల డిజైన్లలో మార్పులు చేసి పూర్తి భద్రతా ప్రమాణాలతో రూపొందించాలని సూచించింది.

## పీఎన్‌బీ స్కామ్ నుంచి
# బీజేపీ తప్పించుకోలేదు : యశ్వంత్ సిన్హా



**న్యూఢిల్లీ :** పంజాబ్ నేషనల్ బ్యాంక్ పీఎన్‌బీ స్కామ్‌లో ప్రభుత్వం తన బాధ్యత నుంచి బీజేపీ తప్పించుకోలేదని ఆర్థిక శాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. 'ఈ స్కామ్ బాధ్యత నుంచి బీజేపీ తప్పించుకోలేదు. గత నాలుగు సంవత్సరాలుగా అంటే.. మేం పదవిలో ఉన్న సమయంలోనే ఈ స్కామ్ జరిగింది. అయితే ఆ స్కామ్ అంతకుముందే ప్రారంభమైందని చెబుతున్నారు. మరి ఆ స్కామ్‌ను ఎందుకు కొనసాగించాల్సి వచ్చింది' అని సిన్హా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. పీఎన్‌బీ స్కామ్‌పై కాంగ్రెస్, బీజేపీల మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో వాస్తవం కనుమరుగవుతోందని యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన నిరవ్‌మోడీ ఆయన బంధువు మెహుల్ చోక్సికి కంపెనీలకు చెందిన 12 మంది అధికారులను దర్యాప్తు సంస్థలు అరెస్టు చేశాయి. తీవ్ర స్థాయిలో జరిగిన ఈ స్కామ్ ఒక్క ఉద్యోగుల వల్ల మాత్రమే సాధ్యమయ్యేది కాదని సిన్హా పేర్కొన్నారు. వ్యవస్థలోని అత్యున్నత స్థాయి అధికారుల జోక్యం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో మోసం జరగదని ఆయన చెప్పారు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ అవసరమన్నారు.

## విదేశాల్లో మెడిసిన్ చదవాలనుకునే వారికి.. నీట్ 'తప్పనిసరి'

**న్యూఢిల్లీ:** విదేశాల్లో మెడిసిన్ చేయాలనుకునే భారతీయ విద్యార్థులు ఇకనుంచి 'తప్పనిసరిగా' నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)లో అర్హత సాధించాల్సిందే. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. ఈ నిబంధనలు ఈ యేడాది మే నుంచి అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం.. విదేశాలకు వెళ్లి మెడిసిన్ సర్టిఫికేషన్ అర్హత పొందగోరే భారతీయ విద్యార్థులు నీట్ పరీక్షలో తప్పనిసరిగా అర్హత సాధించాలి. అయితే ఇప్పటికే విదేశాలనుంచి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం ఇటీవలే ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో చేరే విద్యార్థులూ నీట్‌ను రాయాల్సిందే అని తెలిపింది.




# మార్చి 15న నిరసన దినం

### కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం



**న్యూఢిల్లీ:** ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ వారి జీవితాలపై కేంద్ర ప్రభుత్వం నిర్విరామంగా కొనసాగిస్తున్న దాడులను కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ మార్చి 15న జాతీయ స్థాయిలో నిరసన దినాన్ని పాటించాలని ఇక్కడి ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల భేటీలో నిర్ణయించారు. పదేపదే ఆర్థిక భారాలు మోపుతూ ప్రజల జీవితాలపై దాడులు కొనసాగిస్తున్న కేంద్రం దేశ ప్రయోజనాలనుసైతం దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని కార్మిక సంఘాల నేతలు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధానంగా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి కాంట్రాక్ట్ కార్మిక చట్టాన్ని సవరించటం ద్వారా నిర్ణీత కాలానికి మాత్రమే ఉద్యోగ నియామకాలను చేపడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై భరోసా కోల్పోయే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. దేశ పారిశ్రామిక చిత్ర పటం నుండి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకే కేంద్రం కంకణం కట్టుకున్నదని, ఇటీవలి కాలంలో కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వేల ప్రయివేటీకరణ, మైనింగ్ ప్రయివేటు ఇలా మూకుమ్మడి ప్రయివేటీకరణతో దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం రక్షణఉత్పత్తుల రంగంలో విదేశీ, ప్రయివేటు సంస్థలకు ప్రవేశం కల్పించంచటంతోపాటు ఔట్‌సోర్సింగ్‌ను ప్రోత్సహించటం ద్వారా సార్వభౌమత్వానికి చేటు చేస్తోందని కార్మిక సంఘాలు ఈ ప్రకటనలో విమర్శించాయి. ఈ నెల 1వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రాథమికంగా కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక వైఖరితో వుందని, ఎటువంటి వనరుల కేటాయింపూ లేకుండానే ప్రజాకర్షక నినాదాలతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. కేంద్రం అనుసరిస్తున్న ఈ వైఖరిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే మార్చి 15న దేశవ్యాప్తంగా నిరసన దినాన్ని పాటించాలని నిర్ణయించినట్టు ఈ ప్రకటనలో వెల్లడించాయి. ఈ భేటీలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, యూటీయూసీ, ఎల్‌పీఎఫ్ తదితర కార్మిక సంఘాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు..
## బీజేపీ ఎమ్మెల్యేపై కేసు

**భోపాల్:** ఎన్నికల ప్రచార సమయం ముగిసినా, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన బీజేపీ ఎమ్మెల్యేపై మధ్యప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... సాగర్ జిల్లాలోని ముంగావోళి నియోజకవర్గానికి నేడు (శనివారం) ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర జైన్ (55) ముంగావోళిలో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా ప్రచారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఎమ్మెల్యేను అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా కోరారు. దీంతో జైన్, అతని డ్రైవర్ అక్కడి నుంచి 14 కిలో మీటర్ల దూరంలో ఉన్న అశోక్‌నగర్‌కు వెళ్లి ప్రచారం నిర్వహించారు. పోలీసులు తిరిగి అక్కడికి చేరుకుని ఎమ్మెల్యే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ధనుష్ క్షిపణి పరీక్ష విజయవంతం


**భువనేశ్వర్:** ఒడిషా రాష్ట్ర తీరం నుంచి ధనుష్ బాలిస్టిక్ క్షిపణిని శుక్రవారం నౌకాదళ సిబ్బంది విజయవంతంగా పరీక్షించారు. 350 కిలోమీటర్లలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం కలిగిన ఈ మిస్సైల్‌ను పారాదీప్ సమీపంలో బంగాళాఖాతం నుంచి ఉదయం 10.52గంటలకు పరీక్షించినట్టు భద్రతాధికారులు వెల్లడించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్ 500కిలోల బరువును మోసుకెళ్లగలదని చెప్పారు. ఈ క్షిపణి భూ ఉపరితలం, సముద్ర ఉపరితల లక్ష్యాలను ఛేదిస్తుందని తెలిపారు. భారత నౌకాదళ సిబ్బందికి చెందిన స్ట్రాటజిక్ ఫోర్స్ కమాండ్(ఎస్ఎఫ్‌సీ) వారికి శిక్షణలో భాగంగా ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారని పేర్కొన్నారు.

### రుణమాఫీ కోసం రోడ్డెక్కారు
# ఢిల్లీకి రాకుండా...ఎక్కడికక్కడే అరెస్టులు...

### రైతులపై ఖాకీల దౌర్జన్యం

**న్యూఢిల్లీ :** 'మా రుణాలు మాఫీ చేయండి.. మా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆందోళనకు దిగిన రైతులపై దేశవ్యాప్తంగా నిర్బంధకాండ కొనసాగింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో రైతులు ఎక్కడ కనిపిస్తే అక్కడ అరెస్టులు చేశారు. నిర్బంధాలను అధిగమించి దేశరాజధానికి చేరుకునేందుకు ప్రయత్నించిన అన్నదాతలను ఢిల్లీలో అడుగుపెట్టకుండా పోలీసులు కట్టడి చేశారు.అరెస్టులు చేశారు. ఢిల్లీలో రైతుల ఆందోళన నేపథ్యంలో ఢిల్లీ సరిహద్దులోని ప్రాంతాల్లో భారీగా పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించారు. హర్యానాలోని హిస్సార్‌లో రైతులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఐకేఎస్ సహ 68 రైతు సంఘాలు 'కిసాన్ సంఘటన్' బ్యానర్ కింద పలు రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు సిద్ధమయ్యారు. హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లో రైతులను ఢిల్లీకి వెళ్ళకుండా అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో భాగంగా దక్షిణ భారతదేశం, ఛత్తీస్‌గఢ్‌లో రైతులతో పాటు ఆయా రాష్ట్రాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు ఎంఎస్ స్వామినాథన్ 2006లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన సిఫారసులను అమలు చేయాలని వారు డిమాండ్‌చేస్తున్నారు.





**హర్యానాలో...**

ఢిల్లీ ఘెరావ్‌లో పాల్గొనేందుకు బయలుదేరిన రైతులను ఎక్కడ కనిపిస్తే అక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారులను అడ్డుకోవడానికి వివిధ రైతు సంఘాల కీలక నేతలను, వందలాది మంది రైతులు నిర్బంధించారని రైతు సంఘాలు తెలిపాయి.

**మధ్యప్రదేశ్**

మధ్యప్రదేశ్‌లోనూ భారీ సంఖ్యలో రైతులు గురువారమే ఫరీదాబాద్‌కు చేరుకున్నారు. కిసాన్ మజ్దూర్ మహాసంఘటన్ జాతీయ అధ్యక్షుడు శివ్ కుమార్ శర్మ, అంజమండిలో రాష్ట్ర అధ్యక్షుడు దేవ నారాయణ పటేల్ సహ పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు.

**రాజస్థాన్‌లో రైతుల 'మహాపడావ్'**

జైపూర్: జైపూర్: రాజస్థాన్‌లో వసుంధర రాజే నేతృత్వంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక వైఖరిని, పోలీసు అణచివేతను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ సభ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు 'మహాపడావ్' పేరిట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ నగరాలలో జరిగిన బహిరంగ సభలకు అనూహ్యరీతిలో ప్రజాస్పందన వ్యక్తమైంది. రింగస్‌లో జరిగిన బహిరంగ సభలో కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, రాజస్థాన్ సభ కోశాధికారి గురుచరణ్‌సింగ్ మౌర్, సీనియర్ నేతలు హర్‌ఫూల్ సింగ్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విజూ కృష్ణన్ వసుంధర రాజే సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. జైపూర్‌కు వచ్చేందుకు ప్రయత్నించిన వేలాది మంది రైతులను బీజేపీ ప్రభుత్వం అడ్డుకుని వారిని అరెస్ట్ చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ శాసనసభలో ప్రవేశించకుండా అడ్డుకోవాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. రైతుల పోరాటానికి కిసాన్ సభ తరపున సంఘీభావం ప్రకటించిన కృష్ణన్ రాష్ట్రంలో అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కాశ్మీర్‌లో..**

రైతు ఉద్యమాల్లో ఎన్నడూ పాల్గొనని కాశ్మీర్ అన్నదాతలు మొదటిసారి సంపూర్ణమద్దతు ప్రకటించారు.జమీదార్ బచావ్ ఫోరమ్ నేతృత్వంలో శుక్రవారం రైతులు ఆందోళనలు చేశారు. ఫోరం సభ్యుడు హమీదా మాలిక్ మాట్లాడుతూ..1990నుంచి వేర్పాటు ఉద్యమాల కారణంగా రైతులు వెనకుండిపోయారని తెలిపారు. అందువల్ల తమ గోడు చెప్పుకోలేకపోయామని వివరించారు.దేశవ్యాప్తంగా పండించే పంటలకు భిన్నంగా జమ్మూలో అక్కడి రైతులు సేద్యం చేస్తుంటారు. రైతు కష్టాలు సర్కారు ముందు ఉంచాలనే ఈ ఆందోళనలో పాలుపంచుకున్నామని రైతు సంఘనేతలు తెలిపారు.

**రైతు సమస్యలపై రాజస్థాన్ అసెంబ్లీలో రభస**

**జైపూర్ :** రాజస్థాన్ అసెంబ్లీలో శుక్రవారం గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రైతు సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీయడంతో రెండు సార్లు సభ వాయిదా పడింది. రాష్ట్రంలో ఆందోళన చేస్తున్న రైతుల సమస్యలపై తాను మాట్లాడటానికి ప్రయత్నించానని, కాని తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని స్వతంత్ర ఎమ్మెల్యే రాజ్‌కుమార్ శర్మ తెలిపారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానం కావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా ఇదే అంశంపై ఆందోళనకు దిగారు. శర్మతో చేతులు కలిపారు. ప్రతిపక్ష సభ్యులందరూ సభ మధ్యలోకి దూసుకెళ్ళి ఆందోళన చేయడంతో సభను గంటన్నరపాటు వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమైన తరువాత కూడా ప్రతిపక్ష సభ్యులు ఇదే అంశంపై పట్టుపట్టడంతో సభను మరోసారి వాయిదావేశారు.

**రాజస్థాన్ ప్రభుత్వ అణచివేత చర్యలు**

### ఖండించిన ఏఐఏడబ్ల్యూయూ

**న్యూఢిల్లీ :** రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న అప్రజాస్వామిక, అణచివేత చర్యలను అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలోని రైతులను జైపూర్‌లో అడుగుపెట్టనీయకుండా అడ్డుకుంటున్నదని పేర్కొంది. బీజేపీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలను విడిచిపెట్టాలని, రుణాల రద్దు, మద్దతు ధర పెంపు, రాష్ట్ర ప్రభుత్వమే తగినంతగా పంటను కొనుగోలు చేయడం, పెన్షన్లను పెంచడం వంటి డిమాండ్లకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించినా అమలు చేయనందుకు నిరసనగా రాజస్థాన్ రైతులు ఆందోళన బాట పట్టారు.

# కేజ్రీవాల్ నివాసంలో పోలీసుల సోదాలు

### అన్షు ప్రకాశ్‌పై దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ల సేకరణ

- కేంద్రం అండతోనే ఈ చర్య : ఆప్ ఎమ్మెల్యేలు



**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో శుక్రవారం పోలీసులు అకస్మిక సోదాలు నిర్వహించారు. సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సీఎం ఇంటికి వెళ్లారు. కాగా ఈ చర్యలను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు.

ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన సమావేశంలో ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేశారంటూ ఢిల్లీ సీఎస్ అన్షూ ప్రకాశ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం ఉదయం ఢిల్లీ పోలీసులు ముఖ్యమంత్రి నివాసంలో సోదాలు చేశారు. పోలీసులు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోదాల్లో భాగంగా పోలీసులు 21 సీసీటీవీ పుటేజీల హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఎం నివాసంలో ఆకస్మికంగా సోదాలు చేయడంపై ఆప్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చట్టవిరుద్ధంగా ఇంట్లోకి ప్రవేశించి రౌడీల్లా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మల్లా మారారని వారు ఆరోపించారు. కేంద్రం అండతోనే ఈ సోదాలు నిర్వహించారని విమర్శించారు. కేజ్రీవాల్‌ను అవమానించేందుకే పోలీసులు ఇలా ప్రవర్తించారంటూ ఆప్ నేతలు అశుతోష్ అన్నారు. పోలీసులు సీసీటీవీల గురించి అడగకుండా ఇంటికి పెయింటింగ్ ఎప్పుడు వేశారంటూ ప్రశ్నించారని తెలిపారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి పోలీసులు సోదాలు చేసి, పెయింటింగ్ గురించి ప్రశ్నించిన వీడియోను చూపించారు. మోడీ ప్రభుత్వమే పోలీసులతో దాదాగిరి చేయిస్తోందని ఆ పార్టీకి చెందిన మరోనేత సంజయ్ సింగ్ అన్నారు.

**ఆప్ ఎమ్మెల్యేల బెయిల్ అభ్యర్థన తిరస్కృతి**

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడికి పాల్పడిన ఆప్ ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్ చేసుకున్న బెయిల్ అభ్యర్థనను ఢిల్లీ కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ షెఫాలి బర్నాల టాండన్ వారిని పోలీసు కస్టడీకి అప్పగించేందుకు కూడా నిరాకరించారు. పోలీసు కస్టడీలో విచారించాల్సినంత కొత్త నేపథ్యమేమీ లేదన్నారు.

**లెఫ్టినెంట్ గవర్నర్‌కు వినతి**

కేజ్రీవాల్ తన సహచర మంత్రులతో కలసి వెళ్ళి లెఫ్టినెంట్ గవర్నర్‌ను శుక్రవారం కలిశారు. ప్రభుత్వానికి సహకరించిన అధికారుల జాబితాను కేజ్రీవాల్ గవర్నర్ అందచేశారు.

## దళిత యువతి సజీవ దహనం


- ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం

**లక్నో:** ఉత్తర్ ప్రదేశ్‌లో అతి దారుణ ఘటన వెలుగు చూసింది. 18 ఏండ్ల దళిత యువతిని గుర్తు తెలియని దుండగులు సజీవదహనం చేశారు. రాష్ట్రంలోని ఉన్నావో జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో మార్కెట్‌కు వెళ్లడానికి ఓ యువతి సైకిల్‌పై బయలుదేరింది. దారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేసి కిరోసిన్‌పోసి నిప్పంటించారు. దీంతో యువతి తనను రక్షించుకోవడానికి 100 మీటర్ల మేర పరుగెత్తింది. అప్పటికే ఆమె దేహం పూర్తిగా కాలడంతో అక్కడికక్కడే మరణించింది. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి పరుగులు తీశారు. మృతదేహం పక్కన ఉన్న సైకిల్, చెప్పులను చూసి తమ కూతురే అని గుర్తించారు. ఘటనా స్థలంవద్ద ఖాళీ డబ్బా, అగ్గిపెట్టే ఉన్నాయని, బాధితురాలని సజీవ దహనం చేసినట్టుగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమెపై లైంగికదాడి జరిగిందా లేదా అనే విషయం పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని అన్నారు.

## యూపీలో జర్నలిస్టు దారుణ హత్య

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని బల్‌రాంపూర్‌లో ఓ జర్నలిస్ట్ అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజనీ మౌర్య(35) ఓ హిందీ వార్తా పత్రికలో విలేకరిగా పనిచేసేవాడు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. మృతి చెందిన మౌర్య మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మౌర్య కుటుంబం భూవివాదంలో చిక్కుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

# సర్కార్‌కు పట్టదు...



# కమిషన్‌కు వినపడదు..

## రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం నిర్వీర్యం

### హైకోర్టును ఆశ్రయిస్తున్న కార్యకర్తలు

**సామాన్యుడి చేతిలో ఆయుధంగా భావిస్తున్న సమాచార హక్కు చట్టం రాష్ట్రంలో నిర్వీర్యమై పోతున్నది. కీలకమైన సమాచారం బయటికి వెళ్తే తమ పీఠాలు కదులుతాయని భావిస్తున్న పాలకులు, అధికారులు ఒక పద్ధతి ప్రకారం ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. చట్ట ప్రకారం కోరిన సమాచారం అందించటంలో గ్రామస్థాయి నుంచి సచివాలయం స్థాయి వరకూ అధికారులు నిర్లక్ష్యం వహించటం విశేషం. రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తూ సామాన్యుడికి బాసటగా నిలివాల్సిన రాష్ట్ర సమాచార కమిషన్ కూడా సమాచారం అందించని అధికారులకు కొమ్ము కాస్తున్నదనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. ఫలితంగా సమాచారం కోరుతున్న వ్యక్తులు, సమాచార కార్యకర్తలు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు.**

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

కీలకమైన సమాచారం ప్రజల చేతుల్లోకి వెళ్తే అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అటువంటి సమాచారం అందించకుండా గోప్యత పాటిస్తున్నది. సమాచార హక్కు చట్టాన్ని వివిధ దశల్లో పకడ్బందీగా ఆమలు చేయించాల్సిన ఐఏఎస్ అధికారులు కూడా సమాచారం బయటికి పొక్కకుండా అనధికారిక మౌఖిక ఉత్తర్వులతో కింది స్థాయి అధికారులను కట్టడి చేయడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటూ సచివాలయంలోని వివిధ శాఖల్లో సమాచార హక్కు అమలుకు నోచుకోవటం లేదు. సకాలంలో సమాచారం అందించక పోవటం, తప్పుడు సమాచారం లేదా పాక్షిక సమాచారం మాత్రమే అందించటం రివాజుగా మారింది. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల్లో పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక రెవిన్యూ డివిజన్ మండల కేంద్రాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉన్నదని సమాచార కార్యకర్తలు అంటున్నారు. సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించి ఎవరిపైనా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవటం, కనీసం శాఖల వారీగా సమీక్షలు కూడా నిర్వహించక పోవటంతో చట్ట ఉల్లంఘనకు పాల్పడిన వారికి భయం లేకుండా పోయింది. ఫలితంగా జిల్లాల స్థాయిలో వందల సంఖ్యలోనూ, రాష్ట్ర స్థాయిలో వేల సంఖ్యలోనూ దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి.

**కమిషనర్లను నియమించని సర్కారు..**

రాష్ట్ర సమాచార కమిషన్‌ను గత సంవత్సరం ఏర్పాటు చేసినా ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో కమిషనర్లను నియమించక పోవటం చర్చనీయాంశమైంది. రాష్ట్ర సమాచార చీఫ్ కమిషనర్‌గా అసెంబ్లీ మాజీ కార్యదర్శి రాజా సదారాంను, సభ్యుడిగా బుద్ధా మురళిని ప్రభుత్వం నియమించింది. వీరి నియామకంపై కూడా విమర్శలు పెల్లుబికాయి. గతంలో మంచి పేరు తెచ్చుకున్న విశ్రాంత ఐఏఎస్, ఐసీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను సమాచార కమిషనర్లుగా నియమించగా తెలంగాణ రాష్ట్రంలో ఆ స్థాయి వారిని నియమించక పోవటాన్ని పలువురు తప్పుపట్టారు. రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఒక చీఫ్ కమిషనర్‌ను ఎనిమిది మంది కమిషనర్లను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. కానీ ఇద్దరితోనే సరిపెట్టడంతో కమిషన్‌కు అందే వేలాది దరఖాస్తులను వారు పరిష్కరించ లేక పోతున్నారనే అపవాదు మిగిలింది. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చట్ట ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాల్సి ఉంటుంది. ప్రతి శాఖలో సమాచార అధికారి ఉన్నప్పటికీ 30 రోజుల్లో సమాచారం అందించటం లేదు. దీనిపై మొదటి అప్పీల్‌ను అదే శాఖలోని మరో ఉన్నతాధికారికి చేసుకున్న తర్వాత 45 రోజుల్లో సమాచారం అందించాలని చట్టం చెప్తోంది. మొదటి అప్పిలేట్ అధికారి కూడా సమాచారం అందించలేక పోతే దరఖాస్తు దారులు కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు సకాలంలో సమాచారం అందించక పోవటంతో కమిషన్‌కు రోజుకు 150 నుంచి 200 అప్పీళ్ళు అందుతున్నాయి.

**హైకోర్టును ఆశ్రయిస్తున్న దరఖాస్తుదారులు...**

చట్ట ప్రకారం సమాచారం అందించటంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటూ సమాచార కమిషన్ కూడా విఫలమైందంటూ పలువురు దరఖాస్తుదారులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. కల్వకుర్తి కలెక్టర్ కార్యాలంలో తాను కోరిన సమాచారం ఇవ్వక పోవటంతో అబ్దుల్ హఫీజ్ అనే వ్యక్తి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురు కావటంతో ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మూడు వారాల్లో దరఖాస్తుదారుడికి సమాచాం అందించాలని సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ రాజా సదారాంను హైకోర్టు ఆదేశించింది.



### కమిషన్ పనితీరుపైనా అనుమానాలు...

వచ్చిన దరఖాస్తులను పరిష్కరించటంలో కమిషన్ విఫలమవుతున్నదనే విమర్శలు వినవస్తున్నాయి. రోజుకు 15 నుంచి 20 దరఖాస్తులను కూడా కమిషనర్లు పరిష్కరించలేక పోవటంతో కొత్తవి పాతవి కలిపి 6 వేలకు పైగా దరఖాస్తులు కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారుడు అడిగిన సమాచారాన్ని నిర్ణీత కాలంలో అందించాలని ఆదేశించే అధికారంతో పాటూ సమాచారం ఎందుకు అందించలేదో సంజాయిషీ కోరే అధికారం కూడా కమిషన్‌కు ఉన్నది. అంతే కాకుండా రోజుకు రూ. 250 చొప్పున గరిష్ఠంగా రూ. 25,000 వరకూ అపరాధ రుసుమును విధించే అధికారం కూడా ఉన్నది. అయితే రాష్ట్ర కమిషన్ నిర్ణయాలు తీసుకోవటంలో వెనుకాడటం, సంజాయిషీ నోటీసులు ఇవ్వకపోవటం, అపరాధ రుసుము విధించక పోవటం పట్ల దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కమిషన్‌ను ఆశ్రయించిన తర్వాత కూడా అధికారులు సమాచారం ఇవ్వక పోవటం చూస్తే ప్రభుత్వానికి అనుకూలంగా కమిషన్ వ్యవహరిస్తున్నదని సమాచార కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

### 'కంచే చేను మేస్తున్నది...'



సమాచార హక్కు చట్టాన్ని కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే దీనిని బలహీర పరుస్తున్నదని సమాచార కార్యకర్త పి. సురేశ్ ఆరోపించారు. పూర్తి స్థాయిలో కమిషనర్లను వెంటనే నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచారం అందించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, కమిషన్ కూడా వారి వద్ద నుంచి అపరాధ రుసుము వసూలు చేయాలని కోరారు.

## సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణను ఉపసంహరించాలి

- సీఎం హామీలు తక్షణం అమలు చేయాలి:టీఎన్‌టీయూసీ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు బిఎన్.రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు, ఆ తరువాత సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి గనులను ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తున్నాయని చెప్పారు. 130 ఏండ్ల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గేట్లు తెరిచిందన్నారు. మరో 150 ఏండ్లకు సరిపోను 10,846 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వాలు ఉన్నాయని వివరించారు.

కేసీఆర్ హయాంలోనే తాడిచర్ల-1, తాడిచర్ల-2 బొగ్గు గనులను ప్రయివేటుకు అప్పగించారని విమర్శించారు. ఓపెన్ మైనింగ్‌తో తెలంగాణ బొందలగడ్డ అవుతుందని, కాలుష్య కోరల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలు చిక్కుకున్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే అండర్‌గ్రౌండ్ మైనింగ్‌కు శ్రీకారం చుడతామని చెప్పారు. ఎన్నికల ముందు సింగరేణి కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చారని వివరంచారు. ఇచ్చిన వాగ్ధానాలతో ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలుచేయలేదన్నారు. సింగరేణి కార్మికులకు కనీస వేతనం రూ. 18 వేలు ఉండాలని డిమాండ్ చేశారు.

## జిల్లా స్థాయి రైతు సమన్వయ కర్తల నియామకం

**హైదరాబాద్ :** గ్రామ, మండల స్థాయి రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసిన తరహాలోనే జిల్లా స్థాయి సమితులకు సమన్వయకర్తలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సమన్వయకర్తల వివరాలను అధికారికంగా విడుదల చేసింది. ఈ సమితి జిల్లా స్థాయిలో కార్పొరేషన్ తరహాలో పనిచేస్తుంది. ఇందుకు ఓ ఉన్నతాధికారిని కూడా నియమిస్తామని సీఎం కేసీఆర్ చెప్పిన విషయం తెలిసిందే.

**జిల్లా సమన్వయ కర్తలు :** కరీంనగర్‌కు గుండెల్లి తిరుపతి. పెద్దపల్లికి కోట రాంరెడ్డి, జగిత్యాలకు చీటి వెంకటరావు, సిరిసిల్లకు గడ్డం నర్సయ్య, సిద్ధిపేటకు నాగిరెడ్డి, మెదక్‌కు సోములు, సంగారెడ్డికి వెంకటరామంరెడ్డి, ఆదిలాబాద్‌కు బోజిరెడ్డి, మంచిర్యాలకు గురవయ్య, ఆసిఫాబాద్‌కు విశ్వనాథ్, నిర్మల్‌కు వెంకటరాంరెడ్డి, నిజామాబాద్ మంజుల, కామారెడ్డికి అంజిరెడ్డి, వరంగల్ అర్బన్‌కు లలితాయాదవ్, వరంగల్ రూరల్‌కు బొల్లె భిక్షపతి, భూపాలపల్లికి బుచ్చయ్య, మహబూబాబాద్‌కు బాలాజీ, జనగాంకు రమణారెడ్డి, కొత్తగూడెంకు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లగొండకు రాంచందర్ నాయక్, యాదాద్రికి అమరేందర్ ముదిరాజ్, సూర్యాపేటకు రజాక్, నాగర్ కర్నూల్‌కు మనోహర్, గద్వాల్‌కు వెంకటరాములు, వనపర్తికి జగదీశ్వర్‌రెడ్డి, రంగారెడ్డికి వంగేటి లక్ష్మారెడ్డి, వికారాబాద్‌కు మహేష్‌రెడ్డి, మేడ్చల్‌కు నారెడ్డి నందారెడ్డి, ఖమ్మంకు నల్లమల్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.

అయితే ఇందులో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే ఎక్కువమంది ఉండటం విశేషం. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఆ సామాజిక వర్గానికి ఎక్కువగా అవకాశం కల్పించినట్టు తెలుస్తోంది.

## వర్గీకరణపై బంద్‌కు సీపీఐ మద్దతు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఎస్సీ వర్గీకరణ కోసం మార్చి 13న ఎమ్మార్పీఎస్ నిర్వహించతలపెట్టిన బంద్‌కు సీపీఐ మద్దతు ప్రకటించింది. ఈ అంశంపై 24 ఏండ్లుగా ఉద్యమాలు కొనసాగుతున్నా పాలకులు పట్టించుకోకపోవటం శోచనీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ వర్గీకరణకు మద్దతు పలుకుతున్నాయని గుర్తుచేశారు.

అయినప్పటికీ బిల్లు తీసుకురాకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మరోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇదే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలంటూ తాను ముఖ్యమంత్రికి లేఖ రాసినా పట్టించుకోలేదని విమర్శించారు.

# జెమ్స్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

## నీరవ్ మోడీ స్కామ్‌తో రోడ్డున పడ్డారు : మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

- కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి : ఎం.సాయిబాబు
- అత్యధికులు మహిళలు, వికలాంగులు : ఎస్.రమ
- కొల్లగొడుతున్న చట్టబద్ధమైన బందిపోట్లు : చంద్రారెడ్డి
- సెజ్‌ల పేరుతో కార్మిక చట్టాలకు సవరణలు : త్యాగరాజన్



మాట్లాడుతున్న ప్రొ.నాగేశ్వర్

**నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో**

నీరవ్‌మోడీ స్కామ్‌తో రోడ్డున పడిన జెమ్స్ పరిశ్రమ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, అందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కె.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'హైదరాబాద్ జెమ్స్ (గీతాంజలి గ్రూప్) పరిశ్రమ కార్మికులకు ఉద్యోగ భద్రత' అంశంపై సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి భారీ మొత్తంలో రుణాలు తీసుకుని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన నీరవ్ మోడీ స్కామ్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థికమంత్రి అరుణజైట్లీ నోరు విప్పడం లేదన్నారు. నీరవ్‌మోడీ స్కామ్‌తో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని రావిర్యాల గ్రామంలో ఉన్న హైదరాబాద్ జెమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. గీతాంజలి గ్రూప్ కంపెనీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీజ్ చేయడం, ఆదాయ పన్నుశాఖ (ఐటీ) అధికారులు నోటీసులు అంటించడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు(సెజ్) ఏర్పాటు సమయంలోనే తాను ప్రజాప్రతినిధిగా ఆందోళన వ్యక్తం చేసిన సంగతిని గుర్తు చేశారు. ఆర్థిక మండళ్లతో ఆయా ప్రాంతాలు వేగంగా వృద్ధి చెందుతాయని చెప్పి వందల ఎకరాల భూములను అప్పనంగా అప్పగించారని విమర్శించారు. ఎస్ఈజెడ్‌తో ప్రయోజనాలు ఉంటాయని చెప్పిన వారంతా ప్రస్తుతం జరుగుతున్న మోసాలకు సంబంధం లేదని చెప్పడం భావ్యం కాదన్నారు. నీరవ్‌మోడీ స్కామ్‌తో నష్టపోయిన జెమ్స్ కార్మికులకు భరోసా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జెమ్స్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జెమ్స్ కార్మికులకు జరిగిన అన్యాయంపై ప్రజాక్షేత్రంలో పెద్దఎత్తున చర్చ జరగాలన్నారు. వచ్చేనెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాల్లో సైతం కార్మికుల భద్రతపై వాయిదా తీర్మానం జరిగే విధంగా అన్ని కార్మిక యూనియన్లు బాధ్యత తీసుకుంటాయని చెప్పారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ (సెజ్), కార్మికుల భద్రత విషయానికొచ్చేసరికి బాధ్యత తమది కాదనే రీతిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానిది బాధ్యత కాకుంటే ఇంకెవరిదని ప్రశ్నించారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్(సీఐటీయూ) ఎస్.రమ మాట్లాడుతూ.. నీరవ్‌మోడీ స్కామ్‌తో సామాజిక, ఆర్థికంగా వివక్షతకు గురవుతున్న, వికలాంగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. బడా పెట్టుబడుదారుల మోసాలకు దాదాపు 700 మంది కార్మికులు రోడ్డునపడ్డారని తెలిపారు. ఇందులో వితంతువులు, ఒంటరి, వికలాంగ మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 12 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని జెమ్స్ కార్మికులకు జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రా రెడ్డి మాట్లాడుతూ.. చట్టబద్ధమైన బందిపోట్లు ప్రజల సంపదను కొల్లగొడుతున్నారని అన్నారు. ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు త్యాగరాజన్ మాట్లాడుతూ.. సెజ్‌ల పేరుతో కార్మిక చట్టాలను సవరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుతం కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే హక్కు లేకుండా చేశారని తెలిపారు. కార్మిక వర్గాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఓ యాదయ్య మాట్లాడుతూ.. కార్మికులకు మద్దతుగా ప్రత్యక్ష ఆందోళన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.దత్తు, కార్మికులు పాల్గొన్నారు.

## ఫార్మా-డీ డాక్టర్లను క్లినికల్ ఫార్మాసిస్టులుగా గుర్తించాలి..

- సీఎంకు తమ్మినేని లేఖ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

డిమాండ్ల సాధన కోసం గత 23 రోజులుగా ఆందోళన సాగిస్తున్న ఫార్మా-డీ (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) డాక్టర్లను క్లినికల్ ఫార్మాసిస్టులుగా గుర్తించాలని సీపీఐ (ఎం).. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తద్వారా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. ఇటీవల కేరళ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి ఫార్మా-డీ డాక్టర్లకు ఉద్యోగావకాశాలను కల్పించాయని గుర్తుచేశారు. ఈ కోర్సు చదివిన విద్యార్థులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో 2015లో కేంద్ర ప్రభుత్వం.. ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులరైజేషన్ పేరిట ఒక చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. ఆ చట్టానికి కేరళ, చత్తీస్‌ఘడ్ మాత్రమే ఆమోదం తెలిపాయని పేర్కొన్నారు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇంతవరకు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. అందువల్ల తక్షణం కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. తద్వారా ఫార్మా-డి డాక్టర్లకు ఉపాధి అవకాశాలను కల్పించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.


సంపాదకీయం

# ఇదేనా నవ భారతం..!?

అభివృద్ధి సంగతేమోగానీ.. అవినీతిలో మాత్రం దేశం ఎగబాకుతోంది. "ప్రపంచ అవినీతి సూచి - 2017" పేరుతో ట్రాన్స్‌ఫరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. దీంతో ప్రధాని మోడీ వల్లించే నీతి సూత్రాలన్నీ నీటి మూటలేనని తేలిపోయింది. అవినీతిపై ఆయన ప్రభుత్వం ప్రకటించిన తిరుగులేని యుద్ధం జరుగుబాటులో లేదని తెలిసిపోయింది. నిజానికి ఈ దేశానికి అవినీతి కొత్తేమీ కాదు. "అనాదిగా ఈ దేశంలో అవినీతి రాజ్యమేలుతోంది.." ఏండ్లుగా మనం వింటున్న మాటే ఇది. కానీ ఈ మాట వినిపించకుండా చేస్తానని మాటిచ్చి, ప్రజలను నమ్మించి అధికారం సాధించారు మోడీ. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న సుమారు 70 లక్షల కోట్ల నల్లధనాన్ని తిరిగి దేశానికి రప్పిస్తానన్నారు. ఆ సొమ్ముతో ప్రతీ భారతీయుడి ఖాతాలో 15లక్షలు జమ చేస్తానన్నారు. కానీ విదేశీ బ్యాంకుల్లోని ఆ నల్లధనంలో ఒక్క రూపాయి కూడా తిరిగి రాకపోగా స్వదేశీ బ్యాంకుల్లోని ప్రజాధనం లక్షల కోట్లు లూటీ అవుతోంది. ప్రజల ఖాతాల్లో నయాపైసా జమకాలేదు సరికదా ప్రజలు దాచుకున్న సొమ్ము కూడా తిరిగి తీసుకోలేని దౌర్భాగ్యం దాపురించింది. అవినీతి మరింతగా జడలు విప్పి సరికొత్త దారుల్లో బుసలు కొడుతోంది. గడిచిన నాలుగేండ్లుగా వెలువడుతున్న వరుస స్కామ్‌లతో అటు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తాజా నివేదిక ప్రకారం మోడీ ఏలుబడిలో అవినీతి మరింత పెరిగింది.

**గతేడాది సృష్టించిన దేశ సంపదలో 73శాతం కేవలం ఒక్కశాతం కుబేరులచేతుల్లో చేరిందంటే అందుకు కారణమేమిటి..!? ఈ పెరుగుతున్న సంపద, తీవ్రమవుతున్న అసమానతలూ దేశాన్ని ఎలా తయారు చేస్తున్నాయి..? దేశం సంపన్నమే అవుతోంది.. కానీ ప్రజలు మాత్రం కడుపేదలుగా మారుతున్నారు..! ఇదేనా ప్రధాని సాగిస్తున్న నవ భారత నిర్మాణం..!?**

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే మన దేశంలోని అవినీతి లోతెంతో ప్రపంచం మొత్తానికి ఎత్తిచూపింది. ఈ సంస్థ 2017 సంవత్సరానికిగాను అవినీతి నిరోధంపై ప్రకటించిన ర్యాంకుల్లో భారత్‌కు 81వ స్థానం దక్కింది. 2016తో పోలిస్తే ఈ ర్యాంకు 79 నుండి 81కి దిగజారింది. 2015లో 76వ స్థానంలో ఉన్న భారత్ వరుసగా 79, 81 స్థానాలకు పడిపోవడం దేశంలో పెరుగుతున్న అవినీతి గ్రాఫ్‌ను సూచిస్తోంది. 180 దేశాల్లో అవినీతిపై జరిపిన ఈ సర్వేలో 81వ స్థానంలో నిలిచిన భారత్, ఆసియా, పసిఫిక్ దేశాలలో మాత్రం అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది తరువాత మనదేశంలో అవినీతి 41శాతం పెరిగింది.



అవినీతిలో పోటీ అమ్యామ్యాల జోరు తీవ్రమైంది. 0 నుండి 100 మార్కుల వరకూ ఇచ్చిన స్కోర్ కార్డులో భారత్‌కు దక్కింది 40 మార్కులే. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అధ్యయనం ప్రకారం 100 మార్కులు వస్తే అది అత్యంత నీతివంతమైన దేశం. సగటు మార్కులు సాధించిన దేశాలన్నీ అవినీతిమయ దేశాలు. సగటుకంటే తక్కువ మార్కులు వచ్చిన దేశాలు అత్యంత అవినీతిమయమైన దేశాలు. దేశాల మొత్తం సగటు 43 మార్కులు కాగా, భారత్‌కి వచ్చింది 40 మార్కులే..! అంటే ఈ నివేదిక భారతదేశాన్ని అత్యంత అవినీతిమయ దేశాలలో ఒకటిగా పరిగణిస్తుండటం గమనార్హం. దీనిని బట్టి మోడీ సర్కార్ చేపట్టిన పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు మన అవినీతి తలరాతను ఏమాత్రం మార్చలేకపోయాయని అర్థమవుతోంది.

ఇక అవినీతికి ఎదురొడ్డి నిలవటం భారత్‌లో ప్రాణాలకే ప్రమాదమని ఈ నివేదిక పేర్కొనడం మరో ఆందోళన కలిగించే అంశం. అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టులను, యాక్టివిస్టులను బెదిరించడం, చంపేయడం భారత్, ఫిలిప్పీన్, మాల్దీవుల్లో ఎక్కువగా ఉందని నివేదిక చెపుతోంది. మొత్తం ఆసియా, ఫసిఫిక్ దేశాల్లోనే ఈ మూడు దేశాల్లో అవినీతి వ్యతిరేక ఉద్యమకారుల పరిస్థితి దారుణంగా ఉందని హెచ్చరిస్తోంది. దీనిని బట్టి మన దేశంలో అవినీతి శక్తులు ఎంత బలంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దేశంలో అవినీతి కేసుల్లో ఇరుక్కున్న ఎంపీలు 31శాతం ఉండగా, అవినీతికి పాల్పడుతున్న ఇతర రాజకీయ నేతలగణం 78శాతం ఉండటం ఈ అవినీతి మూలాలను, ఈ శక్తుల బలాబలాలను తెలియజేస్తోంది. పోలీస్ స్టేషన్లు మొదలు ప్రభుత్వ కార్యాలయాలూ, ప్రభుత్వ సంస్థలూ, కోర్టుల వరకూ అడుగడుగునా ఏ ప్రభుత్వ సేవలు పొందాలన్నా లంచం తప్పనిసరైన ఈ దేశంలో అధికారులూ రాజకీయ నేతలే కాదు, ఇప్పుడు మత పెద్దలూ అవినీతికి అతీతులు కాదని ఈ నివేదిక తేల్చడం విశేషం. ఇది మోడీ ప్రభుత్వం సాధించిన అదనపు ఘనత..!

భారత్ అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. మరేదేశానికీ లేనంత యువ సంపత్తీ, విస్తారమైన మానవ వనరులు, అపారమైన సహజ వనరులూ ఈ దేశం సొంతం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేయగల సత్తా ఉన్న దేశం. ఇన్ని సానుకూలతలు ఉండికూడా నేడు దేశం అభివృద్ధిలో ప్రపంచంలో పోటీపడలేక పోతున్నదంటే ప్రధాన ఆటంకం అవినీతే... అయితే విషాదమేమిటంటే.. దశాబ్దాలుగా మన ఏలికలు దేశంలో అవినీతిని అతి సాధారణాంశంగా మార్చేశారు. ప్రభుత్వాలేవయినా ఇక్కడ స్కామ్‌లు సాధారణం..! స్కామ్ ఏదైనా వేలు లక్షల కోట్లు దోచేయడం సర్వసాధారణం..!! అన్నిటికీ మించి ఇంత జరుగుతున్నా ఇదీ మన వ్యవస్థ అని జీర్ణించుకుని సర్దుకుపోవడం ఇంకా సాధారణమైంది. ఫలితంగా అభివృద్ధి మందగించడమే కాదు దాని సమతుల్యత కూడా దెబ్బతింటున్నది. ఇది తీవ్రమైన అసమానతలకు దారి తీస్తోంది. గతేడాది సృష్టించిన దేశ సంపదలో 73శాతం కేవలం ఒక్కశాతం కుబేరులచేతుల్లో చేరిందంటే అందుకు కారణమేమిటి..!? ఈ పెరుగుతున్న సంపద, తీవ్రమవుతున్న అసమానతలూ దేశాన్ని ఎలా తయారు చేస్తున్నాయి..? దేశం సంపన్నమే అవుతోంది.. కానీ ప్రజలు మాత్రం కడుపేదలుగా మారుతున్నారు..! ఇదేనా ప్రధాని సాగిస్తున్న నవ భారత నిర్మాణం..!?

---

ప్రజావాణి

## వసతులు మెరుగుపర్చాలి

మార్చి నెలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రతిసారీ అసౌకర్యాల మధ్య జరుగుతున్నాయి. దాదాపు ప్రతి పరీక్షా కేంద్రంలో యిటు వంటి పరిస్థితే ఉంటుంది. ప్రతీ సంవత్సరం విద్యాశాఖ సకల సౌకర్యాలు పరీక్షలకు కల్పించామని ప్రకటన చేస్తుంది. కానీ అది మాత్రం వాస్తవ దూరంలో ఉంటుంది. విద్యార్థులు బెంచీలపై కూర్చొని పరీక్షరాయాలనే నిబంధన ఉన్నా, పలు చోట్ల క్రింద కూర్చోబెట్టి పరీక్ష రాయిస్తున్నారు. కొన్ని పరీక్ష కేంద్రాలలో అయితే గదులు చీకటి మయంగా ఉంటున్నాయి. చాలా పరీక్ష కేంద్రాలలో మరుగుదొడ్లు అసలు ఉండటం లేదు. ఇటువంటి సందర్భాలలో విద్యార్థినుల అవస్థలు యినీ అన్నీ కావు. విద్యాశాఖ అరకొర వసతులు ఉన్న పరీక్షకేంద్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి ఉంచాలి. విద్యాశాఖవారు పరీక్షా కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించటానికి నిధులు విడుదల చేయాలి. ఏండ్లు గడుస్తున్నా అవే సమస్యలు పునరావృతం కావడం సరైంది కాదు. అందుకని ప్రభుత్వం సంబంధిత అధికారులతో పరీక్షా కేంద్రాల నిర్వహణా, తీరుతెన్నుల గురించి నివేదికలు తీసుకోవాలి. పరీక్షలు సవ్యంగా రాసే వాతావరణాన్ని అధికారులు కల్పించాలి.

**షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్.**

## పిల్లల్ని ఇబ్బంది పెట్టవద్దు

ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షలు సమీపించాయి. విద్యార్థులంతా దీక్షతో, పట్టుదలతో, ఏకాగ్రతతో పాఠ్యాంశాలను పునర్విమర్శ చేసుకునే సమయం. తెల్లవారు జాము 4 గంటల నుండి రాత్రి వరకు ప్రణాళికలు వేసుకొని దాని ప్రకారం శ్రద్ధగా చదువుతుంటారు. ఈ సమయంలో విద్యుత్ కోతలు విధించవద్దు. విద్యార్థుల పరీక్షలు ముగిసేదాకా నిరంతర విద్యుత్ సరఫరా జరగాలి. అలాగే తల్లిదండ్రులు, పెద్దల బాధ్యత ఎంతో ఉంది. విద్యార్థుల స్థాయిని మించి చాలా ఎక్కువ టార్గెట్‌లు పెట్టి అనవసరమైన ఒత్తిడి తేవద్దు. తగిన ప్రోత్సాహంతో చదివించాలి. పెద్దలు తమ టీవీ కార్యక్రమాలను పక్కన పెట్టాలి. పిల్లల ఆహార విషయంలోనూ శ్రద్ధ వహించాలి. శీతలపానీయాలు, జంక్‌ఫుడ్ అనారోగ్యాన్ని కలిగించే ఆహారాన్ని పెట్టవద్దు. చక్కని ఆరోగ్యానికి దోహదం చేసేవే తినిపించాలి. నిపుణుల సలహాలు, సూచనలతో తమ పిల్లలు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేలా శ్రద్ధ తీసుకోవాలి.

**సరికొండ శ్రీనివాసరాజు,**

---

# ఏకకాలంలో ఎన్నికలు - ప్రజాస్వామ్యం - సంస్కరణలు



**కొండూరి వీరయ్య**

ఈ సంవత్సరం, 2018లో ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019లో మరో పది రాష్ట్రాల ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల నగారా మోగుతుంది. ఆ తర్వాతి సంవత్సరం అంటే 2020లో ఆరు రాష్ట్రాల ఎన్నికలున్నాయి. మొత్తంగా చూస్తే ఎన్నికలు లేకుండా గడిచే సంవత్సరం మనకు కనపడదు. ఇది జాతీయ చిత్రం. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో కూడా పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదు. శాసనసభ ఎన్నికలు, శాసనమండలి ఎన్నికలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు, పంచాయతీలు ఒకవైపున, నీటితీరువా మొదలు పాఠశాల విద్యా కమిటీలు, సహకార సంస్థల ఎన్నికలు మరోవైపున చూస్తూనే ఉన్నాము.

> **అందువల్లనే ఏకకాలంలో ఎన్నికలు ఎంతో గొప్ప ప్రజాస్వామిక చర్య అనీ, అభివృద్ధి ప్రవాహానికి ఆనకట్టలు తెగ్గొట్టే చర్య అనీ, ఒకేసారి ఎన్నికలు జరిగితే జనం జీవితాల్లో వెలుగులు నింపొచ్చంటూ ముందుకొస్తున్న వాదనలు పాలకపక్షాల, పాలకవర్గాల తక్షణ ప్రయోజనాలనే విషపు గుళికను ప్రజాస్వామిక సంస్కరణ అనే చెరకు రసంతో కలిపి తాగించే ప్రయత్నమే. తస్మాత్ జాగ్రత్త.**

బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తూ రాష్ట్రపతి ఈ అంశాన్ని చర్చకు పెట్టారు. బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో ఈ మేరకు వాగ్దానం చేసిందని, దాన్ని నెరవేర్చటానికి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని కూడా శెలవిచ్చారు. రాష్ట్రపతికి మిగిలిన వాగ్దానాల గురించి ప్రభుత్వం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయలేదేమో అనిపిస్తోంది. రాష్ట్రపతి ఏటా చేసే ఈ ప్రసంగాలు ఆయా ప్రభుత్వాల మనోభీష్టానికి అద్దం పడుతుంటాయి. అంతకు ముందే దాదాపు ఏడాది కాలంలో అడపాదడపా ఈ విషయాన్ని ప్రధాని మోడీ స్వయంగా చర్చకు పెట్టడం కూడా పాఠకులకు గుర్తుండే ఉంటుంది. వరుసగా వచ్చే ఎన్నికల కారణంగా పాలకపార్టీల నాయకత్వం దేశాభివృద్ధికి, రాష్ట్రాల అభివృద్ధికి సమర్ధవంతమైన వ్యూహాలు రూపొందించే అవకాశం కోల్పోతున్నామన్న వాదన కూడా తరచూ తటస్థ మేధావులుగా చలామణీ అయ్యేవాళ్లు తమ స్వతంత్ర జ్ఞానోదయంగా వినిపిస్తున్నారు. పదే పదే ఎన్నికల ప్రవర్తన నియమావళి అడ్డు రావటం వల్ల ప్రభుత్వం అనేక విధాన నిర్ణయాలు వాయిదా వేసుకోవాల్సి వస్తోందన్న వాదన కూడా ఉంది. అంతేకాదు. ఎన్నికల్లో అభాసు పాలవుతామన్న ఆందోళనతో కొన్ని కీలకమైన సోకాల్డ్ సంస్కరణలు వెనకపట్టు పడుతున్నాయని ప్రపంచ బ్యాంకు మొదలు పలు అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు వాపోతున్న విషయం మరువరానిది. ఈ ప్రతిపాదన పట్ల ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మినహా మిగిలిన జాతీయ పార్టీలు నోరు మెదపలేదు. ఏఐడీఎంకే, అసోం గణపరిషత్ సమర్ధించాయి. తృణమూల్ కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామ్యంపై దాడిగా భావించింది.

నిజంగా వరుసగా ఏదో ఒక స్థాయిలో జరుగుతున్న ఎన్నికల కారణంగా జాతీయాభివృద్ధి ఆగిపోతుందా అన్నది కీలకప్రశ్న. జాతీయాభివృద్ధికి ఇదే కీలకమైన అవరోధమైతే మరి గద్దెనెక్కిన నాలుగేండ్ల వరకు ఈ అంశంపై ప్రభుత్వం నోరెందుకు విప్పలేదు? కనీసం మొత్తం ఎన్నికల ప్రక్రియను అజమాయిషీ చేసే కేంద్ర హోం శాఖ గానీ, కేంద్ర ఎన్నికల సంఘం గానీ ఒక విధాన పత్రాన్ని రూపొందించి ఎందుకని చర్చకు విడుదల చేయలేదు? జాతీయ పార్టీలను, ప్రాంతీయ పార్టీలను ఆహ్వానించి కనీసం అభిప్రాయ సేకరణన్నా ఎందుకు పూనుకోలేదు? ఇవన్నీ మోడీకి మాత్రమే సమాధానాలు తెలిసిన ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు మన్ కీ బాత్ ద్వారానో, మనోభీష్ట ప్రకటన ద్వారానో ప్రధాని పెదవి విప్పితే దేశం తెలుసుకోవాలనుకుంటున్న ప్రశ్నలు. ఇక్కడ ఒక్క విషయాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి. ఇదేదో రాత్రికిరాత్రి మోడీకో, లేదా అప్పటి బీజేపీ ఎన్నికల ప్రణాళిక రూపొందించిన కరసేవకులకో జ్ఞానం అన్న పురుగు కుట్టడంతో వచ్చిన తెలివి మాత్రం కాదు. 1967 వరకు లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరిగే సాంప్రదాయం కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయటం, లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు వంటి అనేక కారణాల వల్ల తర్వాతి కాలంలో పరిస్థితులు మారిపోయాయి. ఈ నినాదాన్ని ముందుకు తేవటం వెనక ఉన్న పాలకపక్షాలు, పాలకవర్గాల ప్రయోజనాలను అర్థం చేసుకోవటంలో విఫలమైతే మోడీ రుబ్బే పప్పులో కాలేస్తాం. అంతేకాదు. ఈ ప్రతిపాదన ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు, ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఆయా రాష్ట్రాల ప్రజలకు ఉన్న హక్కును కూడా తీవ్రంగా ప్రభావితం చేయనున్నది.

ముందుగా పాలకపక్షం ప్రయోజనాలు గురించి ప్రస్తావించుకుందాం. ఒకే పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్నా వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగటం వల్ల ప్రభుత్వాల పట్ల ప్రజల్లో ఉండే సహజ వ్యతిరేకత ఆయా దశల్లోని ఎన్నికల ఫలితాలను శాసిస్తుంది. ఈ ప్రభుత్వ వ్యతిరేకత అనే నదిని దాటటానికి పాలకపక్షం ముందుకు తెచ్చిన నావ ఏకకాలంలో ఎన్నికలు. తద్వారా ప్రజాగ్రహం అనే నదిని దాటి అవతలి గట్టు మీద ఉన్న అధికారాన్ని చేరుకోవటానికి పాలకపక్షం ప్రయోగిస్తున్న పాచిక ఇది. జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రాల స్థాయిల్లోనూ ఏకపార్టీ పాలనను ఖాయం చేసుకోవటం ఈ నినాదాన్ని ముందుకు తేవటంలో మరో ముఖ్యమైన లక్ష్యం. దేశంలో జాతీయ పార్టీల వైఫల్యం, అధికార దుర్వినియోగపు చరిత్రలోనే ప్రాంతీయ పార్టీల పుట్టుకకు పునాదులు పడ్డాయి. బీజేపీ వంటి జాతీయ స్థాయిలో నాటి ప్రతిపక్షం, నేటి పాలకపక్షం ఎదుగుదల వెనక కూడా జాతీయ పార్టీగా కాంగ్రెస్ ప్రజలకు దూరమైన తీరే కారణం. అంతేకాదు. జాతీయ పార్టీలు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలకు వీసమెత్తు విలువ ఇవ్వకపోవటంతో ఆత్మగౌరవం, స్థానికులు, స్థానికేతరులు (శివసేన ఎదుగుదలకు పునాది భూమిపుత్రులు అన్న నినాదం), వెనకబాటుతనం వంటి అనేక నినాదాలతో ఆయా డీఎంకే మొదలు టీఆర్ఎస్ వరకు, సమాజ్‌వాదీ మొదలు అసోం గణపరిత్ వరకు పలు పార్టీలు పుట్టుకొచ్చాయి. వేళ్లూనుకున్నాయి. త్రిపుర లాంటి చిన్న రాష్ట్రంలో అడుగుపెట్టడానికి సైతం బీజేపీ లాంటి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉగ్రవాద శక్తులతో పొత్తు పెట్టుకోవాల్సి రావటం గమనిస్తే ఆయా రాష్ట్రాల ప్రజల మనోభీష్టాన్ని సిద్ధింపచేయటంలో వైఫల్యం పాలకవర్గ పార్టీలను ఏ దుస్థితికి చేరుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఆయా రాష్ట్రాల ప్రాధాన్యతలు, ప్రయోజనాలు, ప్రత్యేకతల ఆధారంగా అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్న పలు ప్రాంతీయ పార్టీలు ఏకకాలంలో ఎన్నికలు జరిగితే అనివార్యంగా జాతీయ స్థాయి నాయకుల ముందు ఉత్సవ విగ్రహాలుగా మారాల్సి వస్తుంది. స్వతంత్ర అస్థిత్వాన్ని, పలుకుబడిని కోల్పోవాల్సి వస్తుంది. 1970-1980 దశకం మధ్యలో ప్రాతీయ నాయకత్వాలు అటువంటి దుస్థితి ఎదుర్కొన్న విషయాన్ని పాఠకులు మర్చిపోలేదు. ఈవిధంగా జమిలి ఎన్నికలు జరగటం



కేంద్రప్రభుత్వంలో నియంతృత్వపోకడలను మరింత వేగవంతం చేస్తుంది.

రెండో కోణం ప్రజాస్వామ్య ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం. దేశంలోని ప్రజలందరికీ ప్రాతినిధ్య ప్రభుత్వాల ద్వారా పరిపాలించబడే హక్కు ఉంది. ఆయా రాష్ట్రాల నిర్దిష్టతలను బట్టి ఆయా శాసనసభలకు నిర్దిష్ట సమయాల్లో ఎన్నికలు జరగాలి. ప్రస్తుతం కొనసాగుతున్న వెసులుబాటు అది. ఈ విధంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రకారం ఐదేండ్లు కొనసాగుతాయి. కానీ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయం అమలు జరిగితే కనీసం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలనన్నా అర్ధాయుష్షుతో ముగించాలి. అది ఒక సమస్య. ఏ కారణం వల్లనైనా ఎన్నికైన ప్రభుత్వాలను తాజాగా జరిగిన అరుణాచల్, ఉత్తరాఖండ్ తరహాల్లో రద్దు చేయాల్సి వస్తే తదుపరి ఎన్నికల సమయం సమీపించే వరకు వేచి ఉండాలే తప్ప మధ్యలో ఎన్నికలు జరిపే అవకాశం ఉండదు. అంత కాలమూ ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వం లేకుండానే వారి పాలనా బాగోగుల బాధ్యత కేంద్రం అజమాయిషీకి వెళ్తుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏ కారణం రీత్యా రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చినా ఆర్నెల్లకొకసారి పార్లమెంట్ అనుమతితో రాష్ట్రపతి పాలన కొనసాగించాలి. ఏడాదికి మించకుండా ఎన్నికలు నిర్వహించాలి. తద్వారా సాధ్యమైనంత త్వరగా ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వాన్ని తెరమీదకు తేవాలి. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయం ఈ ప్రజాస్వామిక సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది.


చివరిగా ఈ ప్రతిపాదన ద్వారా పాలకవర్గం సాధించదల్చుకున్న ప్రయోజనాలు ఏమిటన్నది ప్రశ్న. ఇక్కడ ప్రపంచ బ్యాంకు, రేటింగ్ సంస్థల అభిప్రాయాలను పరిశీలించాల్సి ఉంది. ఆర్థిక సంస్కరణలను అమలు జరిపేది, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య పెట్టుబడికి మార్గాలు తెరిచేది ఎన్నికైన ప్రభుత్వాలే. ఏ ప్రభుత్వం ఏ మోతాదులో ఏ వేగంతో సంస్కరణలు ముందుకు తీసుకెళ్తుందో దాన్నిబట్టి ఆయా ప్రభుత్వాలకు రేటింగ్‌సంస్థలు మార్కులేస్తాయి. కారణాలతో నిమిత్తం లేకుండా అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలు పరిరక్షించేందుకు వీలుగా అన్ని ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఈ అటువంటి చర్యలకు వేసే మార్కులే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రభుత్వాలకు ఇచ్చే ర్యాంకులు. వేసే మార్కులు. అటువంటి ర్యాంకుల్లో ముందంజలో ఉండాలంటే ప్రభుత్వాలు ప్రజామోదం ఉందా లేదా అన్న దాంతో నిమిత్తం లేకుండా ఈ సంస్కరణలను మోడీ తరహాలో ఒక్క పెన్ను పోటుతో అమలు జరపగల సత్తా ఆయా ప్రభుత్వాలకు ఉండాలని మార్కెట్లు ఆదేశిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకుతో సహా పలు రేటింగ్ సంస్థలు తమ అంచనాల్లో భారతదేశం వంటి విశాల దేశంలో పదే పదే ఎన్నికలు జరగటం వల్ల సంస్కరణల వేగం మందగిస్తోందని నిరసనలు వ్యక్తం చేశాయి.

తాజాగా ముగిసిన దావోస్ పెట్టుబడిదారుల వేదికలో సైతం ఈ అంశం చర్చకు వచ్చింది. దీనికి ఆయా సంస్థలు పెట్టే పేరు ప్రభుత్వ విధానాల్లో నిలకడతత్వం లోపించటం వల్లనే విదేశీ ద్రవ్య పెట్టుబడులు ఆచితూచి వ్యవహరిస్తున్నాయన్న వాదన ముందుకు తెస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల అనుభవాలు దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలను ఆదుకునే విషయంలో సన్నాయి నొక్కులు నొక్కిన అరుణ్ జైట్లీ ఐదవ బడ్జెట్‌లో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆశించిన సంస్కరణలు అంతగా కనిపించక పోవటంతో స్టాక్ మార్కెట్ ఎనిమిదివందల పాయింట్లు దివాళా తీసింది. ఇవన్నీ కారణాలుగా చూపించే కార్పొరేట్ మేధావులు, ద్రవ్యపెట్టుబడి ప్రతినిధులు దేశవ్యాప్తంగా అన్ని దశల్లోనూ ఒకే సారి ఎన్నికలు జరిగితే నికరంగా ఐదేండ్లపాటు తమ ప్రయోజనాలు కాపాడే ప్రభుత్వాలు ఎటువంటి ప్రజాగ్రహం వెరపూ లేకుండా గద్దెమీద ఉంటాయని, ప్రజాగ్రహం వెరపు లేనప్పుడు అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలు భుజాన వేసుకుని ఇతోధికమైన సేవలందించటంలో అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తాయన్న నమ్మకం ఉంది. అందువల్లనే ఏకకాలంలో ఎన్నికలు ఎంతో గొప్ప ప్రజాస్వామిక చర్య అనీ, అభివృద్ధి ప్రవాహానికి ఆనకట్టలు తెగ్గొట్టే చర్య అనీ, ఒకేసారి ఎన్నికలు జరిగితే జనం జీవితాల్లో వెలుగులు నింపొచ్చంటూ ముందుకొస్తున్న వాదనలు పాలకపక్షాల, పాలకవర్గాల తక్షణ ప్రయోజనాలనే విషపు గుళికను ప్రజాస్వామిక సంస్కరణ అనే చెరకు రసంతో కలిపి తాగించే ప్రయత్నమే. తస్మాత్ జాగ్రత్త.

**సెల్: 9871794037**

---

# మోడీ ఎన్‌డీఏకు బీటలు... కొత్త శక్తులకు బాటలు




**పతకమూరు దామోదర్ ప్రసాద్**

ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నిరంకుశ, అహంబావ పూరిత, నిర్లక్ష్య ధోరణిపట్ల జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీయే) మిత్రపక్షాలు శివసేన, తెలుగుదేశం, అకాలీదళ్ నేతల్లో అసంతృప్తి, ఆగ్రహం పెల్లుబుకుతోంది. 2017 మార్చిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో యూపీ, ఉత్తరాఖండ్‌లో భారీ మెజారిటీ సాధించడం, మణిపూర్, గోవాలలో కాంగ్రెస్ సీట్లు గెలిచి పెద్ద పార్టీగా ఉన్న మాయోపాయాలతో ఇతర పార్టీల శాసనసభ్యులకు మంత్రిపదవులు, డబ్బు ఎరవేసి అక్కడా కమలం ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంతో అప్పట్లో మోడీ-అమిత్‌షా నాయకత్వానికి తిరుగులేదని, మోడీ అజేయుడనే అభిప్రాయం ఏర్పడింది. అయితే దేశంలో పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వల్ల ఆర్థికరంగం అస్తవ్యస్తం కావడం, అధికార పక్షానికి సన్నిహితులైన బడా వ్యాపార సంస్థలు అక్రమ, అనుచిత పద్ధతుల్లో ప్రభుత్వం బ్యాంకుల నుండి వేల కోట్లు కొల్లగొట్టి విదేశాలకు పారిపోవడం, నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగం, కోలుకోని పరిశ్రమలు, ఉపాధి కల్పన "భ్రమ"గా మిగిలిపోవడంతో ప్రజల్లో ముఖ్యంగా యువతలో అసంతృప్తి రగులుతోంది. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ బొటాబొటీ మెజారిటీతో గెలవడం, రాజస్థాన్‌లో 2 లోక్‌సభ, 1 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు. కమలం ఘోర పరాజయం దరిమిలా మోడీ సత్తాపై సందేహాలు ఏర్పడ్డాయి. సైద్ధాంతికంగా బీజేపీ "హిందూత్వ"కు సన్నిహితమైన శివసేన ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో కమలంతో జతకట్టబోమని కరాఖండీగా ప్రకటించింది. శివసేన లోక్‌సభలో సీట్లు, చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీకి పార్లమెంట్ లో 16 సీట్లున్నాయి. ప్రత్యేక హోదా, ఏపీ విభజన చట్టంలో హామీల అమలు కోసం ఆందోళన బాట పట్టింది. మరో మిత్రపక్షం అకాలీదళ్.. ముస్లింలు ఇతర మైనారిటీలపై దాడుల పట్ల అసంతృప్తి వున్నా ఇప్పట్లో ఎన్నికలు లేవుగనుక వేచిచూస్తోంది.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కాంగ్రెస్ క్రమంగా బలం పుంజుకుంటోంది. 2014లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ "అచ్చేదిన్ నినాదం"తో సొంతంగా 282 స్థానాలు సాధించి శివసేన, తెలుగుదేశం, అకాలీదళ్ భాగస్వాములుగా ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పరచినా మిత్రపక్షాలను చులకనగా చూస్తోందనే అభిప్రాయం ప్రబలంగా ఉంది. ఒకనాడు కమ్యూనిస్టు యోధుడు హరికిషన్‌సింగ్ సూర్జిత్, ఎ.బి. బర్దన్‌ల దన్నుతో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా దేవెగౌడ, ఎం.కె.గుజ్రాల్ ప్రధానులుగా కేంద్రంలో మూడో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో కీలకపాత్ర వహించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాదికి పైగా కలుసుకోవడానికి ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, చంద్రబాబు 29సార్లు ఢిల్లీ వెళ్ళి కేంద్ర మంత్రులను కలసినా ఫలితం లేకపోవడం ప్రజాగ్రహ కారణమవుతోంది. విభజన సమయంలో తెలంగాణ - నవ్యాంధ్రాకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని మేధావులు, వివిధ ప్రజా

> **లోక్‌సభ 543 సభ్యులతో సాధారణ మెజారిటీకి 273 స్థానాలు కావాలి. ఇప్పుడు బీజేపీకి కేవలం 275 స్థానాలు అంటే కేవలం 3 స్థానాలే అధికం. బీజేపీలో డజను మంది ఎంపీలు తిరుగుబాటు చేస్తే మిత్రపక్షాల మద్దతు లేకుండా మోడీ సర్కారు అధికారంలో కొనసాగడం కష్టం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించడం అంత సులువేమీకాదు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, వివిధ రాష్ట్రాలలోని సెక్యులర్ ప్రజా తంత్ర శక్తులు ఏకమైతే సంఘ పరివార్ శక్తుల ఆట కట్టించవచ్చు.**

సంఘాలు, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్ తదితర పార్టీలన్నీ కోరుతూ వచ్చాయి. టీఆర్ఎస్ కూడా అందుకు మద్దతు పలికింది. అయినా మోడీ బృందం తలకెక్కలేదు. హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ పేరిట అరకొరగా ముష్టి నిధులు విదిలిస్తూ వచ్చింది. భారీ పోలవరం ప్రాజెక్టులకు నేరుగా నిధులివ్వకుండా నాబార్డు ద్వారా అప్పుడప్పుడు కొంత మొత్తం ఇస్తోంది. కొన్ని విద్యా సంస్థలను ప్రారంభించినా వాటికి తగిన నిధులివ్వకుండా కాలయాపన చేస్తోంది. తెలంగాణ మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల పథకాలకూ నిధులు జాడేలేదు. ఉపాధి కల్పన పరిశ్రమల స్థాపనలోనూ నిర్లక్ష్యమే. ఆర్థిక నేరస్తులు విజయ్‌మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీ ప్రభుత్వాలను దేశానికి రప్పించి శిక్షించే చర్యలు లేవు.



బలవద్విరోధం తగదని ఇన్నాళ్ళూ వేచిచూసిన చంద్రబాబు రాష్ట్ర సమస్యలపై ఎంపీలతో ఆందోళన బాట పట్టారు. అయినా మోడీ ప్రభుత్వం అహంభావ, నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం మానలేదు. గతంలో లాలూప్రసాద్ యాదవ్ ఆర్జేడీతో జతకట్టి గెలిచిన బీహార్ సీఎం నితీశ్ కుమార్ హఠాత్తుగా ప్లేటు మార్చి బీజేపీతో మళ్లీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి బీజేపీ చిన్న మిత్రపక్షాలు రాష్ట్రీయ లోక్‌సత్తాపార్టీ దళితనేత జితిన్ మాంఝీ హిందుస్థాన్ అవామిమోర్చా, రాంవిలాస్ పాశ్వాన్ లోక్‌జనశక్తి పార్టీలు ఇప్పుడు తాజాగా లాలూ ఆర్జేడీతో మంతనాలు సాగిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త ఎంఎస్ గోవాల్కర్ ప్రవచించిన ఒకే దేశం.. ఒకే జాతి.. ఒకే చట్టసభ నినాద స్ఫూర్తితో ఎందరో వ్యతిరేకిస్తున్నా అసెంబ్లీ - లోక్‌సభలకు ఏకకాల ఎన్నికల అజెండాను మోడీ అమిత్‌షా తెరపైకి తెచ్చి క్రమంగా రాజకీయ గుత్తాధిపత్యం సాధనకు యత్నిస్తున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, వామపక్షాలు ఏకకాల ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి.

త్రిపురలో వామపక్ష ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు జాతి వ్యతిరేక శక్తులతో జతకట్టింది. రానున్న రెండు నెలల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు మోడీ ప్రతిష్టకు పరీక్ష. ఆ తరువాత జరిగే రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాలపై వ్యతిరేకత వల్ల ఫలితాలు వేరుగా రావచ్చు. 22 కోట్ల జనాభా, 80 లోక్‌సభ స్థానాలు గల యూపీలో 2014 ఎన్నికల్లో మిత్రపక్షం అప్నాదళ్‌తో కలసి 73స్థానాలు గెలిచిన బీజేపీకి ఈసారి నల్లేరు నడకకాదు. అఖిలేష్‌యాదవ్ సమాజ్‌వాదీ, మాయావతి బీఎస్పీ, కాంగ్రెస్ తదితర పక్షాలు ఏకమైతే కమలనాథులకు అక్కడ గర్వభంగం తప్పదు. రాజస్థాన్, గుజరాత్‌లలో అప్పటివలే అన్ని లోక్‌సభ స్థానాలూ బీజేపీకి దక్కే పరిస్థితి లేదు. పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ మోడీ సర్కారు చర్యలను వ్యతిరేకిస్తోంది. ఒరిస్సాలో బిజూ జనతాదళ్, కేరళ వామపక్ష ఫ్రంట్‌లూ వ్యతిరేకమే. తెలంగాణలో టీఆర్ఎస్‌కు కాంగ్రెసే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి గనుక కేసీఆర్ వేచిచూసే ధోరణిలో వున్నారు. తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే కాంగ్రెస్ కూటమిలో ఉన్నా 2-జీ కుంభకోణంలో ఎ. రాజా, కనిమొళిలను కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన దరిమిలా ఇంకా స్పష్ట వైఖరి ప్రకటించలేదు. బీహార్‌లో లాలూ యాదవ్ అరెస్టు దరిమిలా యాదవ్-ముస్లిం వర్గాల్లో ఆయనపై సానుభూతి పెరుగుతున్నట్టు వార్తల దరిమిలా కుశ్వాహా, జాతిన్ మాజీ ప్రభృతులు ఆర్జేడీతో కలిస్తే ఫలితాలు ఆర్జేడీకి అనుకూలంగా మారొచ్చు. నాగాలాండ్‌లో 15ఏండ్లుగా బీజేపీతో ఉన్న మిత్రబృందాన్ని నాగా పీపుల్సుఫ్రంట్ పెంచుకుని సొంతంగా పోటీ చేస్తోంది. ప్రజా వ్యతిరేకతవల్ల కేంద్రంలో మణిపూర్‌లో బీజేపీతో సంకీర్ణ భాగస్వామిగా ఉన్న మేఘాలయ నేషనల్ పీపుల్స్ పార్టీ ఎన్నికల పొత్తు పెట్టుకోలేదు. గోవాలో ఎంజిని, గోవా ఫార్వర్డ్ పార్టీ, సంకీర్ణ నుండి వైదొలగుతామని బీజేపీని హెచ్చరిస్తున్నాయి.

జనాగ్రహం తీవ్రమైతే ఎంత నియంతృత్వ పాలకులైనా గద్దె దిగక తప్పదు. చంద్రబాబు ప్రభుత్వం ఇంకా మోడీ ప్రభుత్వంపై భ్రమలో ఉంటే మహాభారత్ సర్పయాగంలో జరిగినట్టు "సహేంద్ర తక్షకాయస్వాహా" వలె మోడీ సర్కారుతో బాటు ప్రజాగ్రహ సమిధిలకు ఆహుతికాక తప్పదు. కాశ్మీర్‌లో పీపుల్సు డెమొక్రాటిక్ పార్టీ, అస్సాంలో అస్సాం గణపరిషత్ కమలం పార్టీపై ఆగ్రహంతో ఉన్నాయి. రైతులపై కేంద్రం నిర్లక్ష్యానికి నిరసనగా మహారాష్ట్ర స్వాభిమానిషేత్కరి సంఘటన ఇప్పటికే వైదొలగింది. మోడీకి వీస్తున్న ఎదురుగాలి. దరిమిలా దేశంలో లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులు ఏకమైతే కమలనాథుల కట్టడి సాధ్యమే. మోడీ అజేయమేమీ కాదు.

**సీనియర్ జర్నలిస్టు, సెల్: 9440990381**




**పెండ్లి రోజు ఆనందం ఇప్పుడు హాసిని ముఖంలో లేదు. అసలు ఆమెలో జీవమే లేదు. భర్త ఇలాంటి వాడని ఆమె అస్సలు అనుకోలేదు. బాగా చదువుకున్న వాడు. అందులోనూ మెడిసన్‌లో పీజీ చేస్తున్నాడు. అలాంటి వ్యక్తి ఎంతో ఉన్నతంగా ఆలోచిస్తాడనుకుంది. కానీ అతను, అతని కుటుంబం ఇంత హీనంగా ఆలోచిస్తారని ఆమె అస్సలు ఊహించలేదు.**

# చదువుకు తగ్గ ఆలోచనలేవి?

పెండ్లి చూపులకు వచ్చిన రోజు ఎంత పద్ధతిగా మాట్లాడారో. హాసిని మెడిసిన్ పూర్తి చేసింది. కాబోయే అల్లుడుకూడా అదే ఫీల్డ్‌లో ఉన్నాడు. దాంతో ఇద్దరూ సంతోషంగా బతుకుతారని అనుకున్నారు కన్నవాళ్ళు. అందుకే వాళ్ళు అడిగినంత కట్నం, బంగారం ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు. ఓ ఇల్లు కూడా రాసిచ్చారు. ఆ ఇంటిపైన నెలకు 25 వేలు అద్దెలు వస్తాయి. అవి హాసిని అకౌంట్లోనే పడతాయి. పది లక్షలు కట్నంగా ఇచ్చి ఆ డబ్బు ఆమె పేరుతో ఫిక్స్‌డ్ చేశారు. కేజీ బంగారం ఆమె లాకర్‌లోనే ఉంది. బహుశా ఇవేవీ తమ దగ్గరకు చేరలేదనేమో అత్తమామల కోపం.

హాసిని దగ్గరకు భర్తను రానీయరు. రాత్రి పొద్దుపోయే వరకు తల్లితో కబుర్లు చెబుతూ కూర్చుంటాడు. ఎప్పుడో అర్థరాత్రి గదిలోకి వస్తాడు. నోరు తెరిచి భార్యతో ఒక్క ముక్క కూడా మాట్లాడడు. అలా మూడు నెలలు గడిచించి. ఇప్పుడే పిల్లలు వద్దని హాసినిని మందులు వాడమన్నాడు. ఆ మందుల ప్రభావంతో ఆమె కాస్త బొద్దిగా తయారయింది. దాంతో మందులు ఆపేసింది. నెల రోజులకే నెల తప్పింది. తనకు చెప్పకుండా మందులు ఆపేసిందనే కోపంతో అప్పుడే పిల్లలు వద్దని అబార్షన్ చేయించాడు.

ఇక అప్పటి నుంచి హాసిపికి ఆ ఇంట్లో సుఖమంటూ లేదు. 'నువ్వు లావుగా ఉన్నావు. నాకొద్దు. మీ ఇంటికి వెళ్ళి సన్నగా అయిన తర్వాతనే రా, మెడిసిన్ మేనేజ్‌మెంట్ కోటాలో చదివిన దానివి. నీకు తెలివితేటలు లేవు. అసలు ఈ విషయం ముందు మాకు ఎందుకు చెప్పలేదు. ఇప్పుడు నువ్వు పీజీ గవర్నమెంట్ సీటు తెచ్చుకొని పూర్తి చెయ్యి. మంచి ఉద్యోగం సంపాదించిన తర్వాతనే నా దగ్గరకు రా. లేదంటే అప్పటి వరకు రావొద్దు' అంటాడు. అతని అర్థం పర్థం లేని సందేహాలకు ఆమె సమాధానం చెప్పబోతే కొట్టి నోరు మూయిస్తాడు.

ఇలా సుమారు ఏడాది పాటు అత్తారింట్లో ఎన్నో కష్టాలు పడింది. అన్ని రోజులు ఓపిగ్గా ఉన్న ఆమె ఇక భరించలేక చివరకు పుట్టింట్లో విషయాలన్నీ చెప్పింది. దాంతో వాళ్ళు పెద్దమనుషుల్లో పంచాయితీ పెట్టారు. 'మా అబ్బాయికి పీజీ పరీక్షలు ఉన్నాయి. అవి అయిపోయే వరకు మీ అమ్మాయిని మీ ఇంట్లోనే ఉంచుకోండి' అని సమాధానం చెప్పి' పంచాయితీకి రాలేదు. చివరకు ఎంతో మందితో మాట్లాడిస్తే 'బయట వాళ్ళు ఎవ్వరూ లేకుండా మన రెండు కుటుంబాలు మాత్రమే ఉంటే వస్తాం' అని చెప్పాడు. ఏదో ఒక విధంగా కూతురి జీవితం బాగుపడడమే కావాలని అతని మాటలకు ఒప్పుకొని పంచాయితీ పెట్టారు.

అక్కడకు వచ్చిన వాళ్ళు పెద్ద గొడవ క్రియేట్ చేసి హాసిని తల్లిని బూతులు తిట్టి, హాసినిని విపరీతంగా కొట్టి 'మీ అమ్మాయి మాకు వద్దు' అని చెప్పి వెళ్ళిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో హాసిని తల్లిదండ్రులు ఆమెను తీసుకొని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చి సమస్య మొత్తం చెప్పారు.

**ఐద్వా అదాలత్**
సెల్: 9490098024

> **సుమారు ఏడాది పాటు అత్తారింట్లో ఎన్నో కష్టాలు పడింది. అన్ని రోజులు ఓపిగ్గా ఉన్న ఆమె ఇక భరించలేక చివరకు పుట్టింట్లో విషయాలన్నీ చెప్పింది. దాంతో వాళ్ళు పెద్దమనుషుల్లో పంచాయితీ పెట్టారు.**

సభ్యులు హాసిని భర్తను, అత్తమామలను రమ్మని లెటర్ పంపారు. కానీ వాళ్ళు రాలేదు. ఫోన్ చేస్తే 'మేము ఎక్కడికీ రావట్లేదు, మీ ఇష్టం వచ్చింది చేసుకోండి' అన్నారు. దాంతో హాసిని భర్త, అత్తమామలపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది. పోలీసులతో లీగల్‌సెల్ సభ్యులు కూడా మాట్లాడారు.

దాంతో పోలీసులు హాసిని భర్తకు, తండ్రికి ఫోన్ చేసి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ వచ్చిన వెంటనే వాళ్ళలో టెన్షన్ మొదలయింది. కూతురి కోసం చివరకు తమ కాళ్ళ దగ్గరికే వస్తారనుకున్న వాళ్ళు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళడం ఊహించని పరిణామం. దాంతో హాసిని భర్త లీగల్‌సెల్‌కు ఫోన్ చేసి 'మేడమ్, మేము మీ దగ్గరకు వద్దామనుకుంటున్నాం మీరే ఎలాగైనా సమస్యను పరిష్కరించాలి' అన్నాడు.

'మేం మొన్న ఫోన్ చేస్తే మేం రాం, మీ ఇష్టం వచ్చింది చేసుకోమన్నావు కదా, ఇప్పుడెందుకు ఫోన్ చేశావు. ఇప్పుడు ఆమె పోలీస్‌స్టేషన్లో కేసుపెట్టింది. ఏమైనా ఉంటే అక్కడే తేల్చుకోండి' అన్నారు. 'పొరపాటున అలా అన్నాం. మీ గురించి ముందు తెలియక తప్పుగా మాట్లాడం. ఇప్పుడు మీ సంస్థ గురించి మాకు తెలిసింది. మీ దగ్గరికే వస్తాం, ఇప్పుడే రమ్మంటారా?' అన్నాడు.

'మీరు ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి కుదరదు. మేము శనివారం మాత్రమే ఉంటాం. అది కూడా నీతో మాట్లాడడానికి హాసిని కూడా ఒప్పుకోవాలి. ముందు నువ్వు నీ భార్యతో మాట్లాడుకో. ఆమె రావడానికి సిద్ధమైతే మీరూ రండీ' అన్నారు. 'మీరు చెప్పినట్లే చేస్తాం. అయితే అప్పటి వరకు పోలీసులను ఫోన్ చేయవద్దని చెప్పండి. మీ దగ్గరే కూర్చొని మాట్లాడుకుంటాం' అని చెప్పారు. దానికి సభ్యులు అంగీకరించారు.

ఓ గంట తర్వాత హాసిని ఫోన్ చేసి 'నా భర్త ఫోన్ చేసి మీ దగ్గరకు వస్తానంటున్నాడు. ఇప్పుడు ఏం చేయమంటారు' అని అడిగింది. 'నీకు ఇష్టమైతే పిలిపించి మాట్లాడదాం. అతనితో మాట్లాడిన తర్వాత మారతాడనే నమ్మకం నీకు వచ్చినప్పుడే కాపురానికి వెళ్ళొచ్చు' అన్నారు. దానికి ఆమె ఒప్పుకుంది.

తర్వాతి వారం ఇరుకుటుంబాల వాళ్ళు వచ్చారు. ముందు అబ్బాయితో మాట్లాడితే 'హాసిని మా ఇంట్లో వాళ్ళను గౌరవించదు. ఇంట్లో పనులు సరిగా చేయదు. అస్సలు బాధ్యతగా ఉండదు. ఎప్పుడూ పుట్టింటికే వెళతుంటుంది. పైగా కట్నంగా ఇచ్చిన డబ్బంతా ఆమె పేరుతోనే ఫిక్స్‌డ్ చేశారు. ఓ ఇల్లు ఇచ్చారు. అది కూడా ఆమెపేరుతోనే ఉంది. ఇదంతా వాళ్ళు కావాలనే చేస్తున్నారు. పైగా ఆమె మెడిసిన్ మేనేజ్‌మెంట్ కోటాలో చేసింది. ఈ విషయం కూడా మాకు ముందు తెలియదు' అలాంటి ఆమెతో నేను ఎలా కాపురం చేయాలి' అని ప్రశ్నించాడు.

'అసలు ఆడపిల్ల తల్లిదండ్రులు కట్నం ఎందుకు ఇవ్వాలి. ఇచ్చినా ఆ డబ్బు ఆమె భవిష్యత్ కోసం జాగ్రత్త చేసుకోవడంలో తప్పేంది. కట్నంగా ఇచ్చిన డబ్బు ఆమె పేరుతో ఫిక్స్‌డ్ చేస్తారని నీకు ముందే తెలుసు. మరి అప్పుడే ఎందుకు మాట్లాడలేదు. అయినా రేపు మీకు పిల్లలు పుడితే ఆ డబ్బు వాళ్ళకే కదా వచ్చేది. మీ బాధంతో కట్నంగా ఇచ్చిన డబ్బంతా ఆమె పేరుతో ఫిక్స్‌డ్ చేశారని. దాన్ని మనసులో ఉంచుకొని హాసిని లావయిందని, మేనేజ్‌మెంట్ కోటాలో చదివిందని ఏవేవో కారణాలు చెబుతున్నావు. ఈ కారణాలు వినడానికి నీకే సిల్లీగా అనిపించడం లేదా? కాబోయే డాక్టర్‌వి! ఇలా మాట్లాడటానికి నీకు చిన్నతనంగా అనిపించడం లేదా..? పిల్లలు పుట్టకుండా మందులు వాడడం వల్లనే కదా ఆమె లావయింది. డాక్టర్‌వి ఆ మాత్రం తెలియకపోతే ఎలా. ఆ మందులు ప్రభావం ఒక్కొక్కరిపై ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విషయం నీకు మేం చెప్పాలా?

ఏది ఏమైనా నీ ప్రవర్తన మంచిది కాదు. నీ పిచ్చి ప్రవర్తనతో నీ జీవితమే నాశనం చేసుకుంటున్నావు. మంచి కుటుంబాన్ని దూరం చేసుకుంటున్నావు. ఆలోచించుకో. పైగా నీ పైన పోలీస్‌స్టేషన్లో కేసు కూడా పెట్టారు. పీజీ చేసేవరకు ఆమెను రావద్దంటున్నావు పెండ్లికి ముందు తెలియదా..?' అన్నారు.

'మేడం నా పీజీ పరీక్షలు నెల రోజుల్లో అయిపోతాయి. ఆ తర్వాత ఆమెను కచ్చితంగా తీసుకెళతాను. అప్పటి వరకు అక్కడే ఉండమనండి' అన్నాడు. నువ్వు నిజంగా చదువుకోసమే అయితే ఈ విషయం ఆమెకు అర్థమయ్యే విధంగా చెప్పి పుట్టింట్లో ఉంచాలి. అలా కాకుండా ఆమెపై ఇన్ని నిందలు వేస్తే ఎలా..? ఆమెకూ, పుట్టింటి వాళ్ళకు భయం వేయదా?. కూతురి జీవితం ఏమైతుందో అని వాళ్ళు కంగారు పడరా..? మగాడిని కదా ఏం చేసినా సరిపోతుంది అనుకుంటే కుదరదు. ఇప్పుడు ఆమెను నువ్వు తీసుకెళతావా? తీసుకెళ్ళవా?' అన్నారు.

చివరకు అతను హాసినిని ఇంటికి తీసుకెళ్ళడానికి ఒప్పుకున్నాడు. 'తీసుకెళ్ళిన తర్వాత ఆమెకు ఎలాంటి సమస్య వచ్చినా బాధ్యత నీదే. అనవసరంగా ఆమెను ఒక్క మాట అనడానికి వీల్లేదు. నీ చదువుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆమె చూసుకుంటుంది' అన్నారు. దానికి అందరూ ఒప్పుకొని రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్ళిపోయారు.

సలీమ




# దేశికోత్తమ

**రుక్మిణీదేవి అరండేల్ (ఫిబ్రవరి 29, 1904 - ఫిబ్రవరి 24, 1986)**

దేశంలో అత్యున్నత పదవి రాష్ట్రపతి స్థానం. అతికొద్దిమందికి మాత్రమే లభించే ఈ అరుదైన అవకాశం వస్తే వద్దనేవారు ఎవరూ ఉండరు. అయితే కళనే జీవితంగా మలుచుకున్న ఆమె మాత్రమే రాష్ట్రపతి పదవి కన్నా కళాసాధనే గొప్ప అంటూ వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారు. ఆమెనే తమిళనాడులోని చెన్నైలో కళాక్షేత్ర నాట్యపాఠశాల వ్యవస్థాపకురాలు ప్రముఖ నాట్యకళాకారిణి, గురువు రుక్మిణీదేవి అరండేల్. కళలపై మక్కువతో ఆమె కర్ణాటక సంగీతం, బాలే, భరతనాట్యాలలో ప్రావీణ్యం సంపాదించారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని భరత నాట్య శిక్షణ కొరకు పాఠశాల స్థాపించారు.

**WOMEN of the day**



తమిళనాడులోని మదురైలో రుక్మిణీ జన్మించారు. ఆమె తల్లిదండ్రులు శేషమ్మ, నీలకంఠశాస్త్రి. కళలపై ఉన్న ఆసక్తితో పెద్దలు నిర్ణయించిన బాల్య వివాహాన్ని నిరాకరించారు. ఆ తర్వాత కర్ణాటక సంగీతం నేర్చుకుని ఏడేండ్ల వయసులోనే తండ్రి పని చేసే థియాసాఫికల్ సొసైటీలో చేరారు. తన అభిరుచులను గౌరవించి.. ఆలోచనలతో ఏకీభవించిన విదేశీయుడు తనకన్నా రెట్టింపు వయసు ఉన్న జి.ఎస్.అరండేల్‌ను ప్రేమించి, పెద్దల అభ్యంతరాల మధ్య ముంబైలో రిజిస్టర్ ఆఫీసులో పెళ్ళి చేసుకున్నారు. ఆ తర్వాత భర్తతో అనేక ప్రదేశాలకు వెళ్లారు. రష్యా కళాకారిణి అన్నాబావే చేసిన 'బాలే' నృత్యము పట్ల ఆకర్షితురాలై, ప్రముఖ గురువు కిళియోనర్టిని వద్ద బాలే నృత్యం నేర్చుకున్నారు. ఆ తర్వాత అన్నాబావ్లే సలహా మేరకు భరతనాట్యంలో నేర్చుకోవాలనుకున్నారు. మహిళలు నాట్యాన్ని అభ్యసించడం అవమానంగా భావించే ఆ రోజుల్లో అనేక విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ పట్టుదలతో, ప్రముఖ గురువు మీనాక్షి సుందరం పిళ్ళై వద్ద భరతనాట్యంలో ప్రావీణ్యం సంపాదించారు.

థియాసాఫికల్ సొసైటి వజ్రోత్సవాలలో ఇరవై వేల మంది ప్రేక్షకుల ఎదుట రుక్మిణీదేవి తన తొలి నాట్య ప్రదర్శన ఇచ్చారు. ప్రముఖులరామసామి అయ్యర్, శివసామి అయ్యర్ మొదలైన వారి సమక్షంలో జరిగిన ఈ ప్రదర్శన ప్రముఖ ఐర్లాండ్ కవి జేమ్స్ కజిన్స్ ను బాగా ఆకర్షించింది. ఆమె ప్రతిభను పది మందికి అందేలా..నాట్య పాఠశాల ఆరంభించమని ఆయన కోరారు. అలా "ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్" అనే పేరుతో నాట్యపాఠశాల ప్రారంభమై.. ఆ తర్వాతి కాలంలో అదే కళాక్షేత్రంగా రూపుదిద్దుకుంది. ఇక్కడ నాట్యం, సంగీతం నేర్పుతారు. అందమైన తోటలు, తామర కొలనులు, సంప్రదాయమైన కట్టడాలతో నాట్య దేవాలయంగా రూపుదిద్దుకుంది.

1952లో రుక్మిణీదేవి రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా పనిచేసిన రుక్మిణీదేవి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం "పద్మభూషణ్"తోను, శాంతినికేతన్ "దేశికోత్తమ" బిరుదుతోను ఆమెను సత్కరించాయి. 1977లో మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్నపుడు, రుక్మిణీదేవిని భారత రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి పరిశీలించారు. అయితే రాష్ట్రపతి పదవికన్నా.. నాట్యకళాకారిణిగానే ఉండేందుకు తాను ఇష్టపడతానని ఆమె స్పష్టం చేస్తూ.. ప్రధాని ప్రతిపాదనను తిరస్కరించారు.

# కాంతి తగ్గడానికి కారణాలివిగో!



వాతావరణంలో మార్పులు వస్తున్న కొద్దీ చర్మం కూడా రంగులు మారుతుంది. అప్పటిదాకా నిగారించిన ముఖం కాంతిహీనంగా మారిపోతుంది. అయితే కేవలం వాతావరణాన్ని నిందించుకుంటూ కూర్చుంటే లాభం లేదు. ఎందుకంటే వాతావరణం ఒక్కటే కాదు. ముఖం కాంతిహీనంగా మారడానికి కారణాలు చాలా ఉన్నాయి. అవేంటో మీరే చదవండి.

- రోజుకు రెండు సార్లు ముఖం కడుక్కుంటున్నాం కదా... ఇంకా ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఏముంది అనుకుంటారు చాలా మంది. కానీ చర్మానికి ఎక్స్‌ఫోలియేషన్ తప్పనిసరి. ఎందుకంటే పొడిబారిన చర్మం మరింత డల్‌గా కనిపిస్తుంది. అందుకే ఎక్స్‌ఫోలియేట్ చేస్తే డల్‌నెస్ మాయమవుతుంది. అందుఉ చేయాల్సిందలా ముఖానికి మృదువైన మసాజ్.
- ముఖాన్ని కడిగినప్పుడు చర్మంపై ఉన్న సహజమైన నూనెలు పోతాయి. తిరిగి మాయిశ్చరైజర్ పెట్టడం వల్ల చర్మానికి కావాల్సిన సహజమైన కొవ్వు అందుతుంది. చర్మకణాల మధ్య ఉన్న ఖాళీని అది పూరిస్తుంది. మృదువుగా చేస్తుంది. దీనివల్ల చర్మం తిరిగి నీటిని పొందుతుంది.
- ముఖం డల్‌గా మారడానికి మరో కారణం డీహైడ్రేషన్. అయితే నీళ్లు తాగేస్తే డీహైడ్రేషన్ పోతుంది కదా అనుకుంటారు చాలా మంది. కానీ అది దీర్ఘకాలిక సమస్య. శరీరానికి తరచూ నీటిని అందిస్తుండాలి. ముఖంపై ముడతలు రాకుండా ఉండాలంటే నీటిని బాగా తాగాలి.
- ఇవన్నీ చేస్తున్నా ముఖం నీరసంగా కనిపిస్తున్నదా? అయితే మీ శరీరం కంటే.. మీ మెదడు ప్రభావం చూపిస్తుందని అర్థం. మానసిక ఒత్తిడి చర్మంపైన చాలా ప్రభావం చూపిస్తుంది. అది కార్టిజాల్ ఉత్పత్తిని పెంతుంది. ఇది చర్మానికి జరిగే రక్త ప్రసరణ మీద ప్రభావం చూపుతుంది. పని ఒత్తిడైనా కావచ్చు... బంధాల్లో వచ్చే ఇబ్బందులు కావచ్చు.. ఎప్పటికప్పుడు క్లియర్ చేసేకుంటేనే మీ చర్మానికి మంచిది.
- నిద్ర.. శరీరం తిరిగి కొత్తశక్తిని సంతరించుకునే సమయం. పడుకున్నప్పుడే మాత్రమే చర్మకణాలు రిపేర్ చేసుకుంటాయి, కొత్తవి ఉత్పత్తి అవుతాయి. నిద్ర సమయం తగ్గినా, నిద్రకు అంతరాయ కలిగినా చర్మకణాలు రిగ్గా పనిచేయలేవు. ఫలితంగా కళ్లచుట్టూ నల్లని వలయాలు, చర్మం పొడిబారడం, తేమ తగ్గిపోవడం జరుగుతుంది. కాబట్టి సరిపడ నిద్రపోండి.

**ఇట్లు చేద్దాం**

**పుదీనా ఆకులు, తులసి ఆకులను తినడం మంచిది. ఎందుకంటే ఈ ఆకులు ఆయుర్వేద గుణాలను కలిగి ఉండటం వల్ల యాంటీ ఆక్సిడెంట్‌లా పని చేస్తాయి.**

**తనూజ, ధనుష్‌లకు ఒకేతే పాప. పేరు ప్రియ. పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నది. బాగా చదువుతున్నది. డాక్టర్ కావాలన్నది ఆమె కల. అందుకే ఇంటర్‌లో బైపీసీ గ్రూప్ తీసుకొని మెడిసిన్ చేయాలనుకుంటున్నది. కానీ 'తమ గారాల కూతురి కలను తీర్చడం ఎలా?' అన్నది. ఆ తల్లిదండ్రుల మనసును తొలిచేస్తున్న ప్రశ్న.**

# పిల్లల చదువు సజావుగా సాగాలంటే...

పాప పుట్టినప్పటి నుంచి తనూజ చెబుతూనే ఉంది. 'ప్రియ పై చదువుల కోసం నెలనెలా ఎంతో కొంత పొదుపు చేద్దాం' అని. కానీ ఆమె మాటలను ధనుష్ అప్పట్లో పట్టించుకోలేదు. మరో రెండేండ్లల్లో పాపను మెడిసన్‌లో చేర్పించాలి. సమయం చాలా తక్కువగా ఉంది. బిడ్డ కలను ఎలా సాకారం చేయాలో అర్థం లోలోపలే మదన పడుతున్నాడు. భార్య చెప్పినప్పుడు తన మాటకు విలువిచ్చి పొదుపు చేసినట్లయితే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదని తనని తానే మనసులో తిట్టుకుంటున్నాడు.

ఇది ఒక్క తనూజ సమస్య మాత్రమే కాదు. ప్రస్తుతం విద్య అంతా ప్రయివేటు రంగం చేతుల్లోకి వెళ్ళిపోయింది. దాంతో చదువును కొనాల్సి వస్తోంది. భవిష్యత్తులో పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే నెలవారీ సంపాదన సరిపోదు. అందుకే ప్రతి తల్లిదండ్రులు ముందు నుంచే ప్రణాళిక వేసుకోవడం తప్పనిసరి. అందులోనూ ఉన్నత విద్య కోసం అయ్యే ఖర్చు పోనూ పోనూ ఇంకా పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి ఈ విధంగా చేసి చూడండి.

పిల్లలు పుట్టగానే పొదుపు మొదలుపెట్టాలి.



అంతే కాకుండా ఒక కాలపరిమితి పెట్టుకుని పెట్టుబడులు పెడుతూ ఉండాలి. ఉదాహరణకు పిల్లల ఉన్నత చదువుని లక్ష్యంగా ఉంచుకుని నెలకు రూ.5000 మొదలుకొని మీ స్తోమత, సామర్థ్యానికి తగిన విధంగా మ్యూచువల్ ఫండ్ సిప్ చేయవచ్చు.

సిప్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ మూలంగా ఒక క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి అలవాటు అవుతుంది. ఇది మీ ఆర్థిక లక్ష్యాలను దీర్ఘకాలంలో చేరుకునేందుకు తోడ్పడుతుంది. ఇది ఎలా జరుగుతుందో చూద్దాం...

మీ పిల్లల వయసు 3-4 ఏండ్లు మధ్య ఉందనుకుందాం. అంటే వారి ఉన్నత చదువు కోసం మరో 10 నుంచి 15 ఏండ్ల సమయం ఉంది. రూ.5000 ప్రతి నెలా సిప్ మార్గంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెడుతూ పోతే అప్పటికి మీకు పిల్లల చదువుకు కావాల్సిన డబ్బు సమకూరుతుంది.

అంతే కాకుండా డబ్బు ఇంతలింతలవడం మీరు గమనిస్తారు.

చక్రవడ్డీ ప్రయోజనాలు పొందుతారు. ఉదాహరణకు రూ.12 వేల మొదటిసారి పెట్టుబడి 20 ఏండ్లకు 13 శాతం రాబడి రేటుతో చివరకు రూ.57,27,596 అవుతుంది. ఇది మీ అసలు రూ.45,27,596 కంటే చాలా ఎక్కువే. మీ పెట్టుబడితో పోలిస్తే రాబడి బాగానే ఉండి, పిల్లల ఉన్నత చదువుకు అవసరమైనప్పుడు చేతికి డబ్బు అందుతుంది. కాబట్టి పిల్లల చదువుకు ఎక్కువగా అవసరమయ్యే డబ్బును సిప్ రూపంలో పొదుపు చేస్తూ, పెట్టుబడి పెడుతూ వెళ్లండి. ద్రవ్యోల్బణానికి మించిన రాబడుల ద్వారా దీర్ఘకాలంలో సమకూరే డబ్బుతో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పిల్లలను చదివించవచ్చు.

## వాళ్లేమైనా దేవుళ్లా ?

- రాజకీయ నాయకులూ చట్ట పరిధిలోనే..
- బాంబే హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

**ముంబయి :** చట్టం ముందు అందరూ సమానులేనని, రాజకీయ నాయకులూ దీనికి లోబడి ఉండాల్సిందేనని బాంబే హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. రాజకీయ నాయకులేం దేవుళ్లు కాదని న్యాయమూర్తులు ధర్మాధికారి, భారతి డంగ్రేలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం స్పష్టం చేసింది. ముంబయిలో పబ్లిక్ ల్యాండ్‌ను ఆక్రమించుకున్న ఇద్దరు కార్పొరేటర్లపై కేసులు నమోదు చేయాలని బెంచ్ ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేసింది. ముంబయికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు మహత్రే, పాటిల్‌లు మడ అడవులను ధ్వంసం చేసి వారికి నివాసాలు, కార్యాలయాలు నిర్మించుకున్నారంటూ సామాజిక కార్యకర్త భరత్ మోకల్ అనే వ్యక్తి బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కార్పొరేటర్ల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ నాయకులైనందునే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టగా.. కార్పొరేటర్ల భూ ఆక్రమణ కేసుకు సంబంధించి పర్యావరణ పరిరక్షణ చట్టంలోని సంబంధిత అంశాలను పరిశీలిస్తున్నామని పోలీసులు వాదించడం న్యాయమూర్తులకు మరింత కోపం తెప్పించింది. నేరం చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు భయపడుతున్నారని మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులను ప్రశ్నించింది. 'కార్పొరేటర్ల విషయంలో కఠినంగా వ్యవహరించండి, ఎవరికీ బెదరాల్సిన పనిలేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## మోడీ పాదాభివందనం చేసిన తల్లి ఇకలేదు...

**రాయ్‌పూర్:** 'స్వచ్ఛ భారత్' ప్రచారానికి నడుం బిగించి.. ప్రధాని మోడీ చేత 'క్లీన్లీనెస్ మెసెంజర్'గా గౌరవం అందుకున్న శతాధిక (106) వృద్ధురాలు కున్వర్ బాయ్ సుదీర్ఘ అస్వస్థతతో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. కున్వర్ బాయ్ మృతిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ ట్విట్టర్‌లో తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## సాగునీటి కోసం రైతుల అర్ధనగ్న ప్రదర్శన

**అవనిగడ్డ :** దివిసీమ ప్రాంతంలో మొక్కజొన్న పంట కాపాడుకునేందుకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా అవనిగడ్డలో అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరికి నిరసనగా రైతు ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. తొలుత రైతులు రాజీవ్ సెంటరు నుంచి కోర్టు సెంటరు వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఎడ్లబండ్లతో నిరసన తెలిపారు. అనంతరం రాజీవ్ సెంటరులో ధర్నా చేశారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు అడ్డుకోవడంతో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల బసవయ్య మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకే రైతులు దివిసీమ ప్రాంతంలో మొక్కజొన్న పంటను సాగు చేశారని, ఇప్పుడు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని చెప్పడం శోచనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పందించి నీరు విడుదల చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతును అడ్డుకుంటున్న తోటి రైతులు

## 4 జీబీ అంతంతే

**ముంబయి:** ఇప్పుడు సగటు భారత వినియోగదారుకు రోజుకు ఒక జీబీ డేటా నిత్యావసరంగా మారిపోయింది. కానీ 4జీ ఎలటీఈ స్పీడ్ విషయానికొస్తే ఆ కథే వేరన్నట్టుగా మారిపోతోంది. ఊక్లా వంటి థర్డ్ పార్టీ సంస్థలు అందిస్తున్న ఇంటర్నెట్ స్పీడ్ టెస్ట్ పరీక్షల వివరాల మేరకు భారత్‌లో 4జీ ఇంటర్నెట్ స్పీడు ప్రపంచ ప్రమాణాలను అందుకోవాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి వుంది. అయితే గత ఏడాది కన్నా ఈ ఏడాది మెరుగన్న రీతిలో ఇంట ర్నెట్ స్పీడ్‌లో రోజురోజుకూ మార్పులు సంతరించు కుంటున్నాయి. భారత్‌లో మొబైల్ బ్రాండ్‌బాండ్ స్పీడ్ ఇప్పుడిప్పుడే ప్రపంచ ప్రమాణాలను అందు కుంటోందని ఓక్లా చీఫ్ ఆపరేటింగ్ అధికారి జామీ స్టీవెన్ చెబుతున్నారు. ఇంటర్నెట్ స్పీడ్‌లో భారత్ టాప్ 100 జాబితాలోకి ఇంకా చేరలేదని, ఈ జాబితాలో భారత్ 112వ స్థానంలో వుందని ఆయన వివరించారు. ఇప్పుడు భారత్‌లో సగటు వినియోగ దారుడు అందుకుంటున్న మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ కేవలం 9.14 ఎంబీపీఎస్ మాత్రమేనంటున్నారు. దీనిని కూడా వీడియో చిత్రాలను తిలకించేందుకు ఇతర కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని ఆయన వివరించారు.

అయితే మొబైల్ ఇంటర్నెట్ విషయంలో భారత్ ఒక క్లిష్టమైన మార్కెట్ అని, ఇక్కడ మౌలిక వసతుల నుండి చివరి వినియోగదారుడి వరకూ ప్రతి అంశమూ సవాలుతో కూడుకున్నదేనని ఆయన అన్నారు. భారత్ వంటి విస్తృత జనసాంద్రత వున్న దేశంలో ప్రజలకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందచేయటం సర్వీస్ ప్రొవైడర్లకు సవాలు వంటిదేనన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యధిక ప్రజాదరణ పొందు తున్న 4జి ఇంటర్నెట్ ఈ సమస్యను మరింత జటిలం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. 2017 నుండి దేశవ్యాప్తంగా 4జీ ఇంటర్నెట్ వినియోగం విస్తృత స్థాయిలో పెరిగినప్పటికీ ఇంట ర్నెట్ స్పీడ్‌పై ఇప్పటికీ అనుమానాలు వ్యక్తమవు తూనే వున్నాయి. ఇంటర్నెట్ స్పీడ్‌ను అంచనా వేసేందుకు ట్రాయ్ విడుదల చేసిన మైస్పీడ్ యాప్‌లో తరచు రిలయన్స్ జియో అగ్రస్థానంలో కన్పిస్తూంటుంది. కాగా ఊక్లా సంస్థ పరీక్షల్లో మాత్రం ఎయిర్‌టెల్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ స్పీడ్ టెస్ట్ అంచనా వేసే విధానం, అంకెల మార్పు వంటి వివిధ కారణాలతో ఈ వ్యత్యాసం కన్పిస్తుం టుందని ఊక్లా సీఓఓ చెబుతున్నారు. కానీ ఇంట ర్నెట్ స్పీడ్‌ను అంచనా వేసేందుకు తాము అనుస రించే పద్ధతి విభిన్నంగా వుంటుందని ఆయన చెబుతున్నారు. తాము అనుసరించే ఈ పద్ధతిని ట్రాయ్‌కి కూడా వివరించామని ఆయన చెప్పారు.

## 2002 గ్రూప్-2 ఉద్యమకారులపై కేసు కొట్టివేత

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2తోపాటు ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతూ ఉద్యమించిన 34 మందిపై నమోదు చేసిన కేసును 17వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2002లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలని యువజన సంఘాలు ఏపీపీఎస్సీని ముట్టడించాయి. ఆ సమయంలో యువజన సంఘాల నాయకులపై బేగంబజార్ పోలీసులు 147,148,341, 343,353 సెక్షన్ల కింద అక్రమంగా కేసులు నమోదు చేశారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన పివి శ్రీనివాస్ (ప్రస్తుతం సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు), నాయకులు ఎం చంద్రమోహన్, జెకె శ్రీనివాస్, విజయ్, మల్లయ్య, రామకృష్ణతోపాటు పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన నున్నా నాగేశ్వరరావు (సీపీఐఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి), నాయకులు కురుమూర్తి (ప్రస్తుతం సీపీఐఎం సభ్యులు), ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన బాలమల్లేష్ (ప్రస్తుతం సీపీఐ నాయకులు) తదితరులపై నమోదైన కేసును నిరూపించడంలో పోలీసులు విఫలం కావడంతో కోర్టు కొట్టివేసింది.

## మహిళా అధికారిపై లైంగికవేధింపులు

- బీహార్‌లో దారుణం

**పాట్నా:** బీహార్‌లోని యునైటెడ్ నేషన్స్ ఫండ్ ఫర్ పాపులేషన్ అథారిటీ (యుఎన్ఎఫ్‌పీఏ)కార్యాలయంలో పనిచేసిన మహిళా అధికారిపై.. లైంగికవేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణతో ఇంగ్లాండ్‌కు చెందిన అధికారిపై పాట్నా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన ఒక మహిళా అధికారి యుఎన్ఎఫ్‌పీఏలో గత యేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు పనిచేసింది. అక్కడే పనిచేస్తున్న సహోద్యోగి అయిన యుఎన్ ప్రతినిధి ఒకతను ఆమెను లైంగికంగా వేధించాడు. దీంతో ఆమె పాట్నా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ఆర్టీసీ కార్మికుల అభివృద్ధికి కృషి

- లాభాల్లో 27 డిపోలు: మంత్రి మహేందర్‌రెడ్డి

**నవతెలంగాణ-యాదగిరిగుట్ట**



ఆర్టీసీ కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా శాఖా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన యాద్రాద్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో 95 డిపోలు ఉంటే 27 మాత్రమే లాభాల్లో నడుస్తున్నాయని అన్నారు. నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్మికులు 43శాతం ఇంక్రిమెంట్ అడిగితే 44శాతం ఇచ్చిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. యాదగిరి గుట్టలో కొత్తగా 15 ఎకరాల్లో బస్టాండ్ నిర్మించనున్నట్టు స్పష్టం చేశారు. యాదాద్రికి ప్రస్తుతం ఎనిమిది మినీ బస్సులు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సువర్ణారెడ్డి, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కాలె సుమలత, ఎంపీపీ గడ్డమీది స్వప్నరవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ కర్రె కమలమ్మవెంకటయ్య, డిపో మేనేజర్ రఘు పాల్గొన్నారు.

## 'కాళేశ్వరం' మహాద్భుతం

- శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్



**నవతెలంగాణ-మహదేవపూర్**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మహాద్భుతమని, బంగారు తెలంగాణకు తొలి మెట్టు అని శాసనమండలి ఛైర్మెన్ స్వామిగౌడ్ అన్నారు. జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీని శుక్రవారం 28 మంది శాసన మండలి సభ్యులు, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బృందానికి ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం స్వామిగౌడ్ మాట్లాడుతూ..చైనాలో మాదిరిగా ఆధునిక యంత్రాలతో ఇంజినీర్లు పనులు చేపట్టడం గొప్ప విషయమన్నారు. శాసన మండలిలో ఇక్కడ జరుగుతున్న పనుల గురించి వివరిస్తున్నా స్వయంగా వెళ్లి తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్, భారీ నీటి పారుదల శాఖామంత్రి హరీశ్‌రావుకు తామంతా ప్రాజెక్టును సందర్శిస్తామని తెలపామని, వారి అనుమతితోనే శాసన మండలి సభ్యులమంతా పార్టీలకతీతంగా పనులను సందర్శించామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఏడాది పొడవునా ప్రాజెక్టులో నీటి నిల్వ ఉంటుందని వివరించారు. అనంతరం కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించి కాళేశ్వరం హరిత హోటల్‌లో బస చేశారు.

## ఉర్దూ మీడియం పుస్తకాల విడుదల

**హైదరాబాద్:** బీఏ రెండో సంవత్సరం హిస్టరీ సబ్జెక్టు ఉర్దూ మీడియం పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి విడుదల చేశారు. నాంపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ సమీనా బషీర్ ఈ పుస్తకాలను రాశారు. గత ఏడాది బీఏ హిస్టరీ మొదటి సంవత్సరం పుస్తకాలను విడుదల చేయగా, ఈ సంవత్సరం రెండో సంవత్సరం బీఏ హిస్టరీ పుస్తకాలను విడుదల చేశారు.

## మత్స్య సొసైటీ ఖాతాలో డబ్బులు జమచేయాలి

- మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ట




**నవ తెలంగాణ-సూర్యాపేట**

ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలను దళారుల ద్వారా పంపిణీ చేయకుండా అందుకు సంబంధించిన డబ్బులు మత్స్య సొసైటీల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లల బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేటలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేండ్లుగా ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నా మత్స్యకార్మికులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదని అన్నారు. ప్రధానంగా చేప పిల్లలను దళారులు, టెండర్ల ద్వారా పంపిణీ చేస్తుండటంతో క్వాలిటీ, క్వాంటిటీలో పెద్దమొత్తంలో మోసం జరిగి మత్స్యకారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెల 25 నుంచి మార్చి 4వ తేదీ వరకు చేప పిల్లల పంపిణీలో జరిగిన అవినీతి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సర్వేలు, అధ్యయనం చేయాలని, మార్చి 5 నుంచి 10 వరకు రాష్ట్ర స్థాయిలో మత్స్య సంఘాలు, సామాజిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, మార్చి 12న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్, మత్స్యశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీలో ఏకగ్రీవంగా తీర్మానించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోటక కోమరస్వామి, రాష్ట్ర కార్యదర్శి మేకనబోయిన శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం శ్రీను, కార్యదర్శులు గుండాలమల్ల నర్సింహులు, కర్రెల్లి లలిత, విజయ్‌కుమార్, మామిడి నాగసైదులు పాల్గొన్నారు.

# సూతిక్ ఫార్మాలో భారీ అగ్నిప్రమాదం

## ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం

- రసాయనాల ధాటికి ఉక్కిరిబిక్కిరైన కార్మికులు
- మంటలార్పిన 9 అగ్నిమాపక శకటాలు

**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గంపల బస్తీలోని సూతిక్ ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రసాయనాల ధాటికి కార్మికులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

పోలీసుల, స్థానికుల వివరాల ప్రకారం ఒంగోలుకు చెందిన ప్రసాద్ జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గంపల బస్తీలో సూతిక్ ఫార్మా కంపెనీ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే కార్మికులు తమ పనిలో నిమగ్నమయ్యారు. శుక్రవారం రాత్రి షిఫ్టు వారు వెళ్లగా..ఉదయం షిఫ్టువారు 20 మంది పనిలోకి వచ్చారు. సరిగ్గా ఉదయం ఆరు గంటలకు కంపెనీలోని రియాక్టర్ అకస్మాత్తుగా పేలి మంటలు లేచాయి. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక, పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలినికి చేరుకున్న వారు తొమ్మిది అగ్నిమాపక వాహనాలతో గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే మంటల్లో చిక్కుకుని తీవ్రగాయాపాలైన బి.శ్రీనివాస్, సింహాచలం, కుమారస్వామి, సంజీత్, హరివన్, నరహరి, శ్యామ్‌లను 108 వాహనంలో కొంపల్లిలోని హర్షఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అందులో



బి.శ్రీనివాస్, సింహాచలం, కుమారస్వామి పరిస్థితి విషమంగా ఉంది. వారిని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎంత ఆస్తినష్టం జరిగిందనే విషయం తెలియాల్సి ఉంది. హర్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను కలెక్టర్ ఎంవీ రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, వెంట పరిశ్రమల తనిఖీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీసీపీ సాయిశేఖర్, డీఎంహెచ్ఓ దాస్య నాయక్, డీఎఫ్ఓ హరినాథ్‌రెడ్డి, ఆర్‌డీఓ మధుసూదన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భూపాల్, బాలానగర్ ఏసీపీ గోవర్ధన్, సీఐలు శంకర్‌రెడ్డి, ఉప కమిషనర్ సుదాంశ్, సీపీఐ(ఎం) నాయకులు కె.లక్ష్మణ్, లింగస్వామి, సీపీఐ నాయకులు పరామర్శించారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందిస్తామని కలెక్టర్ చెప్పారు.

**పరిశ్రమలను ఎత్తేయాలని స్థానికుల ఆందోళన**

గంపలబస్తీలోని పరిశ్రమలను ఎత్తేయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. మంత్రి కేటీఆర్ ఈప్రాంతాన్ని సందర్శించాలని, ఇక్కడ నుంచి కంపెనీలను ఎత్తేయించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న స్థానికులకు పోలీసులు నచ్చజెప్పి పంపించేశారు.

**నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలు పాటించనిచో కఠిన చర్యలు తీసుకుంటాం. పీసీబీ అధికారులు, అగ్నిమాపక, పరిశ్రమల తనిఖీ అధికారులు పరిశ్రమలను పరిశీలించాలి. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించి వారి కుటుంబాలను అన్నివిధాలా అదుకుంటాం.

# రైతు కడుపు మండింది

## మార్కెట్‌లో వేరుశనగ ధర తెగ్గోయటంతో ఆగ్రహం

- మార్కెట్ కార్యాలయంపై దాడి, ఫర్నీచర్ ధ్వంసం
- రెండు గంటలపాటు రాస్తారోకో

**నవతెలంగాణ-మహబూబ్‌నగర్**

అన్నదాతకు కడుపు మండింది. ఆరుగాలం కష్టపడి పండించిన వేరుశనగ పంటను అమ్ముకుందామని మార్కెట్‌కు వెళితే అక్కడ దళారులంతా కుమ్మక్కయ్యారు. నిన్నటి దాకా ఆరు వేల రూపాయల వరకు పలికిన వేరుశనగ ధరను ఒక్కసారిగా తెగ్గోసి రూ. 3,500-4,000లకు అడగటంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. మార్కెట్ కార్యాలయంపై దాడిచేశారు. రెండుగంటలపాటు రాస్తారోకో చేశారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం భారీ మొత్తంలో రైతులు వేరుశనగకాయలను తీసుకొచ్చారు. దీంతో కొనుగోలు వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా క్వింటాల్‌కు రూ. 2 వేల ధర తగ్గించారు. 'క్వింటా రూ.3500 నుంచి 4000 ఇస్తారా? ఇది అన్యాయం. ఒక్కరోజులో ధర ఇంత ధర తగ్గిస్తారా?' అని రైతులు ప్రశ్నించారు. 'ఇష్టముంటే అమ్ముకోండి. లేకుంటే తీసుకుపోండి' అని వ్యాపారులు రైతులకు మొహం మీదనే చెప్పారు. ఓ వైపు అధికారులు



గమ్మునుగామ ఉండటం, మరోవైపు ఆరుగాలం కష్టపడ్డ శ్రమను దళారులు దోచుకుంటుంటే రైతులు తట్టుకోలేకపోయారు. తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. మార్కెట్ కార్యాలయంపై దాడి చేశారు. ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అనంతరం బోయపల్లి రోడ్డుపై ర్యాలీగా వెళ్లి రెండు గంటలపాటు రాస్తారోకో చేశారు. జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ జోక్యంతో కొనుగోళ్లను ఆపేశారు. మార్కెట్‌యార్డు సమీపంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగలు కొనుగోలు కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు.

## హైదరాబాద్‌లో బయోకాన్ రీసెర్చ్ సెంటర్

- బయోకాన్ ఎండి కిరణ్ ముజుందర్‌తో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్ :** బయోటెక్నాలజీ దిగ్గజం బయోటెక్ హైదరాబాద్‌లో నూతన యూనిట్ ప్రారంభించనుంది. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న యూనిట్‌ను మరింత విస్తరించనుంది. శనివారం హెచ్ఐసిసిలో మంత్రి కేటీఆర్ బయోకాన్ ఎండి కిరణ్ మజుందార్‌షాతో సమావేశం అయ్యారు. జినోమ్ వ్యాలీలో బయోకాన్ నూతన అర్ అండ్ డి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు అమె మంత్రికి తెలిపారు. తమ అనుబంద కంపెనీ అయిన సింజెన్ ద్వారా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా వెయ్యి హైస్కిల్ ఉద్యోగాలు వస్తాయన్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని అమె మంత్రికి తెలిపారు.

## చేనేత కార్మికుల రుణమాఫీకి విధివిధానాలు ఖరారు

**హైదరాబాద్:** చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి సంబంధించిన విధివిధానాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేస్తూ పరిశ్రమల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి నెలాఖరు వరకు చేనేత కోసం తీసుకున్న లక్ష రూపాయల వరకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. దీనికి అవసరమయ్యే వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లించనున్నట్టు వెల్లడించింది.

## రైతులే కాదు.. ఎమ్మెల్యేలూ చస్తున్నారు

**సాగర్:** రైతు సమస్యలపై బాధ్యత గల మంత్రులు నోరుజారితే ప్రభుత్వాలే పతనమైన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయినా ఇలాంటి రైతు వ్యతిరేక వ్యాఖ్యలు మాత్రం ఆగటంలేదు. రైతుల రుణాలు మాఫీ చేయాలంటూ ఆందోళనలు జరిగిన రాష్ట్రాల్లో బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ కూడా ఉన్నది. తాజాగా ఆ రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గోపాల భార్గవ కూడా రైతుల మరణాలను లైట్ తీసుకున్నారు.

ఎమ్మెల్యేలూ చనిపోతున్నారని, ఎవరూ ఎల్లకాలం బతికుండరని వ్యాఖ్యానించారు. 'ఎమ్మెల్యేలూ చనిపోతున్నారు. నష్టాలు వచ్చినప్పుడు వ్యాపారులూ చనిపోతున్నారు. పరీక్షలో ఫెయిలైన విద్యార్థులూ ప్రాణాలు తీసుకుంటున్నారు. గత నాలుగేళ్లలో పదిమంది ఎమ్మెల్యేలు చనిపోయారు. చావులను ఆపగలమా? ఎమ్మెల్యేలు మరణాలకు అతీతులా?' అని మంత్రి భార్గవ ప్రశ్నించారు.


# కేయూలో ఉద్రిక్తత

## ముదురుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్ల వివాదం

- విద్యార్థుల మధ్య ఘర్షణ...పలువురికి గాయాలు
- వీసీ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా
- వీసీతో ఎమ్మెల్యేలు దాస్యం, ఆరూరి చర్చలు
- ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని తొలగిస్తూ ప్రకటన

**నవతెలంగాణ-కేయూక్యాంపస్**

వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో శుక్రవారం కేయూ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ ఉద్రిక్తతకు దారితీసింది. కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు బహిష్కరిస్తున్న నేపథ్యంలో రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి విద్యార్థులు బాహాబాహికి దిగారు. ఈ దాడుల్లో కేయూ జేఏసీలో భాగమైన ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, అధికార పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం నేత రాజగోపాల్‌కు తీవ్రగాయాలు కాగా, పీడీఎస్‌యూ నాయకులు దుర్గం సారయ్య, బీఎస్ఎఫ్ నేత మనోహర్, మధుకర్ తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిని నిరసిస్తూ కేయూ పాలక భవనం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని విధుల నుంచి తొలిస్తున్నట్టు వీసీ సాయన్న ప్రకటించడంతో ఆందోళన విరమించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా విశ్వవిద్యాలయ అధికారులు పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినందుకు నిరసనగా రెండు రోజుల పాటు వరుసగా బంద్‌కు పిలుపునిచ్చారు. గురువారం బంద్ నిర్వహించిన కేయూ జేఏసీ నాయకులు శుక్రవారం తరగతులు బహిష్కరించారు. కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు బహిష్కరిస్తున్న క్రమంలో వివాదం చెలరేగింది. దీంతో ఇరుగ్రూపుల మధ్య జరిగిన పరస్పర దాడుల్లో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర



గాయాలపాలైన రాజగోపాల్, దుర్గం సారయ్య, మనోహర్‌లను నగరంలోని శరణ్య ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

**పాలక భవనం ఎదుట విద్యార్థుల బైఠాయింపు**

దాడికి నిరసనగా కేయూ జేఏసీ ఆధ్వర్యంలో కేయూ పాలకభవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, వీసీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలకభవనంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. విద్యార్థులకు పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో కార్యాలయ అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, పీడీఎస్‌యూ, టీఆర్ఎస్‌వీ నాయకులు వీరభద్రం, బద్రి, విజయ్‌ఖన్నా, ప్రశాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామికంగా ఆందోళన చేస్తుంటే గిట్టని కేయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మల్లారెడ్డి ప్రయివేటు వ్యక్తులతో దాడి చేయించారని విమర్శించారు. వెంటనే ప్రిన్సిపాల్ మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ విద్యార్థుల సంఘాల నాయకులను సముదా యించి వీసీ ఆర్ సాయన్నతో చర్చలు జరిపారు. దాడి ఘటనకు బాధ్యులను చేస్తూ ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్టు రిజిస్ట్రార్ పురు షోత్తం ప్రకటించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ధర్నా అనంతరం కేయూ పీఎస్‌లో దాడి ఘటనపై కేయూ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు.

# ఏసీబీ కస్టడీలో కట్టా

- ఆచితూచి జవాబులు ఇస్తున్న పురుషోత్తంరెడ్డి

**నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి**

అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించిన హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి ని శుక్రవారం ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న కట్టాను కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు ఆరు రోజుల పాటు ఏసీబీ విచారించనుంది ఇప్పటి వరకు కట్టా అక్రమాస్తులు రూ. 25 కోట్లకు పైనే అని తేల్చిన ఏసీబీ అధికారులు మరో వైపు ఇంకా వెలుగు చూడాల్సిన ఆస్తుల గురించి కట్టాను విచారిస్తున్నారు.

ముఖ్యంగా అతనికి కున్న అసలు ఆస్తి ఎంత, ఎంత మంది బినామీలు ఉన్నారు, ఇందులో ప్రధాన బినామీలైన బావ మరిది శ్రీనివాస్‌రెడ్డి, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు యాదవరెడ్డి, నిషాంత్‌రెడ్డిల వద్ద ఎన్ని కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టాడు మొదలైన కోణాల్లో కట్టాను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారని తెలిసింది. ఈ కేసును ఏసీబీ డీజీ జె.పూర్ణచంద్రరావు స్వీయ పర్యవేక్షణలో ఏసీబీకి చెందిన ప్రత్యేక టీమ్ విచారిస్తున్నది. కాగా తొలి రోజు కట్టా నుంచి ఆశించిన సమాచారాన్ని దర్యాప్తు అధికారులు రాబట్ట లేక పోయినట్టు తెలిసింది తమ న్యాయవాదుల సమక్షంలో కట్టా విచారణ సాగుతున్నది. దీంతో తమ న్యాయవాదులు ఏ సమాచారం ఇవ్వమంటే అదే సమాచారాన్ని కట్టా ఇస్తు ఇతర ప్రశ్నలకు మౌనంగా ఉంటున్నట్టు తెలుస్తోంది.

ముఖ్యంగా దాదాపు వారం రోజుల పాటు ఏసీబీకి చిక్కకుండా ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లావు , అందుకు ఎవరు ప్రోద్బలం చేశారనే వివరాలను కట్టా నుంచి రాబట్టడానికి ఏసీబీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఇక కట్టా మరో బినామీ అయిన అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని ఐదు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని తాజాగా ఏసీబీ కోర్టులో దర్యాప్తు అధికారులు పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత కస్టడీపై తన నిర్ణయాన్ని న్యాయమూర్తి వాయిదా వేశారు.




# అమెరికాలో ఉపాధ్యాయుల నిరసనలు

- జీతాలు పెంచాలంటూ డిమాండ్

**వాషింగ్టన్ :** పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు ఆందోళన బాటపట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు మిన్నంటినప్పటికీ పాఠశాలల యాజమాన్యాలు జీతాలు పెంచకపోవడం శోచనీయమంటూ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్స్ వెంటనే జీతాలను పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వెస్ట్ వర్జీనియాలోని వీధుల్లోకి భారీగా చేరుకుని నిరసన తెలిపారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని పాఠశాల యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు తీసిన భారీ ర్యాలీకి వెస్ట్ వర్జీనియా ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నేతృత్వం వహించింది. ఈ ర్యాలీలో మూడు లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్టు స్థానిక మీడియా ప్రకటించింది. ఉపాధ్యాయుల నిరసన నేపథ్యంలో స్థానిక పాఠశాలలు మూతపడ్డాయి. వర్జీనియాలో 30 ఏండ్ల తర్వాత ఉపాధ్యాయులు ఆందోళనబాట పట్టడం గమనార్హం.

## అణు ఒప్పందాన్ని ఉల్లంఘించిన అమెరికా

- ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి

**టెహ్రాన్ :** అణు ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తెలిపారు. 2015లో అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, చైనా, జర్మనీ దేశాలకు ఇరాన్‌కు మధ్య అణు ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందాన్ని అమెరికా తుంగలో తొక్కిందని అబ్బాస్ అన్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకొని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అతిపెద్ద తప్పుచేశారని, ఈ ఒప్పందాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పలు కార్యక్రమాల్లో ట్రంప్ పేర్కొన్నారు. అంతేగాకుండా, ఇతర దేశాలను సైతం ఈ ఒప్పందం నుంచి వైదొలిగేలా ఒత్తిడి పెంచుతున్నారు. జాయింట్ కాంప్రెహెన్సీవ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీఓఏ)లోని నిబంధనలను అమెరికా ఉల్లంఘిస్తోందని అబ్బాస్ తెలిపారు.

## సిరియా వైమానిక దాడుల్లో 400 మంది మృతి



**డమాస్కస్ :** సిరియాలోని డౌమా నగరంలో సైనికులకు, తిరుగుబాటుదారులకు మధ్య జరిగిన దాడుల్లో 400 మంది మృతి చెందారు. మృతుల్లో 95 మంది చిన్నారులు కూడా ఉన్నారని బ్రిటన్‌కు చెందిన హక్కుల పర్యవేక్షణ సంస్థ పేర్కొన్నది. భద్రతా బలగాలకు, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న దాడుల్లో అమాయక ప్రజలు చనిపోవడం పట్ల హక్కుల పర్యవేక్షణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. సిరియాలో శాంతి స్థాపన కోసం ప్రపంచ దేశాలన్నీ కృషి చేయాలని ఆ సంస్థ పిలుపునిచ్చింది.

## బ్రెగ్జిట్ వ్యూహాలపై చర్చిస్తాం : బ్రిటన్ ప్రధాని



**లండన్ :** బ్రెగ్జిట్ ( ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగడం ) తదనంతరం అనుసరించాల్సిన వ్యూహాలపై త్వరలో చర్చించనున్నట్టు బ్రిటన్ ప్రధాని థెరిసా మే తెలిపారు. బ్రెగ్జిట్ ప్రక్రియకు సంబంధించి థెరిసా మే బృందంలో విభేదాలున్నాయి యురోపియన్ యూనియన్ ప్రతినిధులను కూడా ఈ విభేదాలు అసహనానికి గురి చేస్తున్నాయి. ఆ విబేధాల పరిష్కారానికి వచ్చే వారంలో ఉన్నత సహాయకులతో థెరిస్సా సమావేశం జరపనున్నారు. గత 40ఏండ్లకు పైగా ఈయూతో బ్రిటన్‌కు గల అనుబంధాన్ని తెగతెంపులు చేసుకునేందుకు అనుసరించే విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# ఇకపై హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియ కఠినతరం

- భారత ఐటీ కంపెనీలు, ఉద్యోగుల నెత్తిన ట్రంప్ పిడుగు




**వాషింగ్టన్:** హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియను అమెరికా మరింత కఠినతరం చేసింది. ఇందుకు సంబంధించి నూతన విధాన ప్రకటనను ట్రంప్ సర్కారు తాజాగా జారీ చేసింది. ట్రంప్ జారీ చేసిన ఆదేశాలు భారత ఐటీ కంపెనీలపై, ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా అధ్యక్ష కార్యాలయం వెల్లడించిన నూతన విధానం ప్రకారం ప్రతి కంపెనీ తన హెచ్1బీ ఉద్యోగికి సంబంధించి అదనపు వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాల్సి ఉంటుంది. అంతేగాకుండా, అదనపు వివరాలకు సంబంధించిన ఆధారాలను కూడా తప్పకుండా సమర్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు కేటాయించే వాస్తవికమైన పనికి సంబంధించిన పూర్తి ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. ఉద్యోగి నిర్వర్తించే బాధ్యతల సమగ్ర వివరాలు, అందుకు వారికి ఉన్న విద్యార్హతలు, ఉద్యోగ సమయం, వారికి చెల్లించే జీతం లేదా వేతనం, పని గంటలు, ప్రయోజనాలు, లబ్ధిదారుడి పర్యవేక్షకుడి సమగ్ర వివరాలు, లబ్ధిదారుడు నిర్వర్తించే బాధ్యతలు లాంటి ఇతర సంబంధిత ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. తమ ఉద్యోగులకు హెచ్1బీ వీసాలను కోరుకునే కంపెనీలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ముందే ఉద్యోగుల వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. సాధారణంగా హెచ్1బీ కార్యక్రమం కింద తాత్కాలిక అమెరికా వీసాలను మంజూరూ చేస్తారు. ఈ వీసాల ద్వారా అర్హులైన అమెరికా నిపుణుల సంఖ్య తక్కువగా ఉన్న చోట అత్యంత నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగులను నియమించుకునేందుకు కంపెనీలకు వీలవుతుంది. కాగా, 2019 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 2 నుంచి హెచ్1బీ వీసాల దరఖాస్తు ప్రక్రియ చేపట్టనున్నట్టు యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. భారత ఐటీ కంపెనీలు, ఇతర ఉద్యోగులపై తాజా నిబంధనల ప్రభావం తీవ్రంగా ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఉగ్రసంస్థల నిర్మూలనలో పాక్ విఫలం : ట్రంప్



**వాషింగ్టన్:** ఉగ్రసంస్థల నిర్మూలనలో పాక్ ఘోరంగా విఫలమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందన్నారు. ఉగ్రసంస్థల నిర్మూలన కోసం పాక్ తీసుకొంటున్న చర్యల పట్ల ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ రాజ్ షా తెలిపారు. ఉగ్రసంస్థలను కట్టడి చేయలేకపోతున్నందున పాక్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేశామని అన్నారు.అమెరికా లేవనెత్తిన అంశాలపై పాక్‌లో పెద్దగా పురోగతి కనిపించడంలేదని రాజ్ షా పేర్కొన్నారు. వైట్‌హౌస్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజ్‌షా ఈ విధంగా సమాధానమిచ్చారు. తమ యంత్రాంగానికి పాక్‌తో సంబంధాల విషయంలో కొంత స్పష్టత వచ్చిందని, పాక్ చర్యలకు తగిన సమాధానం చెప్పాలని నిర్ణయించినట్టు చెప్పారు. అఫ్ఘనిస్థాన్‌లో అమెరికా తమ భాగస్వాములతో కలిసి పనిచేస్తోందని, అక్కడ ఐఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని అన్నారు. వందలాది ఉగ్రవాదులను హతమార్చామని, అక్కడ ఐఎస్ ప్రభావం తగ్గుతోందని షా పేర్కొన్నారు. అమెరికా దక్షిణాసియా పాలసీలో పాకిస్థాన్‌కు అవకాశమిస్తున్నామని మరో న్యూస్ కాన్ఫరెన్స్‌లో పెంటగాన్ వెల్లడించింది.

## కాలిఫోర్నియా, మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం ప్రారంభం

**వాషింగ్టన్ :** కాలిఫోర్నియా, మెక్సికోల మధ్య సరిహద్దులో గోడ నిర్మాణాన్ని అమెరికా ప్రభుత్వం ప్రారంభించింది. 1990వ దశకంలో నిర్మించిన కంచె స్థానంలో ఇప్పుడు గోడను నిర్మిస్తున్నది. గత ఏడాది శాండియాగోలో నిర్మించిన నిర్మాణాల ప్రాతిపదికన ట్రంప్ ప్రభుత్వం సరిహద్దు గోడ నిర్మాణాన్ని ప్రారంభించింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడుతున్న మెక్సికన్లను నియంత్రించడంలో భాగంగా అమెరికా, మెక్సికో సరిహద్దులో గోడ నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అంతేగాకుండా, గోడ నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని కూడా మెక్సికో నుంచే రాబడతానని అన్నారు. అయితే, గోడ నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు మెక్సికో ససేమిరా నిరాకరించింది. దీంతో, ఈ విషయం కొంతకాలం మరుగున పడింది. తాజాగా, గోడ నిర్మాణం ప్రక్రియ ప్రారంభమైంది.

## ఎయిర్‌ఫ్రాన్స్ ఉద్యోగుల ఆందోళన ఉద్రిక్తం

**పారిస్:** వేతన పెంపు డిమాండ్‌తో ఎయిర్ ఫ్రాన్స్ విమానయాన సంస్థ ఉద్యోగులు చేపట్టిన ఒకరోజు సమ్మె ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో, వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలుపడ్డారు. పైలెట్లు, ఇతర సిబ్బంది విధులు బహిష్కరించగా.. వేర్వేరు దేశాల నుంచి రాకపోకలు సాగించాల్సిన విమానాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. తమ జీతాలను 6 శాతం పెంచాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా.. ఎయిర్ ఫ్రాన్స్ సంస్థ ఒక్క శాతం మాత్రమే పెంచుతామని చెబుతోంది. యాజమాన్యం తీరును నిరసిస్తూ పారిస్ శివారులు, రోహిసీ ఎన్ ఫ్రాన్స్‌లో ఉద్యోగులంతా చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. చార్లెస్ డీగాలే విమానాశ్రయంలోని ఓ టెర్మినల్‌ను చుట్టుముట్టేందుకు ఉద్యోగులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణలకు దారితీసింది.

## రాజీనామాకు సిద్ధపడ్డ ఆస్ట్రేలియా ఉప ప్రధాని



బార్నబె జాయిస్

**మెల్‌బోర్న్:** లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా ఉప ప్రధాని బార్నబె జాయిస్ పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మాజీ సహాయకురాలితో సంబంధం, లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బార్నబె జాయిస్ సోమవారం అధికారికంగా పదవి నుంచి తప్పుకుంటారని ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ ప్రకటించారు. సోమవారం జరిగే పార్టీ సమావేశంలో నేషనల్ పార్టీ నాయకత్వానికి, ఉప ప్రధాని పదవులకు రాజీనామా సమర్పించనున్నట్లు బార్నబె జాయిస్ తెలిపారు.

## దుబాయ్‌లో హైపర్‌లూప్ ట్రైన్ ప్రారంభం

- గంటకు 745 కి.మీ. వేగం



**అబుదాబీ:** ప్రపంచ వ్యాప్తంగా ఇపుడు చర్చ 'హైపర్‌లూప్' రైలు గురించే! ఈ ట్రైన్ ఎంతగా ఆకట్టుకుం దంటే.. దీని గురించి ఎవరైనా చెబుతుంటే సగటు మానవుడు ఊహల్లో విహరిస్తున్నాడు. హైపర్‌లూప్ టెక్నాలజీతో వేగంగా ప్రయాణించే రోజులు త్వరలోనే రాబోతున్నాయి. గురువారం దుబాయ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ఆవిష్కరించిన హైపర్‌లూప్ క్యాప్సుల్ నమూనా విపరీతంగా ఆకట్టుకుంటోంది ఇది అందుబాటులోకి వస్తే దుబాయ్ నుంచి అబుదాబీకి 12 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. అదే కారులో అయితే గంటన్నర పడుతుంది. దీంట్లో ప్రయాణించే రైలుకు గంటకు 1200 కి.మీ వేగంతో ప్రయాణించే సామర్థ్యమున్నా సగటున 745 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది.

**హైపర్‌ల్యూప్ ప్రత్యేకతలు...**

ఇక దుబాయ్ విషయానికొస్తే.. ఈ ట్రైన్‌ని రెండు తరగతులుగా విభజించారు. ఒకటి గోల్డ్ (ఐదుగురు పాసింజర్స్) క్లాస్, రెండోది (14 పాసింజర్లు) సిల్వర్. ఇక ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవలేదు. రైళ్లకు గ్రీన్‌హౌస్ గ్లాసెస్ అమరుస్తారు. టిక్కెట్ రేటు కూడా ఎక్కువగా ఉంటుంది. భారతీయ కరెన్సీలో చూస్తే 10 నుంచి 15 వేలు పైనే అన్నమాట.

# బీసీల సమగ్ర అభివృద్ధి కోసం విధానాన్ని ప్రకటించాలి

## రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ మురళీ మనోహర్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

బీసీల సమగ్రాభివృద్ధి కోసం విధానాన్ని ప్రకటించాలని ప్రొఫెసర్ మురళీ మనోహర్ డిమాండ్ చేశారు. 2018-19 వార్షిక బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటిస్తున్నదని, కానీ బీసీలకు ఎంత కేటాయిస్తారన్నదే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ మురళీమనోహర్ అధ్యక్షతన బీసీల సమగ్రాభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మురళీమనోహర్ మాట్లాడుతూ 2017-18 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.14,375 కోట్లు కేటాయిస్తే అందులో సగం నిధులనే ఖర్చు చేసినట్టు జాతీయ ఎస్సీ కమిషన్ వెల్లడించిందన్నారు. రాజ్యాంగపరంగా చట్టాలను రూపొందించి, హక్కు కల్పించాల్సిన దళితుల బడ్జెట్‌కే ఈ గతి పడితే ఇక బీసీ ఆర్థిక స్థితి గతులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 52 శాతం బీసీలు ఉంటే 2017-18 వార్షిక బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5070 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. కేటాయించిన నిధుల్లో కూడా 60 నుంచి 70 శాతం వరకే నిధులు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గత నాలుగేండ్లలో బీసీలకు కేటాయించిన బడ్జెట్, వాటి ఖర్చుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్, బీఎల్ఎఫ్ కన్వీనర్ డాక్టర్ రామనర్సయ్య, చేనేత కార్మిక సంఘం నేత కెరమేష్, గొర్ల కాపర్ల సంఘం నాయకులు నాగరాజు, రజక సంఘం నాయకులు నాగరాజు, ఎంబీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీమనోహర్

### కమిటీ డిమాండ్

బీసీజనాభాను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాదిలోనే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేయాలి. కార్పొరేషన్, ఫెడరేషన్ లోన్స్‌కు బ్యాంకు లింకేజీ తొలగించాలి. సంచార జాతులు, ఎంబీసీలు, బీసీలకు ప్రాధాన్యత క్రమంలో నిధుల కేటాయింపులు జరపాలి. ఎంబీసీ కులాల జాబితాను వెంటనే విడుదల చేసి 2017-18 సంవత్సరంలో కేటాయించిన వెయ్యి కోట్లలో ఖర్చు కాని నిధులను 2018 -19 వార్షిక బడ్జెట్‌లో బీసీలకే కేటాయించాలి. స్వయం ఉపాధి శిక్షణ కింద యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందించాలి. కుటీర పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్‌లకు పాలకమండలిని వెంటనే ఏర్పాటు చేయాలి



## వెంకన్న వేషధారణలో ఏడు వేల మంది విద్యార్థులు

- గిన్నిస్ బుక్, లిమ్కా బుక్‌లో చోటుకు యత్నం

**నవతెలంగాణ-కలెక్టరేట్**

కనీవినీ ఎరుగని రీతిలో ఏడు వేల మంది విద్యార్థులు వెంకన్న వేషధారణలో ప్రదర్శన ఇచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ మైదానంలో శుక్రవారం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విద్యార్థులు వెంకన్న వేషధారణ, నామాలతో భారీగా తరలివచ్చారు. ట్రస్మా సహకారంతోనే ఈ ప్రదర్శన సాధ్యమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. 110 పాఠశాలల నుంచి వచ్చిన ఏడు మంది చిన్నారుల ప్రదర్శన గిన్నిస్ బుక్, లిమ్కాబుక్ రికార్డు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఏనుగు రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## హెలెన్‌జిల్ ఫెలోషిప్‌నకు ఖమ్మం విద్యార్థి

- యేడాదికి రూ.1.60లక్షల డాలర్ల స్కాలర్‌షిప్

**నవతెలంగాణ-ఖానాపురంహవేలి**



ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని మిచిగన్ యూనివర్శిటీలో మూడేండ్ల ఫైన్ ఆర్ట్స్ కోర్సును అభ్యసించేందుకు హెలెన్‌జిల్ ఫెలోషిప్‌నకు నగరంలోని న్యూఇరా విద్యా సంస్థల అధినేత ఐవీ రమణారావు, డాక్టర్ లక్ష్మీ దంపతుల కుమారుడు నిశాంత్ మన దేశం తరపున ఎంపికయ్యారు. వివిధ దేశాల నుంచి 1800 మంది పోటీ పడగా ఆ సంస్థ 12మందిని ఎంపిక చేసింది. ఎంపికైన 12 మందిలోనూ నిశాంత్ అత్యంత పిన్నవయస్కుడు కావడం విశేషం. ఆయనకు ఏడాదికి లక్షా 60వేల డాలర్లు ఉపకార వేతనంగా ఇవ్వనున్నారు. న్యూఇరా పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన నిశాంత్ హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశారు. ఢిల్లీలోని నోయిడాలో ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం అమెరికాలో ట్రిబ్యూన్ పత్రికలో వెబ్‌డిజైనర్‌గా, ఇన్‌పుట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు రమణారావు, లక్ష్మీ దంపతులను అభినందించారు.

## అక్రమార్కులతో మోడీ చెట్టాపట్టాల్ : వీహెచ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

దేశంలో రోజుకో భారీ కుంభకోణం బయటపడుతుందని, అక్రమార్కులు విచ్చలవిడిగా దేశాన్ని దోచుకుంటున్నా ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారికి అండగా నిలబడి సామాన్య ప్రజలను, పేదలను ముంచుతున్నారని మాజీ ఎంపీ వి హనుమంతరావు చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక మోడీ అక్రమార్కులతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. మోడీ అధికారంలోకి వచ్చాక ప్రధాన మంత్రి అయ్యాక అంబానీల సూచనమేరకే నోట్లను రద్దు చేసి వారి నల్లధనాన్ని మొత్తం తెల్లధనంగా మార్చుకున్నారని విమర్శించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో దేశ ప్రజలను మోడీ నట్టేట ముంచారని విమర్శించారు. నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి అక్రమార్కులు దేశాన్ని దోచుకొని విదేశాలకు పారిపోయినా మోడీ ఆపలేకపోయారని పేద ప్రజల సొమ్ములను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

## మా సలహాలు స్వీకరించండి

- సీఏసీపీ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధిం చిన అంశాలను కూలంకషంగా తెలుసుకోవడం, వాటిపై అవగాహన పెంపొందించడం కోసం మా సలహాలు, సూచనలను స్వీకరించాలని "ది ఇనిస్టూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా" మెంబర్ జితేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగంతోని మద్దతు ధరలు, ప్రభుత్వం అమలు చేస్తున్న తీరు తదితర అంశాలను తెలుసు కోవడానికి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవ సాయ శాఖ, చెరకు బోర్డు సంస్థలు సహకరి స్తాయని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ఎర్ర జొన్నలకు గిట్టుబాటు ధర లభించక రైతులు పడ్డ ఆర్థిక ఇబ్బందులు, వాటి పరిష్కారం కోసం తగిన సూచనలు సలహాలు అందించామన్నారు. రైతు సమస్యలను తెలుసుకొని వరి, గోదుమ, కొన్ని రకాల జొన్నలు, మొక్క జొన్న, చెరకు, పత్తి, సోయా లాంటి పంటలకు మద్దతు చెల్లించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. రైతులకు చేయూత నివ్వడం, ప్రభుత్వాలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సత్తా కలిగిన వృత్తి నిపుణులు తమ సంస్థలో ఉన్నారని తెలిపారు.

# గ్రామీణాభివృద్ధిలో టీసాట్‌ను వినియోగిస్తాం

- స్థానిక సంస్థల ప్రతినిధులకు అవగాహన
- ఖర్చులేకుండా ప్రజల్లోకి ప్రతివారం కార్యక్రమాలు : మంత్రి జూపల్లి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**




గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీసాట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని, ప్రతి వారం ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాలను ప్రసారం చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ రూపొందించిన కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని టీసాట్ స్టూడియోలో మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ సాంకేతిక విప్లవంతో ప్రపంచమే కుగ్రామంగా మారిందన్నారు. టీసాట్ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తమ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు మంత్రి తెలిపారు.

ప్రతి వారం ఒక ప్రత్యేక అంశంపై ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను ప్రసారం చేస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు అవుతున్నా ఇంకా గ్రామాల అభివృద్ధి పెద్దగా జరగకపోవడం బాధాకరమన్నారు. గత మూడున్నరేండ్లుగా తెలంగాణ ప్రభుత్వం గ్రామీణుల జీవన స్థితిగతులను మార్చేందుకు ఎన్నో కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. గ్రామపంచాయతీలకు నిధులను పెంచడం, ఖర్చును తగ్గించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో నిధుల కన్నా, సంఘటిత శక్తిగా ప్రజలు మారడమే కీలకమన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను ఖర్చు చేయడం ఒక్కటే తమ విధిగా ప్రజాప్రతినిధులు భావించడం సరికాదన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, సంఘటితంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ భారత్, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పేదరిక నిర్మూలన, సేంద్రీయ వ్యవసాయం, మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న చేయూత తదితర అనేక కార్యక్రమాలపై ప్రతివారం ప్రసారాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు సెర్ప్ సీఈఓ పౌసుమి బసు తెలిపారు. ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు టీసాట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాలను ప్రసారం చేస్తామని టీసాట్ సీఈవో శైలేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో 'స్త్రీ' నిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ సెంటర్ హెడ్ శేషాద్రి పాల్గొన్నారు.

# నవచిత్రం

## నయా చిత్రానికి గ్రీన్‌సిగ్నల్..


రజనీకాంత్

తమిళ సినీ ప్రేక్షకులు తలైవా అని అభిమానంగా పిలుచుకునే రజనీకాంత్ తాజాగా ఓ చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. రాజకీయాల్లోకి వస్తున్న నేపథ్యంలో ఇకపై రజనీకాంత్ సినిమాల్లో నటించరనే వార్త ఆయన అభిమానులను ఎంతో నిరాశపర్చింది. ఇటువంటి తరుణంలో రజనీ మరో కొత్త చిత్రానికి పచ్చజెండా ఊపడంతో ఆయన అభిమానులతోపాటు, ప్రేక్షకులూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈచిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ విషయాన్ని సన్ పిక్చర్స్ సంస్థ ట్విట్టర్ ద్వారా అభిమానులతో షేర్ చేసుకుంది. గతంలో 'పిజ్జా', 'జగర్తాండా', 'ఇరైవి' చిత్రాలకు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే ఈచిత్ర ప్రారంభోత్సవం ఉంటుందని సమాచారం. కాగా, రజనీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నటించిన 'రోబో 2.0' చిత్రం గ్రాఫిక్స్ కారణంగా ఇప్పటికే చాలా సార్లు వాయిదా పడింది. పా.రంజిత్ దర్శకత్వంలో రజనీ నటించిన మరో చిత్రం 'కాలా' ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## అంత ఖర్చు పెట్టలేను


సల్మాన్‌ఖాన్

గత కొన్నేండ్లుగా బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌ను వేధిస్తున్న ప్రశ్న 'పెళ్ళి ఎప్పుడు చేసుకుంటారు?'. మీడియాతోపాటు సన్నిహితులు, స్నేహితులు ఈ ప్రశ్న అడగ్గానే సల్మాన్ ఏదో ఒక సమాధానం చెప్పి దాట వేసిన సందర్భాలు కోకొల్లలు. అయితే తాజాగా ఓ విలేకరి ఇదే ప్రశ్న అడిగితే, సల్మాన్ దిమ్మతిరిగే ఆన్సరిచ్చాడు . 'అందరిలాగే నాకూ పెళ్ళి చేసుకోవాలని ఉంది. పెళ్లంటే మామూలు విషయం కాదు. లక్షలు, కోట్లు ఖర్చు చేయాలి. అంత ఖర్చు పెట్టేంత డబ్బు నా దగ్గర లేదు. అందుకే పెళ్ళి చేసుకోవడం లేదు. మా అమ్మానాన్నలు కేవలం 180 రూపాయలకే పెళ్ళి చేసుకున్నారు. అందుకే ఐదుగురు పిల్లల భవిష్యత్‌ను అద్భుతంగా చక్కదిద్దారు' అని సల్మాన్ చెప్పిన సమాధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. దేశంలోనే అత్యంత ధనవంతుల జాబితాలో ఉన్న సల్మాన్ ఈ తరహా ఆన్సర్ ఇవ్వడం అందర్నీ విస్తు పోయేలా చేసింది.
సల్మాన్ ప్రస్తుతం 'రేస్ 3', 'భరత్', 'దబాంగ్ 3', 'కిక్ 2' చిత్రాల్లో నటిస్తున్నారు.


'ఎమ్మెల్యే' చిత్రంలో కళ్యాణ్‌రామ్, కాజల్

## స్ట్రాంగ్ కంటెంట్‌తో ట్యాక్సీవాలా..


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకుడిగా జిఏ2, యువి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ట్యాక్సీవాలా'. ఈ చిత్రంతో ఎస్.కె.ఎన్.నిర్మాతగా ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న ఈచిత్రం గురించి నిర్మాత ఎస్.కె.ఎన్. మాట్లాడుతూ,'విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దానికి తగ్గట్టుగానే అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేసే రీతిలో విజయ్ దేవరకొండ క్యారెక్టర్‌ను దర్శకుడు రాహుల్ అత్యద్భుతంగా తీర్చిదిద్దాడు. విజయ్ మేనరిజమ్స్, బాడీ లాంగ్వేజ్, క్యారెక్టరైజేషన్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తాయి. దర్శకుడు రాహుల్ టేకింగ్, సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ ఈ చిత్రానికి ప్రత్యేక హైలైట్స్‌గా నిలుస్తాయి. స్ట్రాంగ్ కంటెంట్, ఆర్టిస్టుల పర్‌ఫార్మెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని చాలా గ్రాండియర్‌గా నిర్మించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మే 18న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా భారీగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ చిత్ర టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్‌ను అతి త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు. విజయ్‌దేవరకొండ, ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్, కళ్యాణి, మధునందన్, సిజ్జు మీనన్, రవిప్రకాష్, రవి వర్మ, ఉత్తేజ్, విష్ణు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సౌండ్ : సింక్ సినిమా, ఆర్ట్ : శ్రీకాంత్ రామిశెట్టి, ఎడిటర్, కలరిస్ట్ : శ్రీజిత్ సారంగ్, స్క్రీన్‌ప్లే, సంభాషణలు : సాయికుమార్ రెడ్డి, నిర్మాత : ఎస్.కె.ఎన్.

## ముచ్చటగా మూడవసారి..


పరిణీతి చోప్రా

పరిణీతి చోప్రా, అర్జున్‌కపూర్ వీరిద్దరి జోడీ మరోసారి వెండితెరపై మెరవనుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన 'ఇష్క్‌జాదే' చిత్రం బాలీవుడ్‌లో ఘన విజయం సాధించింది. అంతేకాదు ఈ జోడీ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ మెస్మరైజ్ చేసిందంటూ ప్రేక్షకులతోపాటు విమర్శకులు కూడా ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కాంబినేషన్‌లోనే ఇటీవల 'సందీప్ ఔర్ పింకీ ఫరార్' చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే మరో చిత్రంలో నటించేందుకు వీరిద్దరూ పచ్చజెండా ఊపారు. 'నమస్తే ఇంగ్లాండ్' టైటిల్‌తో రూపొందబోయే ఈచిత్ర షూటింగ్ శుక్రవారం అమృత్‌సర్‌లో ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ వీరిద్దరూ ట్విట్టర్ ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నారు. విపుల్ షా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈచిత్రాన్ని సంజనా బాత్రా, ఆర్తి నాయర్, ఆషిని షా సంయుక్తంగా నమస్తే ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు.


ప్రియాంక చోప్రా

## ఈ క్షణమే మొదలైంది..


శ్వేతా, అనురాగ్, బి.గోపాల్

అనురాగ్‌ను కథానాయకుడిగా పరిచయం చేస్తూ జనని క్రియేషన్స్ పతాకంపై పోకూరి లక్ష్మణాచారి నిర్మిస్తున్న చిత్రం 'ఈ క్షణమే'. సాయిదేవ రామన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. నాయకానాయికలు అనురాగ్, శ్వేత పాల్గొన్న ముహూర్తపు షాట్‌కు ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ క్లాప్‌నివ్వగా, జడ్జి రామారావు కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా హీరో అనురాగ్ మాట్లాడుతూ,'కథ చాలా బాగుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా అన్ని రకాల అంశాలతో ఈచిత్రకథలో ఉన్నాయి. పది రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. ఈచిత్రంతో నన్ను కథానాయకుడిగా పరిచయం చేస్తున్న దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు' అని చెప్పారు. 'తొలిసారి సినిమా చేస్తున్న ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. మంచి కథతో రూపొందుతున్న ఈచిత్రం మంచి హిట్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని సంపూర్ణేష్ బాబు అన్నారు. 'సింగిల్ సిట్టింగ్‌లో కథ ఓకే అయ్యింది. జనని బ్యానర్‌లో ఓ మంచి చిత్రంగా ఈ చిత్రం నిలుస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు అన్నారు. 'మా జనని బ్యానర్‌లో ఇది తొలి చిత్రం. దర్శకుడు కథే ఈ చిత్రానికి ప్రధాన బలం. అలాగే హీరో అనురాగ్‌కు ఈ సినిమా మంచి ఇంట్రడక్షన్ సినిమా అవుతుంది. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలన్ని కోరుకుంటున్నాను' అని నిర్మాత పోకూరి లక్ష్మణాచారి చెప్పారు. అనురాగ్, శ్వేతా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈచిత్రానికి కెమెరా : సతీష్, పాటలు: అనంత శ్రీరామ్, మాటలు : హేమంత్ కార్తీక్.

## సరైన టైమ్‌లో.. సరైన నిర్ణయం..

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఉత్పత్తులకు ఇకపై ప్రచారకర్తగా ప్రియాంక చోప్రా వ్యవహరించదని ఆమె అధికార ప్రతినిధి శుక్రవారం మీడియాకు తెలిపారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ప్రొడక్ట్స్‌కు ప్రియాంక ప్రచారకర్తగా ఉందనే విషయం అందరికీ తెలిసిందే. దాదాపు 11,400 కోట్ల రూపాయల మేరకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేశారనే ఆరోపణలను నీరవ్ మోడీ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నీరవ్ మోడీతో కుదుర్చుకున్న ప్రచారకర్త ఒప్పందాన్ని ప్రియాంక టెర్మినేట్ చేశారు. ఈ విషయమై ప్రియాంక ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ,'ప్రస్తుతం నీరవ్ మోడీకి సంబంధించి జరుగుతున్న వ్యవహారాలను నిశితంగా పరిశీలించిన మీదట ఇకపై ఆయన ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉండకూడదనే నిర్ణయానికి ప్రియాంక వచ్చారు. ఈ విషయమై తన న్యాయవాదితో సంప్రదింపులు జరిపారు. ఆయన ఇచ్చిన సలహా మేరకు నీరవ్ మోడీ ఉత్పత్తుల ప్రచారకర్త అగ్రిమెంట్‌ను ప్రియాంక నిలిపివేశారు' అని చెప్పారు. ప్రియాంక ప్రస్తుతం 'ఏ కిడ్ లైక్ జాక్', 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్' వంటి హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తోంది. అంతేకాకుండా నిర్మాతగా 'పహూనా' అనే సిక్కిం చిత్రాన్ని నిర్మిస్తోంది. అలాగే చాలా కాలం గ్యాప్ తర్వాత బాలీవుడ్‌లో ప్రియాంక 'ఐత్రాజ్' సీక్వెల్‌లో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈచిత్ర షూటింగ్ కూడా అతి త్వరలోనే ప్రారంభం కానుందని సమాచారం.

## అయినప్పటికీ సంతోషంగానే ఉన్నా..


సోనమ్ కపూర్

'ప్యాడ్‌మాన్' చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఇందులో మేం ఏదైతే సున్నితమైన విషయం చెప్పాలనుకున్నామో ఆ విషయాన్ని అందరూ బాగా అర్థం చేసుకున్నారు. అయితే ఈచిత్రంలో నా పాత్ర నిడివిని చాలా తగ్గించారు. అయినప్పటికీ సంతోషంగానే ఉన్నాను' అని అంటోంది సోనమ్‌కపూర్. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా ఆర్.బాల్కీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్యాడ్‌మాన్'. ఈ చిత్రం ఇటీవల విడుదలై విశేషాదరణతో సర్వత్రా మంచి కలెక్షన్లను రాబడుతోంది. ఈచిత్రంలో సోనమ్ కపూర్ ఓ కీలక పాత్రలో నటించింది. ఈ చిత్రం సాధిస్తున్న విజయం గురించి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ,'కొన్ని సినిమాల్లో నటించే అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. అలాంటిదే ఈచిత్రం కూడా. ఓ మంచి చిత్రంలో నటించినందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నాను. ఇందులో అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించిన చాలా సన్నివేశాలను, సంభాషణలను దర్శకుడు బాల్కీ తొలగించారు. బహుశా అవి కథను డిస్టర్బ్ చేస్తున్నాయనుకుంటా. అయినప్పటికీ నా పాత్ర ద్వారా ప్రేక్షకులకు ఆయన ఏమైతే చెప్పించాలనుకున్నారో దాన్ని బాగా కన్వే చేసేలా ఎడిటింగ్ చేయటం విశేషం. నిడివి తక్కువైనప్పటికీ ఈ చిత్రానికి వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా చాలా ఆనందంగా ఉంది' అని చెప్పింది. సోనమ్ ప్రస్తుతం 'వీరే డి వెడ్డింగ్', 'సంజు', 'ఏక్ లడకీ కో దేఖా తో ఐసా లగా..' వంటి తదితర చిత్రాల్లో భిన్న పాత్రలు పోషిస్తోంది.

## డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్..

మారుతి, శ్రావణి, ప్రియ హీరో, హీరోయిన్లుగా విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరి, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు, ఎస్.సురేష్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎమ్ 6'. జైరామ్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్ర ట్రైలర్ లాంచ్ గురువారం హైదరబాద్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ట్రైలర్ చూస్తే హర్రర్ అంశాలతోపాటు యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందినట్లు అర్థమవుతోంది. మారుతి ఈచిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. భవిష్యత్‌లో మంచి హీరోగా ఎదిగే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ట్రైలర్ కట్ చేయటంలోనే దర్శకుడి ప్రతిభ ఏమిటో తెలిసింది. మ్యూజిక్ కూడా చాలా బాగుంది' అని చెప్పారు. 'సంగీతం, నటీనటుల నటన ట్రైలర్‌లో ఆకట్టుకునేలా ఉన్నాయి. ప్రతిభగల దర్శకుడు, అభిరుచిగల నిర్మాత నిర్మించిన చిత్రమిది. ఈ చిత్రం ద్వారా అందరికీ మంచి పేరు రావాలని ఆశిస్తున్నాను' అని సాయి వెంకట్ అన్నారు.
'నేపథ్య సంగీతానికి బాగా స్కోప్ ఉన్న చిత్రమిది. ఇందులో ఒక మంచి పాట కూడా ఉంది. దర్శక, నిర్మాతలు ఇచ్చిన పూర్తి స్వేచ్ఛతో మంచి మ్యూజిక్ చేయగలిగాను' అని సంగీత దర్శకుడు విజయ్ బాలాజీ చెప్పారు. 'నాలోని ప్రతిభను గుర్తించి ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం కల్పించిన మా నిర్మాతలకు రుణపడి ఉంటాను. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కడుపుబ్బ నవ్వించే కామెడీ కూడా ఉంటుంది. అంతర్లీనంగా చిన్న సందేశం కూడా ఇచ్చే ప్రయత్నం చేశాం. విజయ్ బాలాజీ ఒక పాటతోపాటు అత్యద్భుతమైన నేపథ్య సంగీతం సమకూర్చారు. సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలుస్తుంది' అని దర్శకుడు జైరామ్ వర్మ తెలిపారు. 'దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ చిత్రానికి నిర్మించాను. చెప్పినదాని కంటే దర్శకుడు ఈ చిత్రకథను చాలా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. మా హీరో మారుతికి ఇది తొలి చిత్రం. అయినప్పటికీ ఎంతో అనుభవం ఉన్న హీరోలా చేశాడు. మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను' అని నిర్మాత విశ్వనాథ్ తన్నీరు చెప్పారు. 'ఇది నా తొలి సినిమా. నేను నటన నేర్చుకోలేదు. దర్శకుడు ఏం చెప్పాడో అదే ఫాలో అయ్యాను. మా నిర్మాత ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండ నిర్మించారు. విజయ్ బాలాజీ సమకూర్చిన సంగీతం అన్ని వర్గాల ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుంది' అని హీరో మారుతి చెప్పారు. గోవింద, హరిత, వంశీ, ఇంద్రతేజ, రహీం (రాకేష్‌బాబు), మురళీ తదితరులు నటించిన ఈచిత్రానికి సంగీతం : విజయ్ బాలాజీ, ఎడిటింగ్ : వంశీ కందాల, కెమెరా : మహ్మద్ రియాజ్, సమర్పణ: శ్రీమతి పార్వతి, నిర్మాతలు : విశ్వనాథ్‌తన్నీరు, ఎస్.సురేష్, దర్శకత్వం : జైరామ్ వర్మ.



విశ్వనాథ్ తన్నీరు, ఆర్.కె.గౌడ్, సాయివెంకట్, మారుతి, జైరామ్ వర్మ

## నిర్మాతగా ఆగస్ట్ 15


మాధురీ దీక్షిత్

మూడు దశాబ్దాలు సినీ ప్రస్థానంలో ఎన్నో అద్భుత చిత్రాలు, మరెన్నో అత్యద్భుత పాత్రలు పోషించి ప్రేక్షకుల మనసులపై చెరగని ముద్ర వేసిన అందాల కథానాయిక మాధురీ దీక్షిత్. పెళ్ళి అనంతరం సినిమాలకు దూరంగా ఉన్న మాధురీ కొంత కాలం తర్వాత ప్రాధాన్యత ఉన్న పాత్రలున్న చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం 'బక్కెట్ లిస్ట్' అనే మరాఠీ చిత్రంలో నటిస్తోంది. ఇన్నేండ్ల కెరీర్‌లో మాధురీ నటిస్తున్న తొలి మరాఠీ చిత్రమిది. నటిగా ప్రేక్షకులను విశేషంగా అలరించిన మాధురీ ఇకపై అభిరుచిగల నిర్మాతగానూ సత్తా చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సొంత నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసింది. తొలి ప్రయత్నంగా మరాఠీలో 'ఆగస్ట్ 15' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో జాతీయ అవార్డు గ్రహీత రాహుల్ పీతే, మృణ్‌మయి దేశ్‌పాండే నాయకానాయికలుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, నిర్మాతగా ఈ ప్రాజెక్ట్‌ను ఓ ఛాలెంజ్‌గా తీసుకున్నానని మాధురీ తెలిపారు.

## భారతీయుడు 2లో..!


అజయ్‌దేవగన్

కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన 'భారతీయుడు' చిత్రం అప్పట్లో ఒక సంచలనం. విశేష ప్రేక్షకాదరణతో అత్యద్భుతమైన కలెక్షన్లతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇదే కాంబినేషన్‌లో ఈ చిత్ర సీక్వెల్ 'భారతీయుడు 2' చిత్రం రూపొందనుంది. ఇటీవల 'భారతీయుడు 2' పేరుతో ఉన్న బెలూన్లను దర్శకుడు శంకర్ తైవాన్‌లో ఎగురవేసిన విషయం విదితమే. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో అజయ్‌దేవగన్ నటించనున్నారట. ఇప్పటికే ఈ కథ ఏమిటో, అజయ్ పాత్ర తీరుతెన్నులెలా ఉంటాయో అజయ్‌కు దర్శకుడు శంకర్ తెలియజేశారని తెలుస్తోంది. అన్ని విషయాలూ నచ్చడంతో అజయ్ కూడా ఈ చిత్రంలో నటించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారట. ఈ చిత్రంలో కమలహాసన్ సరసన కథానాయికగా నయనతార ఎంపికైన సంగతి తెలిసిందే. ఇటీవల సొంత పార్టీని ప్రారంభించిన కమల్‌హాసన్ పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వెళ్లేముందే అంగీకరించిన సినిమాలను పూర్తి చేయాలనే నిర్ణయం తీసుకున్నారట. దీంతో ఆయన నటిస్తూ నిర్మిస్తున్న 'విశ్వరూపం 2', 'శభాష్ నాయుడు' చిత్రాల షూటింగ్ ఏకధాటిగా జరుగుతున్నాయి.

# తప్పుల తడక



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

టీఆర్టీ రాతపరీక్షలు శనివారం నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు జరగనున్నాయి. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు 2.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలిరోజు శనివారం 34,827 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. టీఎస్‌పీఎస్సీ 60 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. టీఆర్టీ రాతపరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం కోసం టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రంలోకి రావాలని ప్రకటించింది. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 గంటల్లోపు చేరుకోవాలని సూచించింది. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 గంటల వరకే కచ్చితంగా చేరుకోవాలని సూచించింది. మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 1.45 గంటల వరకే చేరుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అభ్యర్థులు విలువైన పరికరాలు, వ్యక్తిగత వస్తువులు, బంగారు ఆభరణాలతో పరీక్షా కేంద్రంలోకి హాజరుకావొద్దని కోరింది. అభ్యర్థులు మెహందీ, ఇంక్ వంటి బాహ్యపదార్థాలను చేతులు, పాదాలపై ఉపయోగించకూడదని తెలిపింది. ఇవి ఉంటే వేలిముద్ర, బయోమెట్రిక్ పరీక్షా కేంద్రంలో నమోదు కాదు. మొబైల్, సెల్యూలార్ ఫోన్, ట్యాబ్, పెన్‌డ్రైవ్లు, బ్లూటూత్ వంటి పరికరాలు, గడియారాలు, కాలిక్యులేటర్లు, లాగ్ పట్టికలు, పర్సు, నోట్ పుస్తకాలు, విడి పేపర్లు లేదా రికార్డింగ్ సాధనాలు అనుమతించబడవని పేర్కొంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు పరీక్షా కేంద్రంలోకి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించింది. హాల్‌టికెట్‌తోపాటు అసలైన గుర్తింపు కార్డు లేకుండా పరీక్షా కేంద్రంలోని అనుమతి ఉండదు.

**తొలిసారిగా ఉపాధ్యాయ నియామకాలు**

తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ జరుగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాలను పాఠశాల విద్యాశాఖ చేపట్టేది. తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల బాధ్యతను టీఎస్‌పీఎస్సీకి అప్పగించింది. కానీ పరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు రకాలుగా సాంకేతిక సమస్యలతో అభ్యర్థులను ఇబ్బందులను గురిచేస్తున్నది. దీంతో సీఎం కేసీఆర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీరుపై సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తున్నది. కొలువుల భర్తీలో టీఎస్‌పీఎస్సీ నిర్వాకంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని భావిస్తున్నారు. సాంకేతిక సమస్యలు ఎందుకు వస్తున్నాయని టీఎస్‌పీఎస్సీని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది.

**టీఎస్‌పీఎస్సీ వర్సెస్ సీజీజీ**

టీఆర్టీ రాతపరీక్షల సమస్య టీఎస్‌పీఎస్సీ వర్సెస్ సీజీజీగా మారిపోయింది. ఒకరిపై ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసుకున్నారు. సీజీజీ సాంకేతిక తప్పిదాల వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. టీఎస్‌పీఎస్సీ పదే పదే నిబంధనలు మార్చడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీజీజీ పేర్కొంది. ఈ పంచాయితీ ప్రభుత్వం వద్దకు చేరింది. త్వరలోనే వివాదాన్ని పరిష్కరించేందుకు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసే యోచనలో సీఎస్ ఉన్నట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీ తమ తప్పేమీలేదని సాంకేతిక నైపుణ్యాన్ని అందించే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)పై తప్పును తోసేసింది. తమ తప్పేమీ లేదని సీజీజీ నెట్‌వర్కింగ్ సిస్టంలో ఉన్న లోపాల వల్లే ఇదంతా నెలకొందని లేఖ రాయడం పట్ల సీజీజీ సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తున్నది. టీఎస్‌పీఎస్సీకే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలకు సహకారం అందిస్తున్నామని సీజీజీ చెప్తున్నది. అక్కడెక్కడా రాని సమస్యలు ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోనే ఎందుకు వస్తున్నాయని ఎదురు ప్రశ్నించింది. అభ్యర్థులు పత్రాలు అప్‌లోడ్ చేసి కోడింగ్ ఇస్తారో వాటినే తాము జారీ చేస్తామని చెప్పినట్టు సమాచారం. మొత్తానికి రెండు ప్రభుత్వ సంస్థలు ఎవరికి వారే తమ తప్పేమి లేదంటూ సీఎస్‌కు లేఖలు రాశాయి. నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిఉన్న ఈ సమస్యను టీఎస్‌పీఎస్సీ,సీజీజీ చేతులుదులుపుకునేలా వ్యవహరించటంపై చర్చనీయాంశంగా మారింది.

**పాకిస్తాన్‌లో ఉన్నామా? : నగేష్**

ప్రభుత్వం మా సమస్య వినడం లేదు. టీఎస్‌పీఎస్సీకి వెళ్తే పోలీసులతో సమాధానం చెప్పిస్తున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. మనం ఇండియాలో ఉన్నామా?, పాకిస్తాన్‌లో ఉన్నామా? అర్థం కావడం లేదు. హెల్ప్‌లైన్ కేంద్రం పనిచేయడం లేదు.

**మాకు అన్యాయం : జయలక్ష్మి**

పర్సెంటేజీల పేరుతో తీవ్ర అన్యాయం జరుగుతున్నది. 2012 డీఎస్సీ రాశాను. అప్పుడు లేని నిబంధనలు తెలంగాణ వచ్చాక విధించడం సమంజసం కాదు. దరఖాస్తు దశలోనే పర్సెంటేజీ తక్కువుందని, రిజక్ట్ చేస్తే బాగుండేది.

హాల్‌టికెట్లు ఇచ్చే సమయంలో అర్హత లేదని చెప్పడం సరికాదు. మేం కోర్టును ఆశ్రయిస్తాం.

**సుప్రీం కోర్టుకు వెళ్తాం : కె రాణి**

పర్సెంటేజీ పేరుతో దరఖాస్తు చేసినా హాల్‌టికెట్లు ఇవ్వడం లేదు. ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి. మాకు న్యాయం చేశాకే టీఆర్టీ నిర్వహించాలి. అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం.

**టీఆర్టీ పోస్టులు, అభ్యర్థులు వివరాలు**

| కేటగిరీ | పోస్టులు | అభ్యర్థులు |
|---|---|---|
| స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) | 1,941 | 1,45,158 |
| సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) | 5,415 | 89,149 |
| భాషాపండితులు (ఎల్పీ) | 1,011 | 24,219 |
| వ్యాయామ విద్య ఉపాధ్యాయులు (పీఈటీ) | 416 | 16,871 |
| స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్ఏపీఈ) | 09 | 2,177 |
| **మొత్తం** | **8,792** | **2,77,574** |

## మిర్చి పంటకు న్యాయమైన ధర ఇప్పించండి : తెలంగాణ రైతు సంఘం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

మిర్చి పంటకు నాణ్యమైన ధరను ఇప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీ. జంగారెడ్డి, టీ సాగర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, వ్యాపారులు రింగ్ అయి రేటును దిగ్గోసి కొనుగోలు చేయటం వల్ల రైతులు నిలువునా మునుగుతున్నారని అన్నారు. నాణ్యమైన మిర్చి రూ. 12 వేల వరకు పలుకుతుంటే వ్యాపారులు ఒకే సారి క్వింటాకు రూ. 3వేల పైన దిగ్గోయటంతో రైతులకు పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెద్ద మార్కెట్ల మీద ప్రత్యేక పర్యవేక్షణ చేసి జెండా పాటకు తగ్గకుండా రైతులకు న్యాయమైన రేటు ఇప్పించడానికి ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు.

## నాగర్ కర్నూల్‌కు 60 కోట్లు విడుదల : మర్రి

**హైదరాబాద్ :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి రూ. 60 కోట్ల ప్రత్యేక నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. అభివ ద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రత్యేక నిధి నుంచి రూ. 60 కోట్లు విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రుణం : సింగరేణి

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

సింగరేణి కార్మికుని స్వంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 లక్షల రూపాయల రుణం ఇప్పించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఛైర్మెన్ ఎన్.శ్రీధర్ తెలిపారు. 10 లక్షల రూపాయల గహ నిర్మాణ రుణంపై వడ్డీ మొత్తాన్ని సింగరేణి సంస్థ చెల్లించనుంది. ఇప్పటికే గహ నిర్మాణ రుణం తీసుకున్న వారికి కూడా ఈ పరిమితి వర్తిస్తుందని తెలిపింది. ఈ విధానం వెంటనే అమలులోకి వస్తుందని శ్రీధర్ తెలిపారు. ఇంకా మెడికల్ అన్‌ఫిట్ కేసులలో ఉద్యోగం వద్దనుకునే వారికి ఏకమొత్తం 25 లక్షలను నెలకు 25 వేల రూపాయల చొప్పున ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటికే వందమందికిపైగా అందించామన్నారు. ఉద్యోగుల తల్లిదండ్రులకూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారు. కార్మికుల క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, అంబేద్కర్ జయంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలను సెలవు దినాలుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఐఐటి, ఐఐఎంల్లో ఉన్నత డిగ్రీలు చదివే కార్మికుల పిల్లలకు కంపెనీ ద్వారా ఫీజులు చెల్లిస్తామన్నారు. అన్ని కాంటీన్ల ఆధునీకరించామన్నారు. 2718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజేషన్ చేశామన్నారు. ఇది కంపెనీ చరిత్రలోనే ప్రథమన్నారు. ఆరు కొత్త భూగర్భ గనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. 7200 మందికి డైరెక్టు రిక్రూట్‌మెంట్, డిపెండెంట్ కోటా కింద ఉద్యోగాలు కల్పించామన్నారు.

## సీఐపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

**నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్**



తప్పతాగి వాహనం నడిపిన నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండల సీఐ దీరావత్ కృష్ణపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. కామారెడ్డి జిల్లా సదాశినగర్ మండల పరిధిలో గురువారం రాత్రి సీఐ మద్యం తాగి ఇష్టారీతిన వాహనం నడిపాడు. వెనుక నుంచి గమనించిన వాహనదారులు సదాశివనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో వెళ్లి 44వ జాతీయ రహదారిపై సీఐని అడ్డుకున్నారు. రెచ్చిపోయిన సీఐ.. ఎస్ఐతో వాగ్వాదానికి దిగాడు. దాంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్టు తెలిసింది. సీఐ కృష్ణపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయ తెలిపారు. అతనిపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా నిజామాబాద్ ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పది స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఈ రాష్ట్రాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎంపీలు ఏప్రిల్ రెండు, మూడు తేదీల్లో రిటైర్ అవనున్నారు. మార్చి 12వ తేదీ నామినేషన్లకు చివరితేదీ కాగా.. 15 వరకు ఉపసంహరించుకోవచ్చు. మార్చి 26లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు ఈసీ ప్రకటించింది.

# రైతు భద్రత చట్టం కోసం పట్టుబట్టాలి

## అప్పుడే అన్నదాత సంక్షోభం నుంచి గట్టెక్కుతారు

- దళారుల దోపిడీకి కళ్లెం వేస్తే గిట్టుబాటు : కిసాన్ ముక్తి సదస్సులో రైతు సంఘాల నాయకులు

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి**



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

రైతు భద్రత చట్టం కోసం పట్టుబట్టాలని, సంక్షోభం నుంచి రైతును గట్టెక్కించేందుకు సమరశీల పోరాటాలు చేపట్టేలా అన్నదాతలు సన్నద్ధమవ్వాలని అఖిల భారత రైతాంగం పోరాట సమన్వయ సమితి నాయకులు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో శుక్రవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప అధ్యక్షతన కిసాన్‌ముక్తి సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ... రైతు రెక్కల కష్టాన్ని దళారీ సొమ్ము చేసుకుంటున్నాడని, ఈ దోపిడీని నిలువరిస్తేనే రైతుకు గిట్టుబాటవుతుందని చెప్పారు. గిట్టుబాటు ధర బిల్లు కోసం గ్రామగ్రామానా సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఇక్కడ రైతుల నుంచి కిలో ఎర్రజొన్నలను రూ.23 చొప్పున కొనుగోలు చేస్తున్న దళారులు ఉత్తరాది రాష్ట్రాల్లో 80 నుంచి వంద రూపాయలకు విక్రయిస్తున్నారని చెప్పారు. దీంతో దళారులు యేటా రాష్ట్రంలో రూ.20వేల కోట్లు సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేస్తే ఆ సొమ్మును రైతు సంక్షేమానికి ఉపయోగించొచ్చని అన్నారు. వ్యవసాయం ఎప్పుడూ సంక్షోభంలో కూరుకుపోలేదని, ప్రభుత్వ విధానాల వల్లే రైతు అప్పుల్లో కూరుకుపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. 14వ ఆర్థిక సంఘం నుంచి ఈ నాలుగేండ్లకు రూ.2,700 కోట్లు వస్తే.. ఆ నిధులను ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై త్వరలోనే వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాస్తానన్నారు. పసుపునకు మద్దతు ధరపై మంత్రి హరీశ్‌రావును కలిస్తే కేంద్రానికి లేఖ రాస్తానని తప్పించుకున్నారని అన్నారు.

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. గిట్టుబాటు బిల్లు, రైతు రుణ విముక్తి బిల్లు కోసం ఎంపీ కవిత పార్లమెంటులో ప్రస్తావించాలని కోరారు. వ్యవసాయ రంగంపై ఆధారపడే జనాభాను 50 శాతం నుంచి 38 శాతానికి తగ్గించి వ్యవసాయం నుంచి చిన్న, సన్నకారు రైతులన్ని గెంటివేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. దేశమంతా ఎలక్ట్రానిక్ మార్కెట్ అనుసంధానం చేశామని, 22వేల గ్రామాల్లోని మార్కెట్లలో సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. పండిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. ఈ ఏడాది దేశంలో వరి ధాన్యం మినహా మిగతా పంటల ఉత్పత్తులు పడిపోయాయని వివరించారు. నాలుగు వేల పెట్టుబడితోపాటు పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించాలని అన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుత్‌రావు మాట్లాడుతూ... సన్న, చిన్నకారు రైతులను సాగు నుంచి తరిమేసి కార్పొరేటు సేద్యం కోసం యత్నిస్తున్నారని అన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ మాట్లాడుతూ... అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులపై ప్రస్తావన చేయలేదని, స్వామినాథన్ కమిషన్ అమలుపై పెదవి విప్పలేదని అన్నారు.

పంటకు ఖర్చయిన వ్యయంపై 50 శాతం కలిపి ధర చెల్లించినప్పుడే గిట్టుబాటవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతోనే అన్నదాతల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగారెడ్డి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాములు, జేపీసీ నాయకులు భాస్కర్, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి సాయిబాబా, రైతులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై పిటిషన్ కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించింది. సాగునీటి అవసరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చంటూ గతంలో ఉమ్మడి హైకోర్టు వెలువరించిన ఆదేశాలను సవాల్ చేస్తూ పిటిషనర్ హయతుద్దీన్ సుప్రీంకోర్టులో ఓ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ రోహిన్‌టన్ ఫాలీ నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. మొదట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్‌రోహత్గీ వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పిటిషనర్ పదే పదే వ్యాజ్యాలు దాఖలు చేస్తున్నారని, ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టు నిర్మాణం అడ్డుకుంటున్నారని వాదించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అన్ని అనుమతులూ వచ్చాయని పేర్కొన్నారు. కాళేశ్వరం కొత్త ప్రాజెక్టు కాదని, తొమ్మిది సంవత్సరాల క్రితమే ఉమ్మడి ఏపీలో ప్రారంభం జరిగిందని చెప్పారు. పిటిషనర్ మరోసారి కేసు వేయకుండా జరిమానా విధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ రోహిన్‌టన్ ఫాలీ నారిమన్ జోక్యం చేసుకుంటూ.. ఎన్జీటీ చెన్నై బెంచ్‌ను ఆశ్రయించకుండా సుప్రీంకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. పైగా కేసు విచారణ కోసం పిటిషనర్ 'ఫోరం హంటింగ్' చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది సంజయ్‌ఉపాధ్యాయ సమాధానం చెబుతూ.. ఈ ప్రాజెక్టులో తెలంగాణతో పాటు మహారాష్ట్ర కూడా ఉన్నదని తెలిపారు. రెండు రాష్ట్రాలున్న నేపథ్యంలో ఢిల్లీకి వచ్చామని వివరించారు. పైగా చెన్నై బెంచ్‌లో సభ్యులు లేరని చెప్పారు. అయితే ప్రాజెక్టు నిర్మాణం తొమ్మిది సంవత్సరాలుగా జరుగుతుంటే ఇంత ఆలస్యంగా ఎందుకు ఆశ్రయించారని న్యాయమూర్తి ప్రశ్నించారు. అయితే తాము సరైన సమయంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించామని సంజయ్ ఉపాధ్యాయ చెప్పారు. కాగా ఆరు నెలల్లోపే కోర్టును ఆశ్రయించాలన్న న్యాయస్థానం.. కాళేశ్వరంపై దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

**పేర్లు బయటపెడతా : హరీశ్‌రావు**

కాళేశ్వరం కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వులపై నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కేసు విచారణ కోసం సుప్రీంకోర్టుకు వచ్చిన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడారు.

కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు ఇప్పటి వరకు 100పైగా కేసులు వేశారని ఆరోపించారు. ప్రాజెక్టుపై కేసులు వేస్తున్న కాంగ్రెస్ నేతల పేర్లు అసెంబ్లీ సాక్షిగా బయటపెడతానని హరీశ్‌రావు చెప్పారు. కేసులు వేసి ఇంజనీర్ల సమయం వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. 2018 చివరిలోగా కాళేశ్వరం జలాలను రైతులకు అందిస్తామని చెప్పారు. కోదండరాంను, కాంగ్రెస్ పార్టీని వేర్వేరుగా చూడబోమని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

## కృష్ణా ట్రిబ్యునల్ విచారణ మార్చికి వాయిదా

**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీపై విచారణ చేపడుతున్న కృష్ణా ట్రిబ్యునల్ మార్చికి వాయిదా పడింది. గురు, శుక్రవారం రెండు రోజుల పాటు వాదనలు విన్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యునల్... తదుపరి వాదనలు మార్చి 26, 27, 28వ తేదీన వింటామని పేర్కొంది. ట్రిబ్యునల్ విచారణకు స్వయంగా హాజరైన నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు... రాష్ట్ర ఆకాంక్షలను ప్రతిబింబించేలా న్యాయవాదులు వాదిస్తున్నారని కితాబిచ్చారు. ఇక శుక్రవారం రెండో రోజూ కొనసాగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఏపీ తరపు న్యాయవాది సత్యనారాయణను తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ పలు ప్రశ్నలు అడిగారు. ప్రధానంగా రెండు రాష్ట్రాల్లోని నేలల స్వభావం, వ్యవసాయ శీతోష్ణస్థితి మండలాలు, నీటి ఆవిరి పరిణామం లెక్కించడంపై వైద్యనాథన్ ప్రశ్నలు సంధించారు. ఇక సుప్రీంకోర్టులో కాళేశ్వరం కేసు విచారణ పూర్తయిన తరువాత మంత్రి హరీశ్‌రావు నేరుగా కృష్ణా ట్రిబ్యునల్ విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో నీటి వాటా కోసం ఎంత కొట్లాడినా సరైన వాటా దక్కలేదని చెప్పారు. కోర్టులపై, ట్రిబ్యునళ్లపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. న్యాయబద్ధంగా, నిబంధనల ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటానే ట్రిబ్యునల్‌లో అడుగుతున్నామని తెలిపారు. అయితే నీటి వాటాల కేటాయింపుపై కేంద్రం ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని హరీశ్‌రావు వాపోయారు.

# రైతు ముట్టడి ఉద్రిక్తం

**నవతెలంగాణ-జగిత్యాల**



ఎర్రజొన్న, వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర పెంచడంతో పాటు పసుపు పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు తరలివచ్చారు. మినీస్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై బైటాయించారు. క్వింటా పసుపునకు రూ.15వేలు, క్వింటా వరి ధాన్యానికి రూ.2500, మొక్కజొన్నకు రూ.2500 చొప్పున మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాటిపల్లి గంగారెడ్డి మాట్లాడుతూ... ఈ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల మూలంగా జిల్లాలో పంట విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు వరి పంటకు దోమపోటు, అకాల వర్షాలతో మొక్కజొన్న పంట నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో రైతులకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడికి పరిమితమయ్యారన్నారు. కొత్త పసుపు మార్కెట్‌లోకి వచ్చేసరికి రూ. 4 వేలకు పడిపోయిందని, దీంతో ఎకరాకు లక్షకుపైగా ఖర్చుచేసిన రైతు నష్టాలపాలవుతున్నాడని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. వరి, మొక్కజొన్న క్వింటాకు రూ.2500 చొప్పున మద్దతు ధర కల్పిస్తే రైతులను అప్పులనుంచి కొంత ఉపశమనం పొందుతారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు కవిత పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తామని, రైతులను ఆదుకుంటామని చెప్పి నాలుగేండ్లు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. జిల్లావ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాల్లో 2 లక్షలా 40వేల మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. మద్దతు ధర కల్పించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**మొహం చాటేసిన అధికారులు**

గిట్టుబాటు ధర కోసం వేలాది మంది కలెక్టరేట్‌కు తరలివస్తే ఇతర కార్యక్రమాలున్నాయంటూ అధికారులు వెళ్లిపోవడం అన్నదాత ఆగ్రహానికి మరింత కారణమైంది. దీంతో కలెక్టరేట్ గోడలెక్కి కొందరు బోర్డును ఊడబీకేందుకు యత్నించారు. రెండు గంటల పాటు పోలీసులకు, రైతులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో గేటును లాగగా చువ్వలు వంగిపోయాయి. ఐదెకరాల్లో పంటలు సాగుచేసి, చివరకు దళారులకు అమ్ముకుని నష్టపోయానంటూ మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కాటిపెల్లి రాజిరెడ్డి గేటుకు కండువా కట్టి ఉరేసుకున్నాడు. పోలీసులు వెంటనే అడ్డుకుని కాపాడారు. సీఐ ప్రకాశ్ కూడా తోపులాటలో గాయపడ్డారు. అనంతరం ఏవో మహేశ్వర్ నెమ్మదిగా గేటు ముందుకొచ్చి వినతిపత్రం తీసుకుని వెళ్లిపోయారు.

## భయం గుప్పెట్లో భారత్

(మొదటిపేజీ తరువాయి)

బెంగళూరులో హత్యకు గురైన గౌరీ లంకేశ్ సంఘటనను ఉదహరించింది. హిందూ జాతీయవాదం,కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె రచనలు సాగించినందుకే దుండగుల కాల్పులకు బలయ్యారని తెలిపింది. పలువురు జర్నలిస్టులపై పరువు నష్టం కేసులు వేశారని తెలిపింది. యూనివర్సిటీల్లోనూ భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకునేందుకు కఠిన చట్టాలను ఉపయోగిస్తున్నారని ఆమ్నెస్టీ నివేదిక పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పుస్తకాలపై నిషేధం విధించడం, కేంద్ర ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు కొన్ని సినిమాలకు అనుమతి నిరాకరించడాన్ని నివేదికలో గుర్తు చేశారు. కుల వివక్ష, మత హింస, మహిళలు, చిన్నారులపై దాడులను నివేదిక పేర్కొన్నది. జమ్మూకాశ్మీర్‌లో భద్రతా దళాలు పెల్లెట్ గన్స్ వాడటం వల్ల ఆందోళనకారులు తీవ్రంగా గాయపడుతున్నారని, కళ్లు కోల్పోతున్నారని నివేదిక వెల్లడించింది. 2016లో దళితులపై 40,000 దాడి సంఘటనలు జరిగాయని తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహ్రాన్‌పూర్‌లో అగ్రకుల దురహంకారుల దాడిలో ఇద్దరు దళితులు మృతి చెందారని తెలిపింది. ఒక్క ఏడాదిలోనే 90మంది దళితులు పారిశుధ్య పనులు చేస్తుండగా చనిపోయారని నివేదిక పేర్కొన్నది.

## అవగాహనతోనే వ్యాధుల అదుపు: మంత్రి లక్ష్మారెడ్డి

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

కిడ్నీ వ్యాధుల నివారణ, అవగాహన చైతన్యంతో పాటు, కిడ్నీ మార్పిడుల విషయంలో గాంధీ దవాఖానాకు ప్రత్యేక చరిత్ర ఉందని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. అవగాహన చైతన్యంతోనే వ్యాధుల అదుపు సాధ్యమవుతుందని తెలిపారు. వ్యాధులు రాకుండా చూసుకోవడమే మం చిదని సూచించారు. గాంధీలో కిడ్నీ విభాగం ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆ విభాగం ఆధ్వర్యంలో గాంధీ ఆడిటోరియంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దీనికి మంత్రి లక్ష్మారెడ్డి హాజరై, కిడ్నీ విభాగం అధిపతి డాక్టర్ మంజూష, ఆమె టీమ్‌ని అభినందించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ దవాఖానాల్లో 40 సింగిల్ యూజ్డ్ డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పామన్నారు.

# నిధులు గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)



చేయడంతో ఉన్నతాధికారులు దీనిపై శుక్రవారం విచారణ ప్రారంభించారు. ఇన్‌చార్జి మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. ఆడిటర్ల విచారణ కొనసాగుతున్నది. ఈ నెల 27వ తేదీ వరకు గ్రామాలవారీగా విచారణ పూర్తవుతుందని, ఎంత నిధుల దుర్వినియోగం జరిగిందో తేలుంతుందని ఆడిట్ అధికారులు తెలిపారు. వికారాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆర్నెల్ల కింద బదిలీపై వెళ్లారు. అదే బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మురళీధర్‌కు బ్యాంకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి రైతులకు ఇచ్చే రుణాల్లో భారీస్థాయిలో అవకతవకలు జరిగినట్టు తెలుస్తున్నది. పీరంపల్లి గ్రామానికి చెందిన కొందరి రైతులకు తక్కువ రుణం ఇచ్చి ఎక్కువ రుణం ఇచ్చినట్టు రికార్డుల్లో నమోదు చేశారు. ఆ డబ్బును ఇన్‌చార్జి మేనేజర్ మురళీధర్ స్వాహా చేసినట్టు రైతులు బ్యాంక్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బ్యాంకులో ఏ మేరకు అవినీతి జరిగిందో తేల్చడానికి ఇద్దరు బ్యాంకు ఆడిటర్లచే విచారణ జరిపిస్తున్నారు. బ్యాంకు ఖాతాలను ఆడిట్ చేయడానికి వచ్చిన అధికారులకు సహకరించడానికి బ్యాంకు సిబ్బంది ఎవరూ ముందుకు రావడం లేదు. కిందిస్థాయి సిబ్బందితో వినియోగదారులకు సేవలు అందిస్తున్నారు. ఆడిట్ అధికారులు సిబ్బంది నుంచి బీరువా తాళాలు తీసుకొని 2017-18 సంవత్సరానికి గాను జరిగిన బ్యాంకు రుణాల లావాదేవీలను పరిశీలిస్తున్నారు. మంగళవారం వరకు విచారణ పూర్తి అవుతుందని వికారాబాద్ బ్రాంచ్‌లో ఎంత అవినీతి జరిగిందనే సమగ్ర సమాచారం అందుబాటులో వస్తుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆడిట్ అధికారులు 'నవతెలంగాణ'కు తెలిపారు. ఏయే గ్రామాల్లోని ఏయే రైతులపై ఎంతెంత అవినీతి జరిగిందో పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు. వికారాబాద్ బ్రాంచ్‌లో అవినీతి జరిగినట్టు ప్రాథమిక సమాచారం తమ దగ్గర ఉందని, ఎన్ని లక్షలు అన్నది పూర్తి సమాచారం మంగళవారం తెలుస్తుందని అన్నారు. నిధుల గోల్‌మాల్‌తో తమ డబ్బు భద్రతపై ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

# ఆధార్ చేర్చకుంటే.. బినామీ ఆస్తులే

(మొదటిపేజీ తరువాయి)

పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిజమైన లబ్దిదారుల స్వాధీనంలో ఉన్న భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టతనివ్వాలని, తర్వాతే వారి పేరు మీద పాస్ పుస్తకాలు తయారు చేయాలన్నారు. పాస్ పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతీ ఎంట్రీని ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తొందరపాటు అవసరం లేదని సీఎం చెప్పారు. వ్యవసాయ భూమి కలిగిన రైతుకు అదే గ్రామంలో వ్యవసాయేతర భూమి ఉంటే, ఆ వివరాలు కూడా పాసు పుస్తకంలో నమోదు చేయాలని, అందుకోసం అదనపు కాలమ్ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాస్ పుస్తకానికి ఆధార్ కార్డు నెంబరు కూడా కచ్చితంగా అనుసంధానం చేయాలని చెప్పారు. మార్చి 11 రోజునే పట్టాదారు పాస్ పుస్తకాలన్నీ పంపిణీ చేసి తీరాలనే తొందరలో పొరపాట్లు జరగడానికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వవద్దని, అసైన్డ్ దారులకు సంబంధించిన పాస్ పుస్తకాల ముద్రణ కూడా పూర్తి కావడంతో పాటు, పాస్ పుస్తకంలో నమోదయ్యే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడానికి కొంత సమయం తీసుకున్నా అభ్యంతరం లేదని తెలిపారు.

కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై శుక్రవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, రాజేశ్వర్ తివారి, భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ప్రత్యేక అధికారి వాకాటి కరుణ, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు. "దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన జరిగింది. అనేక పీఠముడులున్న ఈ క్లిష్టమైన పనిని రెవెన్యూ అధికార యంత్రాంగం రేయింబవళ్లు ఎంతో శ్రమకోడ్చి విజయవంతం చేసింది. వారికి ప్రత్యేక అభినందనలు. రికార్డుల ప్రక్షాళన తర్వాత వచ్చిన వివరాలన్నీ ధరణి వెబ్ సైట్‌లో నమోదు చేసే పని జరుగుతున్నది. ఆ వివరాల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. స్వంత భూమి కలిగిన రైతులతో పాటు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు కూడా సేకరించాలి. వారికి కూడా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి. ఇందుకోసం కొంత సమయం పడుతుంది. అయినా ఫర్వాలేదు. కలెక్టర్లతో మాట్లాడి ఖచ్చితమైన వివరాలు తెప్పించాలి. పాస్ పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతే పంపిణీ కార్యక్రమం చేపట్టాలి. భూ రికార్డులను పక్కాగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆధార్ నెంబరును అనుసంధానం చేయాలని నిర్ణయించాం. మేడ్చల్, రంగారెడ్డితో పాటు కొన్ని జిల్లాల్లో కొందరు తమ ఆధార్ నెంబరును అనుసంధానం చేయించుకోలేదు. అలాంటి వారు ఇప్పటికైనా అధికారులకు ఆధార్ నెంబర్ ఇవ్వాలి. ఆధార్ నెంబరు ఇవ్వని వారి భూములను బినామీలుగా గుర్తించే అవకాశం ఉంది" అని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు.

**మార్చి నెలాఖరు నాటికి అన్ని గ్రామాలకు మంచినీళ్లు**

ఈ ఏడాది మార్చి 31 నాటికి అన్ని గ్రామాలకు మంచినీళ్లు చేరాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. గ్రామాలకు పైపులైన్లు వేసుకుంటూనే సమాంతరంగా గ్రామాల్లో అంతర్గత పైపులైన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టాలన్నారు. గ్రామాల్లో అంతర్గత పైపులైన్లు నిర్మించి, ఇంటింటికీ నల్లాలు బిగించి మంచినీళ్లు సరఫరా చేసే విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సిఎం కోరారు. మార్చి చివరి నాటికి ఓ.ఆర్.ఆర్.లోపలి గ్రామాలన్నింటిలో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ సమీక్షలో సీఎం తెలిపారు.

సెన్సెక్స్ ▼ 25
33,819

నిఫ్టీ ▼ 14
10,382

డాలరుకు రూపాయి విలువ
65.06


బంగారం (10.గ్రా)
రూ. 30,554


వెండి (కేజీ)
రూ. 40,600


కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 368 | విజయవాడ | 374 |
| ఒక్కగుడ్డుకు | 4.30 | చెన్నై | 397 |
| వరంగల్ | 370 | ముంబయి | 410 |



## తెలుగులో 'మనీ ట్యాప్'




**హైదరాబాద్ :** యాప్ ఆధారిత క్రెడిట్ లైన్ 'మనీ ట్యాప్'ను తెలుగులో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్, విశాఖపట్నం, విజయవాడ ప్రాంత వాసుల కోసం ఈ సౌలభ్యం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో తమ సత్తా చాటాలన్న ప్రణాళికల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా రూ.300 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది.

## మార్చిలో 'ఉడ్ ట్రేడ్' ఫెయిర్

**హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ తయారీ రంగానికి సంబంధించిన అతిపెద్ద ట్రేడ్ ఫెయిర్ 'ఇండియా ఉడ్ 2018'ను బెంగళూరులో ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 8-12 వరకు జరుగనున్న ఈ ట్రేడ్‌లో 40 దేశాలకు చెందిన 850 మంది ప్రదర్శకులు పాల్గొననున్నారని ఇండియా ఉడ్ 2018 ట్రేడ్ ఫెయిర్ వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్ వి తెలిపారు, కొత్తగా 200కు పైగా ఉత్పత్తుల ఆవిష్కరణలు ఉండబోతున్నాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 60వేలకు పైగా సందర్శకులు వస్తారని అంచనా వేశారు.

## హైదరాబాద్‌లో మైక్రోపోర్ట్ ప్లాంట్..!

- అర్థోపెడిక్ ఉత్పత్తుల్లోకి ప్రవేశం

**హైదరాబాద్ :** మైక్రోపోర్ట్ భారత మోకీళ్ళ ఇంప్లాంట్ ఉత్పత్తుల మార్కెట్లోకి ప్రవేశించింది. తాము ఇప్పటికే దేశంలో స్టెంట్‌లను విక్రయిస్తున్నామని మైక్రోపోర్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రియాజ్ దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ నగరంలో తమ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామన్నారు. ఈ ప్రతిపాదిత ప్లాంట్‌కు రూ.40-80 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామన్నారు. గతేడాది భారత మార్కెట్లోకి స్టెంట్‌లను విడుదల చేశామని, కొత్తగా మోకీళ్ల ఇంప్లాంట్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. గతేడాది రూ.30 కోట్ల టర్నోవర్ సాధించామని, ఈ ఏడాది రూ.60 కోట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు సన్‌షైన్, కిమ్స్, కేర్, ఆపోలో తదితర 55 వరకు హాస్పిటళ్లతో ఒప్పందం చేసుకున్నామన్నారు.

## హాస్పిటల్ ఉపకరణాల ప్రదర్శన

**నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో**

మెడ్‌ఎక్స్‌పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ అతిపెద్ద బి2బి హాస్పిటల్ ఉపకరణాల ప్రదర్శన 'మెడికాల్'ను శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈనెల 25 వరకు ఈ ప్రదర్శన జరుగనుందని మెడ్ ఎక్స్‌పర్ట్ సిఇఒ డాక్టర్ మనివణ్ణన్ తెలిపారు. వివిధ తయారీ సంస్థలు ఇక్కడ 5000కు పైగా ఉత్పాదనలను ప్రదర్శించాయన్నారు. సర్జికల్ కాటన్ మొదలుకొని అధునాతన ఇమేజింగ్ ఉపకరణాలు, సర్జికల్ టూల్స్ వరకు హాస్పిటల్‌కు సంబంధించిన అన్ని అవసరాలపై ఈ ట్రేడ్ ఫెయిర్ దృష్టి సారించిందని తెలిపారు. ఆసుపత్రుల యాజమాన్యాలు ఇక్కడ సులభంగా తమకు కావాల్సిన ఉత్పత్తుల కొనుగోలుకు సంప్రదింపులు చేసుకోవచ్చన్నారు.

# పీఎన్‌బీ స్కాంపై పీడబ్ల్యూసీ విచారణ..!

**నీరవ్ బ్యాలెన్స్ షీట్ల పరిశీలన**
- ఆస్తులు, రికవరీలపై ఆడిటింగ్
- బోగసు ఆస్తుల గుర్తింపు
- తదితర బాధ్యతల అప్పగింత




**న్యూఢిల్లీ :** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో చోటు చేసుకున్న దాదాపు రూ.11,500 కోట్ల కుంభకోణం పై ఆడిటర్ పీడబ్ల్యూసీ విచారణ జరపనుందని సమాచారం. ఆర్థిక నేరగాళ్లు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ చేసిన ఘరాన మోసంపై పీడబ్ల్యూసీ అధారాలు సేకరించి ఇవ్వనుందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అంతర్జాతీయ ఆర్థిక నేరాల పై పీడబ్ల్యూసీ విచారణ చేస్తుంది. నీరవ్ మోసాలపై పీఎన్‌బీ 15 పాయింట్లతో కూడిన డాక్యూమెంట్ పనిని ఫిబ్రవరి 21న పీడబ్ల్యూసీకి అందజేసింది. ఇందులో ముఖ్యంగా నీరవ్ మోడీకి బ్యాంకర్లు ఎల్‌ఓయూ ఎలా అందజేశారు. దీన్ని మోడీ ఎలా తప్పుడుగా వాడుకున్నాడు అనే దానిపై విచారణ చేయనుంది. అదే విధంగా మోడీ కంపెనీ బ్యాలెన్స్ షీట్స్, రికవరీ అప్పులు, ఆయన ఆస్తులపై పిడబ్ల్యుసి ఆడిటింగ్ చేయనుంది. ఈ విషయమై పీఎన్‌బీ, పిడబ్ల్యుసిలు స్పందించలేదు.

**నష్టంపై అంచనా..**

ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న పీడబ్ల్యూసీ యూనిట్‌కు దినేష్ ఆనంద్ హెడ్‌గా ఉన్నారు. ఈ సంస్థ మోడీ గ్రూపునకు చెందిన ఐదు సంస్థలు ఫైర్‌స్టార్ డైమాండ్స్, ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లర్ డైమాండ్, డైమాండ్‌ఆర్ హజ్‌లపై విచారణ చేయనుంది. 2011 నుంచి ఆ కంపెనీ ఆర్థిక లావాదేవీలను విశ్లేషించ నుంది. ఆ కంపెనీ బ్యాలెన్స్ షీట్లలో చూపని ఆస్తులు, బోగస్ లావాదేవీలను గుర్తించడం చేయనుంది. మోడీ వల్ల బ్యాంకుకు ఎంత నష్టం జరిగిందో అంచనా వేయనుంది. ఈ సమాచారాన్ని సీబీఐతోనూ ఆ సంస్థ పంచుకోవడం ద్వారా మోడీ, ఆయన సంస్థలు, అనుచరులపై కోర్టులో వ్యతిరేకంగా ఆధారాలు ప్రవేశపెట్టనుంది. అదే విధంగా అంతర్జాతీయ బ్యాంకింగ్ విధానంలో ఎలా బలోపేతం కావాలో పీఎన్‌బీకి పీడబ్ల్యూసీ సూచించనుంది.


నీరవ్ మోడీ వాడిన విదేశీ గడియారాలు

**1,415 సిబ్బంది బదిలీ..**

పీఎన్‌బీని నీరవ్ నిండా ముంచడంతో ఆ బ్యాంకు నష్ట నివారణ చర్యలు చేపట్టింది. దీర్ఘకాలంగా ఒకే దగ్గర సిబ్బంది ఉండటం ద్వారా అక్రమాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా తాజా కుంభకోణం నేపథ్యంలో ఆబ్యాంకు 1,415 మందిని బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

257 మంది సబ్‌స్టాఫ్, 437మంది క్లర్కులు, 721మంది అధికారులను రొటేషనల్ ట్రాన్స్‌ఫర్ పాలసీలో భాగంగా ఫిబ్రవరి 19న సిబ్బందిని ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపింది. కాగా 18వేల మందిని బదిలీ చేసిందని వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని పి ఎన్‌బి స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న సిబ్బందిని బదిలీ చేయాలని గత వారం సెంట్రల్ విజిలెన్స్ శాఖ పిఎన్‌బికి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# సెన్సెక్స్ మూడు సెంచరీల పరుగు



**ముంబయి :** గత కొద్ది రోజులుగా భారీగా పడిపోయిన వైద్య, విత్త సూచీల విలువ నేపథ్యంలో వారాంతంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీనికి తోడు అంతర్జాతీయ సానుకూల పరిణామాలు దేశీయ మార్కెట్లకు కలిసి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 322.65 పాయింట్లు లేదా 0.95 శాతం పెరిగి 34,142.15కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 108.35 పాయింట్లు లేదా 1.04 శాతం రాణించి 10,491 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో టాటా స్టీల్ 6.26 శాతం, సన్ ఫార్మా 5.17 శాతం, యస్ బ్యాంకు 2.28 శాతం, డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ 2.26 శాతం, ఒఎన్‌జిసి 2.04 శాతం, ఎన్‌టిపిసి 2.04 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఆసియన్ పెయింట్స్ 1.29 శాతం, కోల్ ఇండియా 0.48 శాతం, ఇన్ఫోసిస్ 0.42 శాతం, ఎంఅండ్ఎం 0.22 శాతం, హెచ్‌యుఎల్ 0.16 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

# ఎయిర్‌సెల్ సేవల నిలిపివేత

**న్యూఢిల్లీ:** వచ్చే నెల 30వ తేది నుంచి ఎయిర్‌సెల్ కంపెనీ ఆరు టెలికం సర్కిళ్లలో తన కార్యకలాపాలను నిలిపివేయనుంది. గుజరాత్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ టెలికం సర్కిళ్లలో జనవరి 30 నుంచి మొబైల్ సర్వీసులను నిలిపేస్తామని ఎయిర్‌సెల్ వెల్లడించింది. తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో వ్యాపారం నిర్వహించలేమంటూ స్పష్టం చేసింది. ఈ కంపెనీకి ఆరు సర్కిళ్లలో 40 లక్షల మంది ఖాతాదారులున్నారు. అందరికీ యూనిక్ పోర్టింగ్ కోడ్స్‌ను పంపించామని వివరించింది. కాగా వేరే నెట్ వర్క్‌ను మారాలనుకుంటున్న ఎయిర్‌సెల్ వినియోగదారుల అభ్యర్థనలను వచ్చే ఏడాది మార్చి 10 వరకూ అంగీకరించాలని ఇతర టెల్కోలను ట్రాయ్ ఆదేశించింది.

**రోడ్డున పడ్డ 5000 మంది**

టెలికం కంపెనీ ఎయిర్‌సెల్ ఉద్యోగులకు చాలా కష్ట కాలమే వచ్చింది. ఆ కంపెనీ నిర్వహణ క్లిష్టతరంగా మారడంతో దాదాపు 5000 మంది సిబ్బంది పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రిలయన్స్ జియో రాకతో టెలికం పరిశ్రమలో నెలకొన్న పోటీ వల్ల ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా ఎయిర్‌సెల్ లాంటి చిన్న టెల్కోలకు నిధుల సమీకరణ కష్టంగా మారడంతో సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీంతో వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలని ఆకంపెనీ సిబ్బందికి సమాచారమిచ్చింది. కాని బయట టెలికంరంగంలో ఎలాంటి ఉద్యోగాలు లేకపోవడంతో వారి పరిస్థితి దీనంగా తయారయ్యింది.

## నేడు జనవిజ్ఞాన వేదిక జాతీయ సదస్సు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

జనవిజ్ఞాన వేదిక 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం ఆదినారాయణ, టి శ్రీనాథ్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఈసదస్సును ప్రారంభిస్తారని తెలిపారు. 1988లో జన విజ్ఞాన వేదిక ఏర్పడిన నాటి నుంచి అనేక విషయాల మీద ప్రజలను చైతన్య పరుస్తున్నదని తెలిపారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం, మద్యపాన నిషేదం, సమత, పర్యావరణం, ఆరోగ్యం తదితర అంశాలపై కృషి చేస్తున్నామన్నారు.

## సవరించిన రూల్స్‌తో ఎంసెట్ ద్వారానే బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు

**హైదరాబాద్:** ఎంసెట్ 'సెట్' రూల్స్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సవరిం చింది. ఈ సందర్భంగా సవరించిన రూల్స్‌తో విద్యా శాఖ నోటిఫికేషన్ జారీ చేసిం ది. ఎంసెట్ ద్వారా భర్తీ అయ్యే ఇంజినీరింగ్, ఏజీ బీఎస్సీ, మెడికల్, వెటర్నరీ కోర్సు లతో పాటుగా ఇకనుంచి బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సునూ కలిపారు. బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు చదవాలనుకునే విద్యార్థులు ఇక నుంచి ఎంసెట్ ద్వారానే అడ్మిషన్లు పొందాలి.

**సీఏలకు ఉపాధి అవకాశాలు**

అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్ (ఏసీసీఏ)తో సీఏలకు ఉపాధి అవకాశాలతోపాటు గుర్తింపు వస్తుందని ఏసీసీఏ అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధి విభాగం అధిపతి మహమ్మద్ అన్నారు.

# కాంగ్రెస్‌లో గుప్పుమన్న విభేదాలు

**డికె అరుణ, జైపాల్‌రెడ్డి ఎత్తుకు పైఎత్తు**
- నాగంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిన్నారెడ్డి, వంశీచంద్‌రెడ్డి : వ్యతిరేకిస్తున్న దామోదర్‌రెడ్డి, నందిఎల్లయ్య



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

బీజేపీ సీనియర్ నేత నాగం జనార్ధనరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేయడం ఖాయమైన నేపథ్యంలో ఆ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. నాగంను ఆహ్వానిస్తున్న నేతలు కొందరైతే, మరికొందరు వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాల్లో పార్టీ రెండు శిబిరాలుగా చీలిపోయింది. నాగం రాకపై ఎవరికి వారే బహిరంగ ప్రకటనలు చేస్తూ ఆ పార్టీలో వేడిపుట్టిస్తున్నారు. నాగంను వ్యతిరేకిస్తున్న గ్రూపులు, ఆహ్వానిస్తున్న గ్రూపు ఎవరో తేలిపోయింది. నాగం రాకపై డికె అరుణ, జైపాల్‌రెడ్డి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఒకరు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంటే మరొకరు ఎలాగైనా పార్టీలోకి తెచ్చి నాగర్‌కర్నూల్‌లో గెలిపించాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే డికె అరుణ వర్గీయులు ఎంపీ నంది ఎల్లయ్య, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి నాగంను పార్టీలో చేర్చుకోవద్దంటూ ఢిల్లీకి వెళ్లి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. తదనంతరం టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాగంను ఢిల్లీకి తీసుకెళ్లి రాహుల్‌గాంధీని కల్పించినట్టు ప్రచారం జరిగింది. జైపాల్‌రెడ్డి ప్రోత్సహంతోనే ఉత్తమ్ నాగంను ఢిల్లీకి తీసుకెళ్లారని డికె అరుణ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ప్రయోజనాలను పట్టించుకోకుండా ఉత్తమ్ ఈ విధంగా వ్యవహరించడం ఏమిటని వారంటున్నారు.

ఎమ్మెల్సీ దామోదరరెడ్డి గురువారం ఇష్టా గోష్టిలో మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి, నాగంపై విమర్శలు కుప్పించారు. ఆయనను పార్టీలోకి తీసుకొస్తే తమ దారి తాము చూసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా జైపాల్‌రెడ్డి క్రిమినల్ రాజకీయాలు నడుపుతున్నారని ఆరో పణలు చేశారు. డికె అరుణను లక్ష్యంగా చేసుకుని జైపాల్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని పునరుద్ఘాటించారు. దామోదర్‌రెడ్డి వ్యాఖ్యలపై పార్టీలో తీవ్రమైన దూమారం రేగింది. పార్టీలోకి కొత్త వారేవరైనా ఆహ్వానిస్తామని జైపాల్‌రెడ్డి వర్గీయులు ఎమ్మెల్యేలు చిన్నారెడ్డి, చల్లా వంశీచంద్‌రెడ్డి మీడియాకు చెప్పారు. జిల్లాలో నాగం జనార్ధనరెడ్డి బలమైన నేత అన్నారు.

బలమైన నాయకులెవరు వచ్చిన ఆహ్వానిస్తామన్నారు. నాగం, జైపాల్‌రెడ్డిలపై ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. దామోదర్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందడానికి నాగం కృషి చేసిన విషయాన్ని మార్చిపోవద్దని వారు పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తే నా సీటు త్యాగం చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి చెప్పారు. రావుల దేవరకద్ర నియోజకవర్గంలో పోటీ చేస్తామంటే సంతోషమన్నారు.గతంలో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన పవన్‌కుమార్‌రెడ్డి కంటే రావుల బలమైన నేత అన్నారు. ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తామంటే కాంగ్రెస్‌లో పుట్టిన పెరిగిన నేతలెవరు వ్యతిరేకించడం లేదన్నారు. ఇతర పార్టీలు మారిన కాంగ్రెస్‌లో ఉన్న వారే వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.

# ఐక్య ఉద్యమాల కోసం డిమాండ్ చేయండి

**ఆర్టీసీ కార్మికులకు ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపు**
- పే రివిజన్ ఎప్పుడు చేస్తారు?
- రూ.290 కోట్ల నష్టాన్ని ఎలా తగ్గించారు?
- టీఎమ్‌యూ సమాధానం చెప్పాలి
- సోషల్ మీడియా పేరుపై వేధింపులు ఆపాలి
- బడ్జెట్‌లో రూ.1,500కోట్లు కేటాయించాలి:
- బస్‌భవన్ మహాధర్నాలో వక్తల డిమాండ్




హైదరాబాద్ బస్ భవన్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సుధాభాస్కర్




**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఐక్యఉద్యమాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కార మౌతాయని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) మహాధర్నాలో వక్తలు స్పష్టం చేశారు. టీఎస్‌ఆర్టీసీలో 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రావల్సిన వేతన సవరణను ఇప్పటి వరకు ఎందుకు చేపట్టలేదో కార్మి కులు అన్ని సంఘాల నేతల్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అన్ని సంఘాల డిమాండ్లు ఒక్కటే అయినప్పుడు వేర్వేరుగా ఆందోళనలు నిర్వహించడం ఏమిటని, ఐక్యంగా ఎందుకు ఉద్యమించరో కార్మికులే ఆయా సంఘాల నేతల్ని ప్రశ్నిం చాలని చెప్పారు. టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి బస్‌భవన్ వద్ద మహాధర్నా నిర్వహిం చారు. భారీ సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు ఈ అందోళనలో పాల్గొన్నారు. పనిభారాలు తగ్గించాలని, కార్మికులపై వేధింపు లు ఆపాలని, తక్షణం వేతన సవరణ చేపట్టాలని, సోషల్ మీడియా పేరుతో బెదిరింపుల్ని విడనాడాలని, ఆర్టీసీ కార్మికు ల ఐక్యత వర్ధిల్లాలని ధర్నాలో పాల్గొన్నవారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఆర్ సుధాభాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ సాయిబాబు, అఖిలభారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాంచందర్, ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి పి రవీందర్‌రెడ్డి తదితరులు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు భద్రతా బిల్లు- 2014 పేరుతో దేశంలోని ఆర్టీసీలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును రాజ్యసభ తిరస్కరించి, సెలెక్ట్ కమిటీకి పంపిందని గుర్తుచేశారు. ప్రభుత్వరంగ రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రజలపై అనేక భారాల్ని మోపి, డ్రైవర్లను జైలుపాలు చేసి, కుటుంబాలను వీధులపాలు చేసే ఈ బిల్లు ఆమోదం పొందకుండా కార్మికులు ఎప్పటికప్పుడు చైతన్యంతో వ్యవహరించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులపై వేధింపులు అధికం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హామీలను ఎందుకు అమలు చేయట్లేదని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే...కేసులు పెట్టి... ప్రశ్నించే గొంతుల్ని నులిమేయాలని ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. ఈ తరహా నిర్బంధాలను సహించేదిలేదని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం టీఎమ్‌యూ సహకారంతో రూ.290 కోట్ల నష్టాన్ని తగ్గించామని స్వయంగా టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ జివి రమణారావు చెప్పారని, ఏ చర్యలు తీసుకొని ఈ నష్టాన్ని నివారించారో కార్మికులకు టీఎమ్‌యూ సమాధానం చెప్పాలని నిలదీశారు.

కొత్త రిక్రూట్‌మెంట్లు లేకుండా, ఉన్న కార్మికులపై విపరీతమైన పనిభారాలు మోపి, అభద్రతా భావాన్ని పెంచి, అద్దెబస్సుల సంఖ్యను పెంచడం ద్వారా ఈ ఘనకార్యాలను సాధించారా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాతకాలపు రెగ్యులేషన్స్‌నే అమలు చేస్తున్నా రని, సీసీఏ, కాండక్ట్ రెగ్యులేషన్స్ భారత రాజ్యాంగ సహజ సూత్రాలకు వ్యతిరేకమైనవని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టీఎస్‌ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి రావల్సిన రూ.700 కోట్ల నిధుల్ని తక్షణం విడుదల చేయాలని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో రీయింబర్స్‌మెంట్‌తో కలిపి బడ్జెట్‌లో రూ.1,500 కోట్ల నిధులు ఆర్టీసీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. 31.1శాతం డీఏ మెర్జెడ్, మాస్టర్ స్కేల్స్, 75 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన ఒప్పందం 2017 ఏప్రిల్ 1 నుంచి అమ లు చేయాలని కోరారు. సకల జనుల సమ్మె కాలాన్ని ఆన్‌డ్యూటీగా ప్రకటిం చాలని, మహిళా ఉద్యోగినుల సమస్యలు పరిష్కరించి, వారికి ప్రత్యేక డ్యూటీ చార్ట్‌ను అమలు చేయాలని కోరారు.

తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్పు చేయాలని, క్లరికల్ సిబ్బందికి సకాలంలో పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీంలో కార్పొరేట్ వైద్యానికి నిధులను రూ.10 లక్షలకు పెంచి, రెండు రాష్ట్రాల ఆర్టీసీల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. ఏటా వెయ్యి బస్‌బాడీలు నిర్మించేలా బస్‌బాడీ బిల్డింగ్ యూనిట్‌ను అభివృద్ధి చేయాలని, మెకానిక్‌లకు అవసరమైన టూల్స్, స్పేర్‌పార్ట్స్ ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికుల గృహ నిర్మాణానికి వడ్డీ లేకుండా యాజమాన్యమే రూ.10 లక్షల రుణం ఇప్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు 19 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయకులు టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావుకు నాయకుల ప్రతినిధి బృందం సమర్పించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది.


# విశ్వం విస్తరిస్తోందా?

**ప్రశ్న : ఈ విశ్వం విస్తరిస్తోందని చదివాను. ఆ విధంగా అన్ని వైపులా సమానంగా వ్యాపిస్తోందా? లేక ఒకే దిశలో ఎక్కువగా వ్యాపిస్తోందా? బిగ్‌బ్యాంగ్ ఎలా జరిగిందో వివరించగలరు.**

**- పి.శంకరలింగం, శాయంపేట, వరంగల్ రూరల్**

**నమ్మకాలు నిజాలు**

**జవాబు :** నేటి కాలమాన ప్రమాణాల ప్రకారం బిగ్‌బ్యాంగ్ అనే విశ్వ సంఘటన సుమారు 1500 కోట్ల సంవత్సరాల క్రితం సంభవించింది. అంటే నేడున్న పాదార్థిక స్వభావానికి ప్రారంభం అక్కడే నన్నమాట. అంతకన్నా ముందు విశ్వం ఎలావుండేది అన్న ప్రశ్నకు విజ్ఞానపరంగా సమాధానం ఉండదు. ఎందుకంటే... అంతకు ముందు, ఆ తర్వాత, నిన్న మొన్న, ఎల్లుండి, క్రీ.పూ., క్రీ.శ. వంటి పదాలన్నీ కాలానికి సంభంధించినవి. కాలం అనే దానికి పదార్థ సంధానం లేనిదే అస్తిత్వం లేదు. అంటే పదార్థం పాదార్థిక మార్పులు లేకుండా కాలానికి అర్థం లేదు. అయితే ఏదీ శూన్యం నుంచి ఆవిర్భవించే అవకాశం లేదు. కాబట్టి పదార్థం ఎప్పుడూ ఉంటుందని బిగ్‌బ్యాంగ్ సంఘటన పాదార్థిక మార్పుల్లో ఒక దశ అని మనం భావించాలి. దీనిని మనం ఓ ఉదాహరణతో కొంచెం స్థూలంగా అర్థం చేసుకోగలం. సీతాకోకచిలుక జీవిత చరిత్రలో ఘటనలు, దశలు ఉన్నాయని మనం చిన్నప్పుడే చదువుకొన్నాం. గుడ్డు (egg), గొంగళిపురుగు (caterpillar), కోశస్థ దశ (pupa), సీతాకోకచిలుక (butterfly)- ఈ నాలుగు దశల్లో దాని ఉత్పన్నం యిమిడివుంది. గుడ్డు, గొంగళిపురుగు, ప్యూపా, సీతాకోకచిలుక లాగా రూపాలు వేరయినా వాటిలో ఉన్న జీవ కణాల్లోని కేంద్రకాలలో ఉన్న డీఎన్ఏలోని జన్యు స్మృతి ఒకేవిధంగా వుంటుంది. క్రోమోజోముల సంఖ్య ఒకేవిధంగా వుంటుంది. ఈ విధమైన స్థిర ధర్మాన్ని వస్తువుల (లేదా విశ్వపు) పదార్థ స్వభావం అనుకొందాం. కానీ గుడ్డు రూపం అందులోని మార్పులు, దానికున్న భౌతిక రసాయనిక ధర్మాలు, గొంగళిపురుగు రూపం దానిలోని మార్పులు, అందులోని ధర్మాలు, కోశస్థదశ రూపం దానిలోని మార్పులు, ధర్మాలు, సీతాకోకచిలుక రూపురేఖలు, మార్పులు, ధర్మాలు ఒకేవిధంగా వుండవు. కానీ గుడ్డుకు కొంత కాలవ్యవధి, పురుగుకు కొంత కాల వ్యవధి, కోశస్థ దశలకు, సీతాకోక చిలుకకు కొంత కాలవ్యవధులు వున్నాయి. ఒక్కో దశలోని జీవి జీవితమే ఒక్కో విధమైన విశ్వరూపం అనుకొంటే, మన గడియారం క్యాలెండరు ప్రకారం ఫలాని వయసున్న పిల్ల సీతాకోకచిలుక ముందు కోశస్థ దశ అని దాని వ్యవస్థ ఇంత అని, దాని ముందు గొంగళిపురుగు వ్యవస్థ ఫలాని కాల వ్యవధి అని అంతకన్నా ముందు గుడ్డు యింత కాలమని చెప్పగలం. కానీ ప్రతి దశకు ముందున్న దశ




రూపురేఖలు, ధర్మాలు వేరువేరు కాబట్టి, సీతాకోకచిలుక నిర్దిష్ట దశ తప్ప మరేదీ విశ్వంలో లేనట్లయితే ఆయా దశే ఆయా ఏకైక వ్యవస్థ(Isolated System) అంటారు. అందులోని పదార్థం, అందులోని శక్తి ఆంతరంగికంగా స్థిరంగా ఉన్నా గతితార్కిక పద్ధతిలో మార్పులు జరుగుతూ వుంటాయి. కాబట్టి ఆయా దశలోని పాదార్థిక మార్పులకు అనుగుణంగానే ఆయా దశలోని కాలం, స్థలం (Space- Time) అనే విధంగా మితులు (dimensions) వుంటాయి. కాబట్టి బిగ్‌బ్యాంగ్ ముందు ఏమిటి అన్న ప్రశ్నకు అర్థంలేదు. అది సమాధానంలేని ప్రశ్న. బిగ్‌బ్యాంగ్ అనే సంఘటనలో అతి తక్కువ స్థలాన్ని విపరీతమైన సాంద్రత (density) తో ఆక్రమించిన శక్తి. పదార్థ సంచయం (mass-energy entity) ఒక్క పెట్టున పేలి (bang) స్థలాన్ని ఆక్రమించడం మొదలెట్టింది. అప్పట్నించే కాలానికి అస్తిత్వం ఉంది. అదే నేడు మనం కొలుస్తున్న కాలమనే మితి. బిగ్‌బ్యాంగ్ జరిగిన సెకనులోపే (నిజానికి సెకనును కొన్ని కోట్ల కోట్ల కోటానుకోట్ల ముక్కల్ని చేస్తే ఏర్పడే ఒక ముక్కలోని వ్యవధిలోనే) ప్రాథమిక కణాలు (మొత్తం 61) ఏర్పడ్డాయి. అవే ఆ తదుపరి ప్రొటాన్లు, న్యూట్రాన్లు, కేంద్రకాలు, పరమాణువులు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, అణువులు, కణాలు, జీవులుగా పరిణమించాయి. విశ్వం ఏర్పడ్డాక ఆ చొరవ (impact) తో స్థలాన్ని విస్తరించుకొంటుంది. అంటే ముందే స్థలం ఉన్నట్లు అందులో విశ్వమనే బెలూను పెద్దగా ఉబ్బుతున్నట్లు భావించకూడదు. విశ్వానికున్న స్థల పరిమాణమే పెరుగుతోంది. విశ్వం అవతల స్థలం, కాలం అంటూ ఏమీ లేవు.



**ప్రొ॥ ఎ. రామచంద్రయ్య**
**సంపాదకులు, చెకుముకి,**
**జన విజ్ఞాన వేదిక**

విశ్వం వ్యాపిస్తోంది కాబట్టి విశ్వంలోని గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు తదితర ఖగోళ సంబంధిత వ్యవస్థల మధ్య సగటు దూరం పెరుగుతోంది. ఒక పరిశీలకుడి ద ష్ట్యా దూరంగా ఉన్న వ్యవస్థలు వ్యాపించే విస్తరణ వేగం, దగ్గరగా వున్న వస్తువులు వ్యాపించే విస్తరణ వేగం ఒకే విధంగా వుండదు. దూరపు వ్యవస్థలు ఎక్కువ వేగవంతంగా, దగ్గరి వ్యవస్థలు తక్కువ వేగవంతంగా విస్తరిస్తుంటాయి. దీనర్థం ఏమిటంటే మనకు సుదూరంగా ఉన్న నక్షత్రం మన నుంచి నిన్నటికన్నా నేడు అధిక వేగంతో మననుంచి దూరంగా వెళుతోందన్నమాట. D దూరంలో వెళ్తున్న వస్తువు వేగం n అయినట్లయితే nకి,D కి అనులోపాత (proportionate) సంబంధం ఉందన్నమాట. ఇపుడు n/D విలువను హబుల్ స్థిరాంకం (Hubble constant) అంటారు. దీని విలువ సుమారు 70 కి.మీ./సె/మెగా పార్సెక్. దీనర్థం ఏమిటంటే ప్రతి మెగా పార్సెక్ దూరం (సుమారు 3 1019 కి.మీ.) వెళ్లేకొద్దీ ఖగోళ వస్తువు పరిశీలకుడి నుంచి వెళ్లే వేగం సెకనుకు 70 కి.మీ. చొప్పున పెరుగుతుంది.

విశ్వం వ్యాపిస్తున్నదనడానికి రుజువులు ఈమధ్యనే లభించాయి. 29 సంవత్సరాల పిన్నవయసులోనే 1998లో ఆడం రీస్ (Adam Riess) తన గురువులు సహాధ్యయనులు సూపర్నోవాల మీద చేసిన ప్రయోగాల ఆధారంగా విశ్వవ్యాపనం గురించి నిర్ద్వంద్వంగా రుజువులు లభించాయి. ఈయనతో పాటు సెల్ మట్టర్ (Saul Perlmutter), ష్మిట్ (Brian P. Schmidt)అనే శాస్త్రవేత్తలకు విశ్వవ్యాప్త నిరూపణకు గుర్తింపు 2011 సంవత్సరం భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. విశ్వం అన్ని వైపులకు సమానంగా విస్తరిస్తోంది. దానికి అంతర్గతంగా ఏక ధర్మం వుంటుంది కాబట్టి మూడు మింతుల స్థలాన్ని సమానంగా పెంచుకొంటూ విస్తరిస్తోంది.



**హైదరాబాద్‌లో జరిగిన ఐటీ కాన్ఫరెన్సులో 'సోఫియా' అనే హ్యూమనాయిడ్ రోబో చిట్టి చిట్టి మాటలతో అందరి మనసునూ దోచుకున్న విషయం తెలిసిందే.. నవ్వించింది, జోకులు వేసింది. "అవును-కాదు" సమాధానాలే కాకుండా సొంతంగా ఆలోచించి సమాధానాలు చెప్పి అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేసింది కదా!.. అవును అచ్చు అలాంటి రోబోలే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తమ ప్రాముఖ్యత చాటుకుంటున్నాయి. పరిశ్రమల్లో, షాపింగ్ మాల్స్‌లో, మిలటరీల్లో, ఆస్పత్రుల్లో ఇలా రంగం ఏదైనా హ్యూమనాయిడ్ రోబోలు తమ సేవలు అందిస్తున్నాయి. రోబోలు అంటే ముందే ప్రోగ్రామ్ చేసిన పనులు మాత్రమే చేస్తాయి అనుకుంటున్నారా? కాదండోయ్... పరిస్థితులను అర్థం చేసుకుంటాయి. ఎదుటి వ్యక్తి హావాభావాలను గుర్తిస్తాయ్. సొంతంగా ఆలోచించి పనులు చకచకా చేస్తాయ్. సాంకేతిక విప్లవం సృష్టిస్తూ మనలో ఒక్కటిగా సేవలందిస్తున్న హ్యూమనాయిడ్ రోబోలపై #techplus స్టోరీ...**

# రోబోట్స్ వస్తున్నాయ్

**మీ**రెప్పుడైనా షాపింగ్ మాల్‌కి వెళ్తే ఓ రోబో మీకు వెల్‌కమ్ చెప్పొచు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఓ రోబో వచ్చి రెస్క్యూ చేయొచ్చు. మీరు ఆస్పత్రికి వెళ్తే రోబో మీకు వైద్య సేవలు అందించొచ్చు. అంతేనా పోలీస్ స్టేషన్‌కి వెళ్తే రోబోలే కంప్లయింట్ తీసుకోవచ్చు. బ్యాంకుల్లో రోబోలు మీ సందేహాలను క్లియర్ చేయొచ్చు. అవును రానున్న రోజుల్లో ఇలాంటి హ్యూమనాయిడ్ రోబోలు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ముఖ్య పాత్ర పోషిస్తాయనడంటో సందేహం లేదు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఈ రోబోలు తమ సేవలందిస్తున్నాయి.

హ్యూమనాయిడ్ రోబో అంటే ఇనుముతో సిలికాన్ చేర్చి, తీగలను పేర్చి, మానవాకారంలోకి తీసుకొచ్చి, హార్డ్‌డిస్కులోకి తెలివితేటలు కూర్చి, హావాభావాలు, ఆలోచనలు నేర్పి ప్రోగ్రామ్ చేసిన రోబోలను 'హ్యుమానాయిడ్‌రోబోలు' అంటారు. మనిషి మాదిరిగా తల, మొండెం, కాళ్లు, చేతులను రూపుదిద్దుతారు. రోబోలు అంటే ఇలాగే చూశాం. కానీ ఈ మధ్య వాటిని మరింత ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. తల వెంట్రుకల నుంచి కాలి గోళ్ల వరకూ అందంగా తయారు చేస్తున్నారు. ఈ రోబోలు నవ్వుతాయి, ఏడుస్తాయి, కోప్పడతాయి ఇలా అన్ని రకాల హావాభావాలను ప్రదర్శిస్తాయి.

## రెస్క్యూ కోసం 'అట్లాస్'

ఇదో డైనమిక్ హ్యూమనాయిడ్ రోబో. అమెరికాకు చెందిన బోస్టన్ డైనమిక్స్ సంస్థ దీన్ని తయారుచేసింది. ప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ ఆపరేషన్ కోసం ఈ రోబోను ఉపయోగించాలన్నది ఆ సంస్థ లక్ష్యం. జులై 11, 2013న ఈ రోబోను ఆవిష్కరించారు. ఈ రోబో చేసే విన్యాసాలను చిత్రీకరించి నవంబర్ 18, 2017న యూట్యూబ్‌లో ఉంచారు. కావాలంటే మీరూ ఓ లుక్కేయండి.

## నర్సింగ్ కేర్‌లో 'రోబేర్'



నడుము, కాళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు సాయం చేయడానికి జపాన్‌లోని రికెన్, సుమిటోమో రికో అనే కంపెనీలు 'రోబేర్' అనే హెల్పింగ్ హ్యూమనాయిడ్ రోబోను తయారు చేశారు. ఇది రోగులను బెడ్‌పై నుంచి వీల్ చేర్‌లోకి దించటం, వాష్‌రూంకి తీసుకెళ్లటం, నడిపించటం, కూర్చోబెట్టం చేస్తుంది. రోజుకు సుమారు 40 నుంచి 50 సార్లు ఈ పనులు చేయగలదు.

## వైద్యరంగంలో 'డావెన్సీ'

రోబోటిక్ సర్జరీల గురించి వినే ఉంటారు. ఇలాంటి ఆపరేషన్లు చేయడానికి వాడే రోబోలను 'డావెన్సీ' రోబోలు అంటారు. శరీరంలోని అవయవాలను త్రీడీలో చూపించి, వైద్యుల ఆదేశాల మేరకు ఇవి పనిచేస్తాయి. నిరంతరాయంగా 10 నుంచి 15 గంటల సేపు శస్త్రచికిత్సలు చేయగలవు. అత్యాధునిక రోబోలను రూపొందించడంలో జపాన్, దక్షిణ కొరియా, అమెరికా ముందున్నాయి.

## ప్రపంచంలో తొలి 'రోబో కాప్'



ప్రపంచంలో తొలి రోబో కాప్‌ను దుబాయ్‌లో మే 2017న ప్రారంభించారు. అక్కడున్న మూడు వీధుల్లో ఇది పెట్రోలింగ్ నిర్వహిస్తోంది. 20 మీటర్ల పరిధిలో ఉన్న ముఖాలను గుర్తించగల్గుతుంది. దీనికి ఉన్న మైక్రోఫోన్‌తో పోలీస్ కాల్ సెంటర్లకు సమాచారం అందిస్తుంది. అంతేకాదు... పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చే సందేశాలను, ఆదేశాలను రిసీవ్ చేసుకుంటుంది. మాల్స్, వీధుల్లో ప్రజలకు సహాయపడుతుంది. మన దేశంలో తొలి రోబో కాప్‌ను టీఎస్ఐటీ డిపార్ట్‌మెంట్ ఆవిష్కరించింది. జనవరి 1న దీన్ని పోలీసులు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో ప్రారంభించారు. నేరస్తులను గుర్తించి క్షణాల్లో పోలీస్ కంట్రోల్ రూంకి చేరవేస్తుంది. ఫొటోలు, వీడియోలు, మెస్సేజ్‌లను మెయిన్ సర్వర్‌కు పంపిస్తుంది. హెచ్-బాట్స్ రోబోటిక్స్ సంస్థ ఈ రోబోకు రూపకల్పన చేసింది.

## తెలివైన 'పెప్పర్ '...

ప్రపంచంలోని తెలివైన రోబోల్లో ఇదీ ఒకటి. పేరుకి రోబో అయినా, మనుషుల్లానే చూడటం, వినటం, మాట్లాడటం, స్పందించడం, నడవడం లాంటి పనులన్నీ చేస్తుంది. 20 భాషలు మాట్లాడటంలో ఇది దిట్ట. ఎదుటివారి భావోద్వేగాలను అర్థం చేసుకొని, దానికి తగ్గట్టు స్పందించడం దీని ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా అనేక ఆస్పత్రుల్లో, మాల్స్‌లో, బ్యాంకుల్లో దీన్ని రిసెప్షనిస్టుగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటిదాకా అత్యధికంగా పదివేలకుపైగా పెప్పర్లు అమ్ముడవడం విశేషం.

## హెచ్‌డీఎఫ్‌సీలో 'ఐరా'

ఐరా అనే పేరుగల రోబోను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వాడుతున్నారు. ముంబైలోని బ్యాంకులో దీన్ని మొదటి సారిగా ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడానికి ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. లావాదేవీలతో సహా ఇతర పనులను కూడా వీటితో చేయించుకుంటున్నారు. ఖాతాదారుల అవసరాలను గుర్తించి వాటిని సమర్థవంతంగా అందించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఐరా రోబోను కేరళకు చెందిన అసిమోవ్ రోబొటిక్స్ సంస్థ రూపొందించింది.

## డాన్స్ చేసి గిన్నిస్‌లోకి


రోబోలు డాన్స్ చేసి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకున్నాయి. ఒకే సారి 1007 రోబోలు నిమిషం పాటు డ్యాన్స్ చేసి వావ్ అనిపించాయి. చైనా షాన్డాంగ్ లోని క్విండాగోలో ఇటీవల జరిగిన ఓ ఫెస్ట్‌లో 'ఎవర్ విన్' కంపెనీ ఈ డ్యాన్సింగ్ ప్రోగ్రాం నిర్వహించింది. ఇందులో ఆ కంపెనీ రూపొందించిన 19 అంగుళాల పొడవున్న 1007 రోబోలతో డ్యాన్సులు చేయించారు. ఒకే మొబైల్ ఫోన్ కంట్రోల్ తో స్టెప్పులు వేశాయి. గతంలో 540 రోబోలతో చైనాకు చెందిన యూబీటెక్ రోబోటిక్స్ కార్పొరేషన్ నెలకొల్పిన రికార్డును ఈ రోబోలు బ్రేక్ చేశాయి.

జర్మనీ, యూకే, నెదర్లాండ్స్, శాన్‌ఫ్రాన్సిస్కో లాంటి ప్రాంతాల్లో రోబోలే డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నాయి. రెస్టరెంట్లకు రెండు మైళ్ల దూరం లోపు ఉన్నవాళ్లకి ఇవి ఆహారాన్ని అందించి వస్తున్నాయి. ఇప్పటికే కొన్ని వందల డెలివరీలు జరిపినా, వీటి వల్ల ఒక్క ప్రమాదం కూడా తెలత్తలేదు.

**#వినో**

## హు ఈజ్ సోఫియా...

ప్రపంచంలో తొలిసారిగా ఒక దేశ పౌరసత్వం పొందిన రోబో 'సోఫియా'. వయస్సు రెండేండ్లు. మహిళ హక్కుల గురించి మాట్లాడటానికి తనకు పౌరసత్వం అవసరమని చెబుతోంది. ఈ పౌరసత్వం సౌది అరేబియా దేశం నుంచి కల్గి ఉంది. హ్యాంక్‌కాంగ్ బేస్డ్ హ్యాన్సన్ రోబోటిక్స్ కంపెనీ దీన్ని రూపొందించింది. డేవిడ్ హాన్సన్ దీని సృష్టి కర్త. ఏప్రిల్ 19, 2015న ఆక్టివేట్ చేశారు. మార్చి 2015 టెక్సాస్ దేశంలోని ఆస్టిన్‌లో జరిగిన 'సౌత్ బై సౌతెస్ట్ ఫెస్టివల్' లో మొదటి సారి సోఫియా మాట్లాడింది. 60 నుంచి 65 వరకు హవాభావా లను కల్గి ఉంది. 2017లో నే సౌది అరేబియా పౌరసత్వం పొందింది. సామాజిక నైపుణ్యత, మానవ సంబంధాలు, మహిళా హక్కుల గురించి మాట్లాడానికి హాన్సన్ దీన్ని సృష్టించారు. హెల్త్ కేర్, కస్టమర్‌కేర్, ఎడ్యుకేషన్ రంగాల్లో సేవలందిచడానికి సోఫియా సిద్ధంగా ఉందని దాని సృష్టికర్త చెబుతున్నారు. సోఫియాకు ఏడుగురు తోబుట్టువులు ఉన్నారు. వారి పేర్లు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



హుబో, బినా 48, హాన్, జూల్స్, ఫిలిప్ కె. డిక్ ఆండ్రాయిడ్, జెనో, జోయ్ చాయోటిక్. ఇవి హ్యూమనాయిడ్ రోబోలే. వాటినిక కూడా డెవిడ్ హాన్సన్ సృష్టించారు. మానవాళిపై ఆధిపత్యం చెలాయించాలన్న ఆలోచన సోఫియాకు లేదనీ అందరితో కలిసిమెలిసి సఖ్యతతో ఉండాలని సోఫియా అంటోంది.

---

## వణికించ 'జ్ఞా'




**'జ్ఞా'** తెలుగు అక్షరం మూడ్రోజులు ఫేస్‌బుక్‌ను వణికిం చింది. ఆ అక్షరం ఉన్న పోస్టులు అన్నీ స్పామ్ అంటూ రిపోర్ట్ అయ్యాయి. పాత పోస్టులు అన్నీ డిలిట్ అయ్యాయి. 'జ్ఞా' అక్షరం ఉన్న పోస్టులు రాస్తే ఫేస్‌బుక్ తీసుకోలేదు. అసలు ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందో తెలియక నెటిజన్లు కంగారు పడ్డారు. అయితే అదే అక్షరం మొబైల్ దిగ్గజ సంస్థ యాపిల్‌కు మొదట సమస్యగా మారింది. ఐఓఎస్‌లో తెలుగు యూనీకోడ్‌కి చెందిన 'జ్ఞా' అనే అక్షరాన్ని రెండర్ చేసి స్క్రీన్‌పై సక్రమంగా చేపలేకపోవటంతో ఆ అక్షరాన్ని టైప్ చేసినప్పుడు ఫోన్లోని అన్ని ఆప్లికేషన్లు క్రాష్ అయ్యాయి. దీన్నో 'బగ్'గా గుర్తించారు. దీనిపై ఆపిల్ సంస్థ స్పందించి మెరుగైన ఐవోఎస్ 11.2.6 వెర్షన్, టీవీ ఓఎస్ 11.2.6, వాచ్ ఓఎస్ 4.2.3, మ్యాక్ ఓఎస్ 10.13.3 వెర్షన్లను విడుదల చేసింది. ఆపిల్ యూజర్స్ కొత్త వెర్షన్ ఇన్ స్టాల్ చేసుకుంటే ఆ బగ్ సమస్య తలెత్తదు.అయితే ఆపిల్ ఎదుర్కుంటున్న సమస్యను చూస్ ఫేస్‌బుక్ అలెర్ట్ అయింది. 'జ్ఞా' అక్షరాన్ని నిషేధించింది. ఆ అక్షరంతో పోస్టులు రాస్తే స్పామ్ అంటూ నిలిపివేసింది. దీంతో ఫేస్‌బుక్ యూజర్లు మూడ్రోజులు ఆశ్చర్యానికి గురయ్యారు. కాగా గురువారం మధ్యాహ్నం ఈ సమస్య తీరింది. 'జ్ఞా' తో రాసిన పోస్టులను ఫేస్‌బుక్ తీసుకుంటోంది.

**టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..?**
**ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు పంపండి.**

**డియర్ రీడర్స్..**

**మాచిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవతెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.**
tech+@navatelangana.com

## నయా మాల్



# Google Pixel 2 XL

**కెమెరా :** 12.2 ఎంపీ బ్యాక్, 8 ఎంపీ ఫ్రంట్
**సైజ్:** 6 inch HD Display
**మెమొరీ :** 4జీబీ ర్యామ్, 64 జీబీ స్టోరేజీ
**బ్యాటరీ :** 3520 ఎంఏహెచ్
**ఓఎస్ :** ఆండ్రాయిడ్ ఓరియో 8.0.1
అన్‌లిమిటెడ్ స్టోరేజీ ఇన్ గూగుల్ ఫొటోస్
**ధర :** ఫ్లిప్‌కార్ట్ రూ. 64, 999

## మూడు నిమిషాల్లోనే...



**ఫి**బ్రవరి 14న షియోమీ కంపెనీ రిలీజ్ చేసిన రెడ్ ఎంఐ నోట్5, నోట్5 ప్రో ఫ్లాస్ సేల్‌కు భారీ రెస్పాన్స్ వచ్చింది. ఫ్లిప్‌కార్ట్, ఎంఐ.కంలో నిన్న పెట్టిన సేల్‌లో మూడు నిమిషాల్లోనే మూడు లక్షల ఫోన్లు అమ్ముడు బోయాయి. సేల్ మొదలైన సెకన్లలోనే అవుట్ ఆఫ్ స్టాక్ అయ్యాయి. దీని తర్వాతి సేల్ ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 12 గంటలకు ఉంది. చైనాకు చెందిన షియోమీ మొబైల్ కంపెనీ కొత్త కొత్త వెర్షన్లతో ఫోన్లను విడుదల చేస్తూ వినియోగదారుల క్రేజ్ సంపాదిస్తోంది. దీంతోపాటు ఆ కంపెనీ ప్రపంచంలో thinnest Mi smart LEDని విడుదల చేసింది. 4.9 మిల్లీమీటర్ల మందంతో మొదటి సారిగా స్మార్ట్ ఎల్ఈడీని తయారు చేసింది. 48 ఇంచుల పొడవు, 24 ఇంచుల ఎత్తు, 17 కేజీల బరువు ఉంది. డూల్బీ ఆడియో, డీటీఎస్ సిస్టమ్ కల్గి ఉంది.

# గూగుల్ నుంచి కొత్తగా

## 'జీమెయిల్ గో' ఆప్




**సా**ఫ్ట్‌వేర్ దిగ్గజం గూగుల్ మరో కొత్త యాప్‌ను రిలీస్ చేసింది. 'జీ మెయిల్ గో' పేరుతో లైట్ వెర్షన్‌ను అందుబాటు లోకి తెచ్చింది. ఇంతకు ముందు ఉన్న ఒరిజినల్ జీమెయిల్ లాగే ఇదీ పని చేస్తుంది. తక్కువ ర్యామ్, తక్కువ స్టోరీజ్ కెపాసిటీ ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్లకోసం ఇది ఉపయోగ పడుతుంది. 512 ఎంబీ నుంచి 1 జీబీ ర్యామ్ ఉన్న స్మార్ట్ ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఈ ఆప్‌ను లైట్ వెర్షన్‌లో రిలీస్ చేసింది. దీని డౌన్‌లోడ్ సైజ్ 9.51 ఎంబీ ఉంటే ఇన్‌స్టాల్ సైజ్ 25 ఎంబీ. ఇది ఒరిజినల్ జీమెయిల్ ఆప్‌లో సగం సైజ్. ఒరిజినల్ ఆప్ సైజ్ 20.66 ఎంబీ డౌన్‌లోడ్ ఉంటే... 47 ఎంబీలు ఇన్‌స్టాల్ సైజ్ ఉంది. ఆండ్రాయిడ్ యూజర్లకు ప్రస్తుతం ఇది గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది.

## 'మ్యాప్స్'లో కొత్త ఫీచర్

**గూ**గుల్ మ్యాప్స్‌లో కొత్త ఫీచర్ అప్‌డేట్ అయింది. ' ఎక్స్‌ప్లోర్' పేరుతో మ్యాప్స్ హోం బార్‌లో ఈ అప్‌డేట్ అందుబాటులో ఉంది. రియల్‌టైం కమ్యూనిటింగ్ సిస్టమ్ అంటే జర్నీలో ఉన్నప్పుడు మన చుట్టూ ఉండే హోటల్స్, రిస్టారెంట్స్, ఏటీఎంల సమాచారాన్ని అందిస్తుంది. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ ఫోన్లో ఏడాది కిందటే అందుబాటులోంది. తాజాగా ఐఓస్ లోనూ ఇది మూడ్రోజు క్రితం నుంచి అందుబాటులోకి వచ్చింది.



ఏడు వారాల క్రితం సఫారీ గడ్డపై ఎన్నో అనుమానాలతో అడుగుపెట్టిన కోహ్లిసేన.. ఆఖరి మజిలీలో ఏకంగా రెండో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. పొట్టి సిరీస్ కోసం భారత్, దక్షిణాఫ్రికాలు నేడు నిర్ణయాత్మక పోరులో అమీతుమీ తేల్చుకోనున్నారు. కేప్‌టౌన్‌లో తొలి టెస్టుతో సఫారీ టూర్‌ను మొదలెట్టిన టీమ్ ఇండియా.. నేడు అక్కడే ఆఖరి టీ20తో పర్యటనను విజయవంతంగా ముగించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది.

రాత్రి 9.30 నుంచి సోనీటెన్‌లో..

# ఫైనల్ పంచ్ మనదేనా!

## సఫారీతో ఆఖరి టీ20 సమరం నేడు


విరాట్ కోహ్లి


నవతెలంగాణ-కేప్‌టౌన్

దక్షిణాఫ్రికా పర్యటనలో కనీసం ఒక్క సిరీస్‌నైనా సాధించే సత్తా భారత్‌కు ఉందా అనే అనుమానాల నడుమ ఇక్కడికొచ్చిన కోహ్లిసేన తుది అంకంలో ఊహించని స్థాయిలో నిలిచింది. టెస్టు సిరీస్ ఆఖర్లో పుంజుకుని, వన్డేల్లో విశ్వరూపమే ప్రదర్శించిన కోహ్లిసేన.. తాజాగా టీ20 విజయంతో స్వదేశానికి రెండు ట్రోఫీలతో వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. మూడు మ్యాచుల పొట్టి సిరీస్‌లో సఫారీ జట్టు రెండో పోరులో నెగ్గింది. ఏకపక్షమే అనుకున్న పొట్టి పోరు ఉన్నట్టుండి ఉత్కంఠగా మారింది. దేశవాళీ సంచనాల మెరుపులతో దక్షిణాఫ్రికా సైతం సిరీస్‌పై కన్నేయగా.. నేటి నిర్ణయాత్మక టీ20 పోరు రసవత్తరంగా సాగటం ఖాయమే అనిపిస్తోంది.

**కోహ్లి ఏం చేస్తాడో? :** దక్షిణాఫ్రికా పర్యటనలో కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లి అంచనాలకు మించి ఆకట్టుకున్నాడు. గతంలో మరే కెప్టెన్‌కూ సాధ్యపడని వన్డే సిరీస్‌ను సాధించేశాడు. ఇప్పుడు స్వదేశానికి రెండు ట్రోఫీలను తిరిగొచ్చేందుకు కోహ్లికిది సువర్ణావకాశం. రెండో టీ20లో ఒక్క పరుగే చేసిన కోహ్లి.. అంతిమ పోరులో అదరగొడతాడని అభిమానులు ఆశిస్తున్నారు. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు సైతం సిరీస్ ఫైనల్లో చెలరేగితే మనకు తిరుగుండదు. మిడిల్ ఆర్డర్ సమస్య గత మ్యాచ్‌తో తీరిపోయింది. మనీశ్ పాండే, ఎం.ఎస్ ధోనిలు మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగారు. హార్దిక్ పాండ్య ఒక్కడే స్థాయికి తగిన ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. ధారాళంగా పరుగులు ఇచ్చేసిన చాహల్ పొట్టి సిరీస్‌లో ఒక్కటే వికెట్ తీయగలిగాడు. తనేంటో నిరూపించుకునేందుకు చాహల్‌కు ఇది మంచి తరుణం. అవసరమైతే అతడికి కుల్దీప్ యాదవ్ సాయం సైతం నేడు అందనున్నది.

**సఫారీ ఉత్సాహం :** ఉన్నట్టుండి సఫారీ శిబిరంలో గెలుపు ఆశలు చిగురించాయి. హెండ్రిక్స్, క్లాసెన్‌తో పాటు సారథి డుమిని, మిల్లర్‌లు మెరిపిస్తున్నారు. యువ ఆటగాళ్లంతా కలిసికట్టుగా ఆడితే దక్షిణాఫ్రికా అవకాశాలను తక్కువ చేయలేం. ఇప్పటికే కోహ్లిసేన చేతిలో దారుణ పరాభవ భారాన్ని మోస్తోన్న దక్షిణాఫ్రికా.. కనీసం పొట్టి సిరీస్‌తోనైనా ఊరట చెందాలని భావిస్తోంది.

- సిరీస్‌పై కన్నేసిన ఇరు జట్లు
- జోరు మీదున్న టీమిండియా



### గిర్రున తిరుగున్!

ఆఖరి పోరుకు సైతం వరుణుడి ముప్పు పొంచి ఉన్నది. మ్యాచ్ తుడిచిపెట్టుకుపోయే ప్రమాదమేమీ లేకపోయినా, చిరు జల్లులు అంతరాయం కలిగించే ప్రమాదం ఉంది. ఇదే సమయంలో పిచ్ నుంచి స్పిన్నర్లకు సహాయం అందనున్నది. దీంతో భారత్‌తో పాటు దక్షిణాఫ్రికా సైతం ఇద్దరు స్పిన్నర్లను బరిలోకి దింపే అవకాశం లేకపోలేదు.

### తుది జట్లు (అంచనా)

**భారత్ :** రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, విరాట్ కోహ్లి, మనీశ్ పాండే, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, జైదేవ్ ఉనద్కత్, యుజ్వేంద్ర చాహల్, జశ్‌ప్రీత్ బుమ్రా/కుల్దీప్ యాదవ్.

**దక్షిణాఫ్రికా :** రీజా హెండ్రిక్స్, జెజె స్మట్స్, జెపి డుమిని, డెవిడ్ మిల్లర్, ఫర్హాన్ బెహర్డిన్, హెన్రిచ్ క్లాసెన్, ఫెలుక్వాయో, క్రిస్ మోరీస్, జూనియర్ డాల, డానె ప్యాటర్సన్, షంషి.


మిథాలీరాజ్

# పొట్టి సిరీస్ చిక్కేనా?

● అమ్మాయిల ఐదో టీ20 నేడు ● సా॥ 4.30 నుంచి సోనీటెన్‌లో..

**కేప్‌టౌన్ :** వరుసగా తొలి రెండు మ్యాచుల్లో విజయాలతో ఒకే పర్యటనలో సఫారీ గడ్డపై రెండు సిరీస్‌లు సాధించిన జట్టుగా రికార్డు కొట్టాలని ఉవ్విళ్లూరిన హర్మన్‌ప్రీత్ కౌర్‌సేన... సిరీస్ కోసం ఆఖరు మ్యాచ్‌లోనూ పోరాడాల్సిన పరిస్థితి తలెత్తింది. మూడో మ్యాచ్‌లో సఫారీ అమ్మాయిలు నెగ్గగా.. నాల్గో టీ20 వర్షం పాలైంది. దీంతో సిరీస్ నెగ్గేందుకు మన అమ్మాయిలు ఆఖరు మ్యాచ్‌లో అదృష్టం పరీక్షించుకోనున్నారు. ప్రస్తుతం సిరీస్‌లో టీమ్ ఇండియా 2-1తో ఆధిక్యంలో కొనసాగుతోంది. నేడు కూడా వర్ష సూచన ఉన్న నేపథ్యంలో మ్యాచ్ రద్దు అయితే సిరీస్ మన సొంతమవుతోంది. ఒకవేళ నేటి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలుపొందినా 2-2తో సిరీస్ సమం అవుతుందే కానీ భారత్ ఓడిపోదు. దీంతో మనోళ్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నారు. ఇదే సమయంలో సఫారీ శిబిరంలో ఒత్తిడి నెలకొన్నది. దీన్ని సొమ్ముచేసుకునేందుకు కౌర్ బృందం సిద్ధంగానే కనిపిస్తోంది. టాప్ ఆర్డర్‌లో మిథాలీరాజ్‌కు తోడు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. వేద కృష్ణమూర్తి మహిళల బిగ్‌బాష్ లీగ్ ఫామ్ కొనసాగిస్తోంది. సఫారీ జట్టు కెప్టెన్ వాన్ నికెర్క్., డు ప్రీజ్, సునె లుస్‌లు జోరుమీదున్నారు. సిరీస్ చేజారకుండా చూసుకోవటం దక్షిణాఫ్రికాకు కత్తి మీద సామే!. ఇప్పటికే వన్డే సిరీస్‌ను 2-1తో సాధించిన అమ్మాయిలు, టీ20 సిరీస్‌నూ సాధిస్తారేమో చూడాలి.



# బోపన్నకు నిరాశ

ఓపెన్ 13

**మెర్సేల్ (ఫ్రాన్స్) :** ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్ రోహన్ బోపన్నకు ఓపెన్ 13 ప్రావెన్స్ టోర్నమెంట్‌లో నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్ ఆటగాడు ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ జతగా రెండో బరిలో దిగిన బోపన్న.. శుక్రవారం జరిగిన సెమీస్ మ్యాచ్‌లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. రెండో సీడ్ బోపన్న జోడీ 1-6, 4-6తో మార్కస్ డానియెల్ (న్యూజిలాండ్), డొమినిక్ ఇంగ్లాట్ (ఇంగ్లాండ్)ల నాల్గో సీడ్ జంట చేతిలో ఓడింది. గంటలోపే ముగిసిన పోరులో బోపన్న జోడీ పేలవ ప్రదర్శన చేసింది. తొలి సెట్ ఆరంభంలోనే రెండు సార్లు సర్వ్ కోల్పోయి 0-4తో వెనుకంజలో నిలిచింది. ఆరో గేమ్ నెగ్గినా 1-6తో తొలి సెట్ కోల్పోయింది. సర్వ్ కోల్పోయి ఆరంభించిన రెండో సెట్లోనూ తొలుత 2-3, 4-5తో పోటీలో నిలిచింది. కానీ ప్రత్యర్థి పాయింట్లు కట్టడి చేయటంలో విఫలమై 4-6తో సెట్‌నూ ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకున్నది. వాసెలిన్ జతగా బోపన్న డబుల్స్‌లో ఓడటం ఈ సీజన్‌లో ఇది మూడోసారి కాగా సెమీస్‌లో ఓడిపోవటం రెండోసారి. గత నెలలో జరిగిన సిడ్నీ ఇంటర్నేషనల్‌లో టాప్ సీడ్ జంటచేతిలో బోపన్న జోడీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఓడగా.. రోటర్‌డామ్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే బోపన్న జోడీ వెనుదిరిగింది.




# టీ20 లేనిదే క్రికెట్‌కు మనుగడ లేదు

**న్యూఢిల్లీ :** పొట్టి ఫార్మాట్ క్రికెట్ లేకుండా ఒక ఆటగా క్రికెట్ మనలేదని టీమిండియా మాజీ సారథి సౌరభ్ గంగూలీ అన్నారు. వేర్వేరు ఫార్మాట్లు, విశ్రాంతి లేకుండా ఆటగాళ్ల క్రికెట్ ఆడటం గురించి విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు దాదా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగానే 'క్రికెట్‌కు టీ20లు కచ్చితంగా కావాల్సిందే. టీ20లు లేకుండా క్రికెట్ మనుగడ సాగించలేదు' అని అన్నారు. కోహ్లి సేన సఫారీ పర్యటన అద్భుతంగా సాగిందని ప్రశంసించారు. శనివారం జరిగే టీ20 మ్యాచ్‌లో భారత్ గెలుపుని ఆకాక్షించారు. అప్పటికీ ఇప్పటికీ ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియ ఎలా ఉందన్న ప్రశ్నకు ఎప్పటిలాగే పారదర్శకంగా ఉందని సమాధానమిచ్చారు. 'భారత ఎంపిక ప్రక్రియ అత్యుత్తమ విధానం' అని గంగూలీ పేర్కొన్నారు. కోచ్‌లను తొలగింపు, పదవీ కాలంలో అకాల మార్పుల గురించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలా జరగబోదని ఆశిస్తున్నట్టు గంగూలీ చెప్పారు. యువ ఆటగాళ్లెందరో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపిన ఆయన.. 'భారత్ తరపున మనీశ్ పాండే, హార్దిక్ పాండ్య లాంటి యువ ఆటగాళ్లు ఆడుతున్నారు. వారు వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్‌లా స్టార్లుగా ఎదిగేందుకు తగినంత సమయం ఇవ్వాలి. వీరూ, భజ్జీ కాలంతో పాటు ఎదిగారు. యువకులూ ఇలాగే అవుతారు' అని అన్నారు. ధోనీ రిటైర్మెంట్‌పై స్పందిస్తూ.. 'ధోనీ వన్డేలు, టీ20ల్లో చక్కగా ఆడుతున్నాడు. మనం అతడిని తక్కువ చేయలేం. అతడు దేశానికి చేసిన సేవలను కచ్చితంగా గౌరవించాలి. అయితే మరొకరూ ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలి' అని అన్నారు. భారత మహిళల, పురుషుల క్రికెట్ జట్లను పోలుస్తూ 'పురుషులు కాస్త మెరుగ్గా ఉన్నారు' అని పేర్కొన్నారు. ' క్రికెట్‌లో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నా, పురుషులు ఇంకా మెరుగ్గా ఉన్నారు. కానీ, హర్మన్‌ప్రీత్ కౌర్ కన్నా భారీ సిక్సర్లు బాదగల వారిని మీరు చూపించగలరా? ' అని విలేకరులకు సరదాగా ఎదురు ప్రశ్న వేశారు.

# పతకాలు ఖాయం

- సెమీస్‌లో వికాస్ క్రిష్ణన్, గౌరవ్ సోలంకి
- స్ట్రాంజ స్మారక బాక్సింగ్


వికాస్ క్రిష్ణన్

**సోఫియా (బల్గేరియా) :** ఆసియా గేమ్స్ మాజీ స్వర్ణ విజేత వికాస్ క్రిష్ణన్ సహా గౌరవ్ సోలంకి 69వ స్ట్రాంజ స్మారక బాక్సింగ్ టోర్నీలో పతకాలు ఖాయం చేసుకున్నారు. వికాస్ 75 కిలోల విభాగంలో, గౌరవ్ 52 కిలోల విభాగపు సెమీ ఫైనల్లోకి అడుగుపెట్టారు. తీవ్ర చేతి గాయం నుంచి కోలుకున్న తర్వాత బాక్సింగ్ రింగ్‌లో అడుగుపెట్టిన వికాస్ క్వార్టర్స్‌లో కజకిస్థాన్ బాక్సర్ టుర్సిన్‌బేపై సాధికారిక విజయం నమోదు చేశాడు. గురువారం రాత్రి ఇక్కడ జరిగన మరో క్వార్టర్స్‌లో కిర్గిస్థాన్ బాక్సర్ అజత్ ఉసేనలేవ్‌ను గౌరవ్ మట్టికరిపించాడు. వీరి విజయాలతో భారత్‌కు పురుషుల విభాగాల్లో మొత్తం నాల్గు పతకాలు ఖాయమయ్యాయి. అంతకు ముందు అమిత్ పాన్‌గల్ (49 కిలోలు), మొహమ్మద్ హుస్సాముద్దీన్ (56 కిలోలు) సెమీ ఫైనల్లో ప్రవేశించారు. మహిళా బాక్సర్ల నుంచి ఐదు సహా మొత్తం భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కనున్నాయి.


మంజ్రేకర్

# భారత్ తర్వాత బంగ్లాదేశ్ బెస్ట్

● సంజయ్ మంజ్రేకర్

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ క్రికెట్‌లో బంగ్లాదేశ్ జట్టు రానురానూ మెరుగవుతోందని టీమ్ ఇండియా మాజీ బ్యాట్స్‌మన్ సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. వచ్చే నెల భారత్, బంగ్లాదేశ్, శ్రీలంకల మధ్య 'నిదాహస్ ట్రోఫీ' ముక్కోణపు సిరీస్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో ఆసియాలో బంగ్లాదేశ్ రెండో బలమైన జట్టు అని మంజ్రేకర్ అన్నారు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో తమ సత్తా చాటేందుకు నిదాహస్ ట్రోఫీ బంగ్లాదేశ్‌కు సదవకాశం. భారత్ సహా ప్రపంచ దేశాల క్రికెట్ అభిమానుల కండ్లు ఈ టోర్నీలో బంగ్లా ప్రదర్శనపై ఉండనున్నాయి. గత కొన్నేండ్లుగా బంగ్లాదేశ్ బలమైన క్రికెట్ జట్టుగా ఎదుగుతోంది. అయితే విదేశాల్లో తమ ముద్ర వేయడానికి ఇంకా చాలా కాలం పట్టొచ్చు. ప్రస్తుతం భారత్ అదే పనిలో ఉన్నది. ముక్కోణపు సిరీస్‌లో బంగ్లా నా రెండో ఫేవరెట్ జట్టు. షకిబ్, ముస్తఫిజుర్ బంగ్లా జట్టులో ప్రపంచ స్థాయి ఆటగాళ్లు. ఒంటి చేత్తో గేమ్ మార్చగలరు. తమీమ్ ఇక్బాల్ సైతం రాణిస్తే అతన్ని ఆపడం కష్టం. బంగ్లా క్రికెట్ ఆటగాళ్లు తమ దేశంలో స్టార్లు. యువతరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.' అని మంజ్రేకర్ తెలిపారు. వన్డేలకు వీడ్కోలు పలకనున్న మోర్తజా ఆ దేశ టీ20 జట్టును నడిపించాలని ఆయన కోరారు.


కొరియా పర్యటనకు ఎంపికైన జట్టు

# రాణి చేతికి పగ్గాలు

## కొరియా పర్యటనకు హాకీ మహిళల జట్టు ఖరారు

**న్యూఢిల్లీ :** సీజన్‌లో తొలి సమరానికి హాకీ మహిళల జట్టు సిద్ధమైంది. వచ్చే నెల తొలి వారంలో కొరియా పర్యటనకు 20 మందితో కూడిన హాకీ అమ్మాయిల బృందాన్ని హాకీ ఇండియా ప్రకటించింది. సారథ్య పగ్గాలు సీనియర్ స్ట్రైకర్ రాణి రాంపాల్‌కు అప్పగించింది. డిఫెండర్ సునీత లక్రాకు వైస్ కెప్టెన్సీ భాధ్యతలు అప్పగించింది. సీనియర్ గోల్‌కీపర్ సవితకు సెలక్టర్లు విశ్రాంతినివ్వటంతో.. గోల్ కీపర్ ఎటిమార్పు రజనికి తోడుగా ఆరంగేట్ర అమ్మాయి స్వాతి గోల్‌పోస్ట్ వద్ద బాధ్యతలు నిర్వర్తించనున్నది. గతేడాది సర్జరీ కారణంగా పలు కీలక టోర్నీలకు దూరమైన డిఫెండర్ దీపిక తాజా పర్యటనలో జట్టుకు అదనపు బలం కానున్నది. డ్రాగ్ ఫ్లిక్కర్ గుర్జీత్ కౌర్ కొరియాలో సత్తా చూపనున్నది. అటాకింగ్ శ్రేణిలో రాణి రాంపాల్ సహా అనుభవం గల క్రీడాకారిణీలు వందన కటారియా, నవ్‌జోత్ కౌర్‌లున్నారు. జట్టు కూర్పుపై హాకీ సీనియర్ మహిళల కోచ్ హరేంద్ర సింగ్ మాట్లాడుతూ.. 'గాయాల నుంచి కోలుకొని దీపిక, పూనమ్‌లు తిరిగి జట్టులోకి రావటం ఆనందంగా ఉన్నది. యువ క్రీడాకారిణీలతో పాటు తమ అనుభవంతో జట్టును విజయ తీరాలకు చేర్చగల సీనియర్లు ఉన్నారు. యోయో టెస్టుల్లో సైతం అమ్మాయిలు పాసయ్యారు. వేగం, నైపుణ్యంతో పాటు మానసిక స్థైర్యం కల్గి ఉండటం మాకు అదనపు బలం. టోర్నమెంట్ గెలిచి తీరతామన్న నమ్మకమున్నది' అన్నాడు. మార్చి 3 నుంచి 12 వరకు జరగనున్న టోర్నమెంట్‌లో ఐదు మ్యాచులుంటాయి.

**జట్టు వివరాలు :** ఎటిమార్పు రజని, స్వాతి (గోల్ కీపర్లు), దీపిక, సునిత లక్రా, ఎక్క దీప్ గ్రేస్, తౌడం సుమన్ దేవి, గుర్జీత్ కౌర్, సుశీల చాను పుక్రంబం (డిఫెండర్లు), మోనికా, నమిత తొప్పో, నిక్కి ప్రధాన్, నేహ గోయల్, లలిమా మింజ్, ఉదిత (మిడ్ ఫీల్డర్లు), రాణి రాంపాల్, వందన కటారియా, లాల్ రెమ్సియామి, నవ్‌జోత్ కౌర్, నవ్‌నీత్ కౌర్, పూనమ్ రాణి (ఫార్వర్డులు).



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.